




ESTD: 1999

www.voodayam.com

# వుదయం








ఖమ్మం | 17-05-2026 ఆదివారం | సంపుటి : 13 | సంచిక : 306 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 1.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously published from Khammam, Hyderabad, Adilabad, Karimnagar, Guntur & Warangal

Follow us on


## ఇంధన ధరల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

### కేంద్రానికి సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్



**హైదరాబాద్, మే 16 :**
దేశవ్యాప్తంగా ఇంధన ధరల పెంపు విశ్వాస ఘాతుకమని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. తక్షణమే ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం అయన ఎక్స్ వేదికగా కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ధరల పెంపు నిర్ణయం సామాన్యుల పాలిట పిడుగుపాటు లాంటిదని చెప్పారు. ఇరాన్‌ఇజ్రాయిల్ యుద్ధాన్ని సాకుగా చూపి ఇంధన ధరలను పెంచడం ద్వారా ప్రజల నడ్డి విరిచారని సీఎం విమర్శించారు. ఇటీవల జరిగిన నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతం ఎన్నికల ముందు "ధరలు పెంచబోం" అని పదే పదే ప్రకటించిన మోదీ ప్రభుత్వం.. ఫలితాలు వచ్చిన పది రోజులు కూడా కాకముందే ఈ నిర్ణయం తీసుకోవడం ముమ్మాటికీ ప్రజల నమ్మకాన్ని వంచించడమేనని విమర్శించారు. ఇది ముమ్మాటికీ విశ్వాస ఘాతుకమని సీఎం ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వ అసమర్థ పాలన, అనాలోచిత విధానాల కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైందన్న సీఎం... పదేళ్లుగా రూపాయి విలువ పతనం పరాకాష్టకు చేరిందని ఆరోపించారు. 'ఆత్మనిర్భర్ భారత్' అనేది కేవలం ఓట్లు రాల్చే నినాదం గానే మిగిలిపోయిందని, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు దెబ్బతిని యువత ఉపాధి కోల్పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశాన్ని మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిపామని చెప్పుకునే కేంద్రం ఈ పెంపును ఎలా సమర్థించుకుంటుందని ప్రశ్నించారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్‌కు రూ.10 పెరిగే అవకాశం!

- నిన్న లీటర్‌పై రూ.3 పెంపు
- సమీప భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశం
- దశలవారీగా రూ.10 పెంచే అవకాశం




**హైదరాబాద్, మే 16 :**
భారతదేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్ పైన రూ.10 వరకు పెరిగే అవకాశముందని ఎంకే గ్లోబల్ విశ్లేషకులు పేర్కొన్నారు. అయితే ఈ పెంపు ఒకేసారి లేదా దశలవారీగా ఉండవచ్చని అభిప్రాయపడ్డారు.

మిగతా 2లో..

## నీట్ పేపర్ లీకేజ్‌లో దర్యాప్తు ముమ్మరం

### రెండవ ప్రధాన సూత్రధారి అరెస్టు

**నీట్-యూజీ బయాలజీ పేపర్‌ను లీక్ చేసినట్లు గుర్తించిన సీబీఐ**

- ఇప్పటికే పుణేకు చెందిన కెమిస్ట్రీ లెక్చరర్ అరెస్టు
- పుణేకు చెందిన ఒక సీనియర్ మహిళా బాటనీ లెక్చరర్ కూడా అరెస్టు

> పత్రాల లీకేజీ దర్యాప్తులలో ఎన్‌టీఏలోనే లీకేజీ మూలాన్ని కనుగొనడం ఇదే మొదటిసారి. పత్రం లీకయి, దాని పీడీఎఫ్‌లు మెసేజింగ్ గ్రూపుల్లోకి వెళ్ళాక, వందలాది మంది లబ్ధి పొంది ఉండవచ్చు. మేమందరినీ గుర్తించి పట్టుకుంటాం, కానీ ముందుగా లీకేజీ మూలం, వారి సహచరులపై పనిచేస్తున్నాం, అని ఒక అధికారి అన్నారు. గతంలో జరిగిన ఏవైనా పేపర్ లీక్‌లలో కులకర్ణి, మంధారేల పాత్రపై కూడా ఏజెన్సీ దర్యాప్తు చేస్తోందని అధికారులు తెలిపారు. కులకర్ణి తరగతుల తర్వాత ఆ పేపర్ ఏయే మార్గాల ద్వారా ప్రయాణించిందో కూడా సీబీఐ గుర్తించింది. నాసిక్‌కు చెందిన శుభం ఖైర్నార్, ఏప్రిల్‌లో గురుగ్రామ్‌కు చెందిన యశ్ యాదవ్‌తో మాట్లాడుతూ, అధికారిక రికార్డులు, కోర్టు పత్రాలలో మంగిలాల్ బివాల్, మంగిలాల్ ఖటిక్ అని పేర్కొన్న మంగిలాల్ అనే వ్యక్తి తన చిన్న కొడుకు కోసం లీకైన పేపర్ల కొరకు రూ. 10-12 లక్షలు చెల్లించడానికి సిద్ధంగా ఉన్నాడని చెప్పినట్లు ఆరోపణలు ఉన్నాయి.




**వుదయం డెస్క్, మే 16 :**
నీట్ 2026 ప్రశ్నా పత్రాల లీకేజీ కేసులో, ప్రధాన సూత్రధారిగా అనుమానిస్తున్న రెండవ వ్యక్తిని సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) అరెస్టు చేసిందని సీనియర్ అధికారులు తెలిపారు. దర్యాప్తు అధికారులు ఈ రాకెట్‌కు 'కింగ్‌పిన్'గా అభివర్ణించిన పదవీ విరమణ పొందిన రసాయనశాస్త్ర అధ్యాపకుడు పి.వి. కులకర్ణిని అరెస్టు చేసిన మరుసటి రోజే, ఎన్‌టిఏ ప్రశ్నపత్రాల రూపకల్పన కమిటీలో సభ్యురాలిగా ఉన్న పుణేకు చెందిన ఒక సీనియర్ మహిళా వృక్షశాస్త్ర (బాటనీ) ఉపాధ్యాయురాలిని సిబిఐ అరెస్టు చేసింది. విశదమైన దర్యాప్తు అనంతరం మనీషా గురునాథ్ మంధారేను అరెస్టు చేసినట్లు సిబిఐ శనివారం

మిగతా 2లో..

## త్రిభాష తప్పనిసరి : సీబీఎస్ఈ




5 లో..

9, 10వ తరగతి విద్యార్థులకు మూడు భాషల అధ్యయనం

భాషా ఉపాధ్యాయుల కోసం తాత్కాలిక చర్యలకు అనుమతి

## రూ. 182 కోట్ల విలువైన మాదక ద్రవ్యాల పట్టివేత



5 లో..

'ఆపరేషన్ రేజ్ పిల్'లో భాగంగా, జిహాదీ డ్రగ్‌గా ప్రసిద్ధి చెందిన కాప్టగాన్‌ను నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సిబి) తొలిసారి స్వాధీనం చేసుకుంది.

## పనులు పరుగులు పెట్టాలి

- మలక్‌పేట్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులను పరిశీలించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**హైదరాబాద్, మే 16 :**
హైదరాబాద్ నగరంలోని మలక్‌పేట్ రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న ఆధునీకరణ పనులను గడువులోగా పూర్తి చేయాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి

మిగతా 2లో..

## వచ్చే నెల 25 నుంచి ఎస్ఐఆర్

### రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి

**హైదరాబాద్, మే 16 :**
వచ్చే నెల 25 నుంచి ఎస్ ఐ ఆర్ ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ఇంటింటికీ వెళ్లి బీఎల్‌వోలు ప్రత్యేక సర్వే చేస్తారని చెప్పారు. శనివారం హైదరాబాద్ లో ఆహన మీడియాతో మాట్లాడారు. ప్రతి ఓటరుకూ ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేస్తారని చెప్పారు. ప్రతి ఇంటినీ కనీసం మూడు సార్లు బీఎల్‌వో సందర్శిస్తారన్నారు. కొత్త ఓటర్ల వివరాలను ఫారం6లో ప్రత్యేకంగా నమోదు చేస్తారన్నారు. వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనూ ఎన్యుమరేషన్ అవకాశం ఉందని తెలిపారు.



హెల్ప్‌లైన్ 1950తో పాటు 'Book a Call with BLO' సదుపాయం కల్పించినట్లు చెప్పారు. మరోవైపు.. ఎన్యుమరేషన్

మిగతా 2లో..

## పార్టీ మారాలనుకునే వారెళ్లొచ్చు

### టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్, ఏప్రిల్ 27 (ఎఎంస్) :**
పశ్చిమబెంగాల్ లో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ పరాజయం పాలైంది. ఎన్నికల్లో ఓటమిపై టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. పార్టీలో ఉండాలనుకునేవాళ్లు ఉండొచ్చని, వద్దనుకునేవాళ్లు వెళ్లిపోవచ్చని ఆమె పేర్కొన్నట్లు టీఎంసీ వర్గాలు తెలిపాయి. ఎన్నికల్లో ఓటమి తర్వాత పార్టీలో అంతర్గత విభేదాలు తలెత్తాయనే ఊహాగానాలు వెలువడుతోన్న నేపథ్యంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.
పార్టీ తరపున ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులతో కాళీఘాట్‌లోని తన నివాసంలో మమత సమావేశమయ్యారు. ఇందులో టీఎంసీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ పార్టీ మళ్లీ పుంజుకుంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు. 'పార్టీ మారాలనుకునే వారిని



మిగతా 2లో..

## బండి భగీరథ్‌పై లుకౌట్ నోటీసులు

- దేశంలోని అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాలు, సరిహద్దు తనిఖీ కేంద్రాల అప్రమత్తం
- నాలుగు బృందాలతో హైదరాబాద్, కరీంనగర్, ఢిల్లీలో గాలింపు
- ఏ క్షణంలోనైనా అరెస్టయ్యే అవకాశం



**హైదరాబాద్, మే 16 :**
పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న బండి భగీరథ్ ను అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం

మిగతా 2లో..

## యువతను అభివృద్ధి చెందిన భారతదేశ మూల స్తంభాలుగా చూస్తాను

- నా వ్యాఖ్యలు తప్పుగా ఉటంకించారని సిజెఐ స్పష్టీకరణ
- నకిలీ న్యాయ డిగ్రీలు ఉన్నాయనే ఆరోపణల సంఖ్య పెరిగింది



**వుదయం డెస్క్, మే 16 :**
యువకులు బొద్దింకల వంటివారు అంటూ తాను చేసిన వ్యాఖ్యలకు సంబంధించి నెలకొన్న అపోహలను తొలగించే ప్రయత్నం చేస్తూ, తన మౌఖిక వ్యాఖ్యలను తప్పుగా ఉటంకించారని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్ శనివారం స్పష్టం చేశారు. నకిలీ లేదా బోగస్ డిగ్రీలను ఉపయోగించి న్యాయవాద వృత్తి వంటి రంగాల్లోకి ప్రవేశించిన వారిని ఉద్దేశించే తాను ఆ విమర్శలు చేశానని ఆయన పేర్కొన్నారు.
శుక్రవారం, నకిలీ న్యాయ డిగ్రీలు కలిగి ఉన్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న న్యాయవాదుల సంఖ్యపై సీజేఐ కాంత్ ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయవ్యవస్థను, ఇతరులను లక్ష్యంగా చేసుకుని సమాజంలో ఇప్పటికే చాలా మంది పరాన్నజీవులు ఉన్నారని, న్యాయవాదులు అటువంటి శక్తులతో చేతులు కలపకూడదని ఆయన అన్నారు. నిరుద్యోగ యువతను బొద్దింకలతో పోల్చుతూ ఆయన చేసిన వ్యాఖ్యలు,

మిగతా 2లో..

## 'బండి'ని పదవి నుంచి తొలగించాలి

- ఆయన కుమారుడి మీద నమోదైన పోక్సో కేసులో విచారణ పారదర్శకంగా జరగాలంటే ఆయన పదవిలో ఉండొద్దు
- ప్రధాని మోడీ కి టీఆర్ఎస్ చీఫ్ కవిత లేఖ



**హైదరాబాద్, మే 16 :**
కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడి మీద నమోదైన పోక్సో కేసులో విచారణ పారదర్శకంగా జరగాలంటే ఆయన్ను మంత్రి వర్గం నుంచి తొలగించాలంటూ ప్రధాని మోడీకి తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత లేఖ రాశారు. బండి సంజయ్ కుమారుడి

మిగతా 2లో..

## హైదరాబాద్-బెంగళూరు హైస్పీడ్ కారిడార్ సర్వే కొలిక్కి

- నల్లమల అడవులు, సోమశిల మీదుగా బుల్లెట్ రైలు
- తెలంగాణలో 5 హైస్పీడ్ రైల్వే స్టేషన్లు
- ప్రకృతి అందాలు, పర్యాటక ప్రాంతాల గుండా సాగేలా సరికొత్త రూట్ మ్యాప్




**హైదరాబాద్, మే 16 :**
అత్యంత ప్రతిష్ఠాత్మకమైన హైదరాబాద్‌బెంగళూరు హైస్పీడ్ బుల్లెట్ ట్రైన్ కారిడార్ ప్రాజెక్టుకు అడుగులు వేగంగా పడుతున్నాయి. రెండు ఐటీ మహానగరాల మధ్య ప్రయాణ సమయాన్ని భారీగా తగ్గించేందుకు ప్రతిపాదించిన ఈ మెగా ప్రాజెక్టుకు సంబంధించిన ప్రాథమిక ఎలైన్‌మెంట్ సర్వే ప్రక్రియ దాదాపు కొలిక్కి వచ్చింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మూడు ప్రతిష్ఠాత్మక బుల్లెట్ రైలు కారిడార్లలో ఒకటైన ఈ మార్గం.. ప్రకృతి అందాలు, పర్యాటక ప్రాంతాల గుండా సాగేలా సరికొత్త రూట్ మ్యాప్ సిద్ధమవుతోంది. తెలంగాణలో ప్రారంభమై ఆంధ్రప్రదేశ్ మీదుగా సాగుతూ కర్ణాటక రాజధాని బెంగళూరులో

మిగతా 2లో..

# బండి భగీరథ్‌పై లుకౌట్ నోటీసులు

మొదటి పేజీ తరువాయి..

చేశారు. ఈ కేసులో చట్టపరమైన చర్యల నుంచి తప్పించుకునేందుకు భగీరథ్ దేశం దాటిపోయే అవకాశం ఉందనే అనుమానాలతో పోలీసులు అతడిపై లుకౌట్ సర్క్యులర్ నోటీసులు జారీ చేశారు. దేశంలోని అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాలు, సరిహద్దు తనిఖీ కేంద్రాలను అప్రమత్తం చేస్తూ శనివారం ఉదయం ఉత్తర్వులు పంపారు. దీంతో పాటు అతడిని పట్టుకునేందుకు సిట్ ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక పోలీస్ బృందాలను రంగంలోకి దించారు. ప్రస్తుతం భగీరథ్ కోసం హైదరాబాద్, కరీంనగర్‌తో పాటు దేశ రాజధాని ఢిల్లీలోనూ ఈ బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. ఒకవైపు పోలీసులు అరెస్ట్ కోసం లుకౌట్ నోటీసులతో వేట కొనసాగిస్తుండగా.. మరోవైపు చట్టపరమైన రక్షణ కోసం భగీరథ్ చేసిన ప్రయత్నాలకు తెలంగాణ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని, కనీసం అరెస్టు చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ భగీరథ్ దాఖలు చేసిన అత్యవసర పిటిషన్‌పై న్యాయస్థానం ఈ నెల 15న రాత్రి 9 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు దాదాపు మూడు గంటల పాటు సుదీర్ఘ విచారణ జరిపింది. బాధితురాలి నుంచి సేకరించిన ప్రాథమిక ఆధారాలు, వాంగ్మూలాన్ని పరిశీలించిన జస్టిస్ టి. మాధవీదేవి.. ఈ దశలో నిందితుడికి ఎలాంటి ముందస్తు బెయిల్, అరెస్ట్ నుంచి తాత్కాలిక రక్షణ ఇవ్వలేమని స్పష్టం చేశారు. దర్యాప్తునకు సహకరిస్తామని అంతవరకు అరెస్ట్ ఆపాలని పిటిషనర్ తరఫు న్యాయవాది చేసిన అభ్యర్థనను కోర్టు తోసిపుచ్చింది. అయితే దీనిపై తుది నిర్ణయాన్ని వచ్చే వారానికి వాయిదా వేసింది. ఈ సుదీర్ఘ విచారణలో ఇరుపక్షాల న్యాయవాదుల మధ్య తీవ్రమైన చట్టపరమైన వాదనలు జరిగాయి. భగీరథ్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి వాదిస్తూ.. పిటిషనర్‌ను రాజకీయంగా ఇరికించేందుకే కావాలనే కఠినమైన పోక్సో సెక్షన్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చారన్నారు. ఇది వాస్తవానికి ఇరుపక్షాల పరస్పర అంగీకారంతో సాగిన సంబంధమని.. అది ఇటీవల బెడిసికొట్టడంతోనే కక్షపూరితంగా ఈ కేసు పెట్టారని వాదించారు. అయితే, ఈ వాదనలను పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు తోసిపుచ్చారు. జీహెచ్ఎంసీ అధికారిక జనన రికార్డుల ప్రకారం బాధితురాలి వయసు స్పష్టంగా 18 ఏళ్ల లోపే ఉందని చట్ట ప్రకారం ఆమె మైనర్ అని కోర్టుకు నిరూపించారు. బాధితురాలు మేజిస్ట్రేట్ ముందు ఇచ్చిన కీలక వాంగ్మూలాన్ని నమోదు చేసిన తర్వాతే కేసు తీవ్రతను బట్టి పోక్సో సెక్షన్లను జోడించాల్సి వచ్చిందని పీపీ స్పష్టం చేశారు.

నిందితుడి తండ్రి కేంద్ర మంత్రి కావడంతో బాధితురాలి కుటుంబంపై తీవ్రమైన ఒత్తిళ్లు, బెదిరింపులు వస్తున్నాయని బాధితురాలి తరపు న్యాయవాది పప్పు నాగేశ్వరరావు న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చారు. ఈ కేసు విచారణ సందర్భంగా.. ఈ సున్నితమైన వ్యవహారంలో తనపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న కొన్ని అభ్యంతరకర దుష్ప్రచారాలపై న్యాయమూర్తి జస్టిస్ మాధవీదేవి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. హైకోర్టు రక్షణ ఇవ్వడానికి నిరాకరించడం, అలాగే పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేసి గాలింపు తీవ్రం చేయడంతో ఏ క్షణంలోనైనా బండి భగీరథ్ అరెస్ట్ అయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# నీట్ పేపర్ లీకేజ్‌లో దర్యాప్తు ముమ్మరం

మొదటి పేజీ తరువాయి..

ఒక ప్రకటనలో తెలిపింది. "ఆమె నీట్ పరీక్షా ప్రక్రియలో పాలుపంచుకున్నారు, అలాగే ఎన్‌టిఏ ద్వారా నిపుణురాలిగా నియమితులయ్యారు. వృక్షశాస్త్రం (బాటనీ), జంతుశాస్త్రం (జువాలజీ) ప్రశ్నాపత్రా ఆమెకు పూర్తిగా అందుబాటులో ఉండేవి, అని ఆ సంస్థ పేర్కొంది. ఆమె పాత్రకు సంబంధించి మరిన్ని వివరాలను వెల్లడిస్తూ, ఏప్రిల్ 2026లో మంధారే పూణేలో ఒక బ్యూటీ పార్లర్ నడుపుతూ, మే 14న అరెస్టు అయిన మనీషా వాఘ్మారే ద్వారా నీట్ పరీక్ష రాయబోయే అభ్యర్థులను సమీకరించి, తన పూణే నివాసంలో ఆ విద్యార్థులకు కోచింగ్ తరగతులు నిర్వహించారని సిబిఐ పేర్కొంది. ఎన్‌టిఏ పేపర్‌సెట్టింగ్ కమిటీలో సభ్యుడిగా ఉన్న కులకర్ణి కూడా ఇదే తరహా కార్యవిధానాన్ని అనుసరించారు.

ఈ తరగతుల సమయంలో, మంధారే వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం సబ్జెక్టులకు సంబంధించిన వివిధ ప్రశ్నలను వివరించి వెల్లడించారు. అంతేకాకుండా, విద్యార్థులు వాటిని తమ నోట్‌బుక్‌లలో రాసుకోవాలని, అలాగే తమ పాఠ్యపుస్తకాలలో గుర్తించుకోవాలని సూచించారు. మే 3న జరిగిన నీట్ 2026 పరీక్ష అసలు ప్రశ్నాపత్రంలోని ప్రశ్నలతో, వీటిలో అత్యధిక భాగం సరిపోలాయి," అని సిబిఐ తెలిపింది.

ఇతరుల పాత్రకు సంబంధించి తదుపరి విచారణ నిమిత్తం మంధారేను ఢిల్లీకి తీసుకురానున్నారు.

తమ పేర్లు వెల్లడించడానికి ఇష్టపడని అధికారుల ప్రకారం, సిబిఐ దర్యాప్తులో రెండు సెట్ల ప్రశ్నపత్రాలు, ఒకటి చేతి రాతతో, మరొకటి టైప్ చేసిన రూపంలో ఎన్‌టిఏ నుండి లీక్ అయినట్లు తేలింది.



ఈ లీకేజీ వెనుక కులకర్ణి, మంధారే ఉన్నట్లు వెల్లడైంది. ఆ పత్రాన్ని రూపొందించిన మొత్తం కమిటీతో పాటు ఎన్‌టీఏలోని ఇతర సీనియర్ అధికారులు కూడా పరిశీలనలో ఉన్నారని, రాబోయే రోజుల్లో మరిన్ని అరెస్టులు జరగవచ్చని అధికారులు తెలిపారు.

పత్రాల లీకేజీ దర్యాప్తులలో ఎన్‌టీఏలోనే లీకేజీ మూలాన్ని కనుగొనడం ఇదే మొదటిసారి. పత్రం లీకయి, దాని పీడీఎఫ్‌లు మెసేజింగ్ గ్రూపుల్లోకి వెళ్ళాక, వందలాది మంది లబ్ధి పొంది ఉండవచ్చు. మేమందరినీ గుర్తించి పట్టుకుంటాం, కానీ ముందుగా లీకేజీ మూలం, వారి సహచరులపై పనిచేస్తున్నాం, అని పేరు చెప్పడానికి ఇష్టపడని ఒక అధికారి అన్నారు. గతంలో జరిగిన ఏవైనా పేపర్ లీక్‌లలో కులకర్ణి, మంధారేల పాత్రపై కూడా ఏజెన్సీ దర్యాప్తు చేస్తోందని అధికారులు తెలిపారు.

కులకర్ణి తరగతుల తర్వాత ఆ పేపర్ ఏయే మార్గాల ద్వారా ప్రయాణించిందో కూడా సీబీఐ గుర్తించింది. నాసిక్‌కు చెందిన శుభం ఖైర్నార్, ఏప్రిల్‌లో గురుగ్రామ్‌కు చెందిన యశ్ యాదవ్‌తో మాట్లాడుతూ, అధికారిక రికార్డులు, కోర్టు పత్రాలలో మంగిలాల్ బివాల్, మంగిలాల్ ఖటిక్ అని పేర్కొన్న మంగిలాల్ అనే వ్యక్తి తన చిన్న కొడుకు కోసం లీకైన పేపర్ల కొరకు రూ. 1012 లక్షలు చెల్లించడానికి సిద్ధంగా ఉన్నాడని చెప్పినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఏప్రిల్ 29న, ఖైర్నార్ యాదవ్‌తో మాట్లాడుతూ, ప్రతిష్టాత్మక వైద్య కళాశాలల్లో ప్రవేశం కల్పించగల ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ ప్రశ్నలను, మొత్తం సుమారు 500600, తాను అందించగలనని చెప్పినట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా, సెక్యూరిటీ డిపాజిట్‌గా మంగిలాల్ నుండి 10వ, 12వ తరగతి పత్రాలు, నీట్ రోల్ నంబర్, ఒక చెక్కును తెప్పించుకోమని యాదవ్‌ను కోరినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. అదే రోజు, యాదవ్ టెలిగ్రామ్ ద్వారా లీకైన ప్రశ్నపత్రాల పిడిఎఫ్ ఫైళ్లను అందుకుని, వాటిని మంగిలాల్‌కు ఫార్వార్డ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అసలు ప్రశ్నపత్రంలోని సుమారు 150 ప్రశ్నలు సరిపోలితే, అందుకుగాను రూ. 10 లక్షలు చెల్లించాలనేది వారి ఒప్పందంలో భాగమని ఆరోపణలు ఉన్నాయి. మంగిలాల్, పరీక్ష రాస్తున్న ముగ్గురు కుటుంబ సభ్యులకు, తన కుమారుడు వికాస్ స్నేహితులకు, సత్యనారాయణ్ అనే ఉపాధ్యాయునికి ప్రింటెడ్ కాపీలను అందించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అతను డబ్బుకు బదులుగా జవాబు పత్రాలతో కూడిన ప్రశ్నపత్రాలను కూడా సరఫరా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. మంగీలాల్ మొబైల్ ఫోన్ నుండి సీబీఐ నేరారోపణ సాక్ష్యాలను స్వాధీనం చేసుకుంది.

నాలుగు రోజుల్లో ఐదు రాష్ట్రాల్లో తొమ్మిది మంది వ్యక్తులను అరెస్టు చేశారు. పూణేకు చెందిన మంధరే, కులకర్ణి, వాగ్మారే, అహల్యానగర్ నుండి ధనంజయ్ లోఖండ, నాసిక్ నుండి ఖైర్నార్, మంగీలాల్ బివాల్, జైపూర్‌కు చెందిన మంగీలాల్ ఖాటిక్, వికాస్ బివాల్, దినేష్ బివాల్, గురుగ్రామ్ నుండి యాదవ్.

గత 24 గంటల్లో దేశవ్యాప్తంగా ఆరు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి, నేరారోపణలకు దారితీసే పత్రాలు, ల్యాప్‌టాప్‌లు, బ్యాంకు ఖాతా వివరాలు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆ సంస్థ శనివారం వెల్లడించింది.

విద్యా మంత్రిత్వ శాఖ నుండి అందిన ఫిర్యాదు ఆధారంగా, ఈ లీకేజీకి సంబంధించి ఆ సంస్థ మే 12న ఒక కేసు నమోదు చేసింది.

ప్రత్యేక బృందాలతో దర్యాప్తు కొనసాగుతోంది. ఇప్పటివరకు జరిపిన దర్యాప్తులో, కెమిస్ట్రీ, బయాలజీ పేపర్ల లీకేజీకి గల అసలు మూలంతో పాటు, నీట్ యూజీ2026 పరీక్షలో వచ్చే ప్రశ్నలను డిక్టేట్ చేసి, చర్చించిన ప్రత్యేక కోచింగ్ క్లాసులకు హాజరయ్యేందుకు లక్షల రూపాయలు చెల్లించిన విద్యార్థులను సమీకరించడంలో ప్రమేయం ఉన్న మధ్యవర్తులను కూడా వెలుగులోకి తెచ్చింది, అని సీబీఐ తెలిపింది.

ఈ కేసులో సమగ్రమైన, నిష్పక్షపాతమైన, ప్రొఫెషనల్ దర్యాప్తుకు సీబీఐ కట్టుబడి ఉంది, అని అది పేర్కొంది.

# 'బండి'ని పదవి నుంచి తొలగించాలి

మొదటి పేజీ తరువాయి..



మీద అత్యంత తీవ్రమైన పోక్సో కేసు నమోదైనందున కేసు విచారణ పారదర్శకంగా జరగాలంటే బండి సంజయ్ లో పదవిలో ఉండకూడదని ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ కేసులో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేకుండా స్వతంత్ర విచారణ జరిగేందుకు ప్రధాని మోడీ చొరవ చూపాలన్నారు. దేశంలో మైనర్ల రక్షణ కన్నా రాజకీయ ప్రయోజనాలు ఎక్కువ కాదని ప్రధాని గుర్తించాలన్నారు. బాధితురాలికి పూర్తి న్యాయం జరగాలన్నా, ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల ప్రజల్లో నమ్మకం కలగాలన్న...విచారణలో ఎలాంటి రాజకీయ జోక్యం ఉండొద్దని సూచించారు. రాజ్యాంగ నిబద్ధతను, నైతిక విలువలను కాపాడటం ప్రధానిగా మీ తక్షణ కర్తవ్యమని గుర్తించాలని కవిత అన్నారు. ఈ కేసు విచారణ పూర్తయ్యే వరకు బండి సంజయ్ ను మంత్రివర్గం నుంచి తప్పించాలని మిమ్మల్ని కోరుతున్నాంటూ ప్రధాని కి రాసిన లేఖలో కవిత తెలిపారు.

**లేఖలో కవిత ప్రస్తావించిన అంశాలు**

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడిపై పెట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో భారతీయ న్యాయ సంహిత, అలాగే అత్యంత తీవ్రమైన బాలల లైంగిక నేరాల నిరోధక చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదైంది. మైనర్ బాలికకు సంబంధించిన కేసు కావడంతో ఈ దర్యాప్తు లోఎటువంటి రాజకీయ ఒత్తిళ్లు లేకుండా స్వతంత్రంగా విచారణ జరగాల్సిన అవసరం ఉంది.

బండి సంజయ్ ప్రస్తుతం దేశంలోనే అత్యంత కీలకమైన, చట్టాన్ని అమలు చేసే అధికారాలు ఉన్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా కొనసాగుతున్నారు. చట్టపరంగా ఆయన కుమారుడి పై నేర నిరూపణ అనేది న్యాయస్థానం తేల్చాల్సిన విషయమే. కానీ ఆయన అదే పదవిలో కొనసాగడంతో దర్యాప్తు ప్రక్రియ, సాక్ష్యాల సేకరణ, సాక్షుల రక్షణపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఈ కేసులో బాధితురాలికి పూర్తి న్యాయం జరగాలన్నా, ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల ప్రజల్లో నమ్మకం కలగాలన్న విచారణలో రాజకీయ జోక్యం ఉండకూడదు. రాజ్యాంగ నిబద్ధతను, నైతిక విలువలను కాపాడటం మీ తక్షణ కర్తవ్యం. దేశంలోని మైనర్ల రక్షణ, న్యాయవ్యవస్థ సమగ్రత అనేది రాజకీయ ప్రయోజనాల కంటే మిన్న. అందుకే కేసు దర్యాప్తు , న్యాయస్థాన విచారణ పూర్తయ్యే వరకు బండి సంజయ్ కుమార్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పదవి నుండి తక్షణమే తొలగించాలి.

# పనులు పరుగులు పెట్టాలి



మొదటి పేజీ తరువాయి..

జి.కిషన్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆ రైల్వే స్టేషన్‌లో జరుగుతోన్న పనులను శనివారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. పనుల పురోగతి ఆశించిన స్థాయిలో లేకపోవడంతో కాంట్రాక్టర్‌పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనుల్లో ప్లాట్‌ఫారంల సదుపాయాల మెరుగుదల, ప్రయాణికుల నిరీక్షణ మందిరాలు, లిఫ్టులు, ఎస్కలేటర్లు, పారిశుధ్య సౌకర్యాలు, స్టేషన్ ప్రవేశ ద్వారాల విస్తరణ వంటి పనులను మంత్రి స్వయంగా పరిశీలించారు. పనులు నత్తనడకన సాగుతుండటాన్ని గమనించిన ఆయన, కాంట్రాక్టర్‌ను మందలిస్తూ నిర్ణీత గడువులోపు పనులను పూర్తి చేయాలని కఠిన ఆదేశాలు జారీ చేశారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పనులను వేగవంతం చేయాలని, నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని సంబంధిత రైల్వే అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ నిధులతో చేపడుతున్న ప్రతి పని ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని స్పష్టం చేశారు. ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులు వినియోగించే మలక్‌పేట్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పూర్తయితే ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందుబాటులోకి రానున్నాయి. కేంద్ర మంత్రి ఆకస్మిక తనిఖీతో పనులు మరింత వేగం పుంజుకుంటాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ తనిఖీలో దక్షిణ మధ్య రైల్వే అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పార్టీ మారాలనుకునే వారెళ్లొచ్చు

మొదటి పేజీ తరువాయి..

వెళ్లనివ్వండి. నేను పార్టీని కొత్తగా మళ్లీ నిర్మిస్తాను. ఇందులోనే ఉండేవారు.. దెబ్బతిన్న పార్టీ కార్యాలయాలను పునర్నిర్మించండి. వాటికి రంగులు వేయండి. అవసరమైతే నేనూ రంగులు వేస్తాను. టీఎంసీ ఎప్పటికీ తల వంచదు. ప్రజల తీర్పును వారు దొంగిలించారు' అని దీదీ తెలిపినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఆ తర్వాత టీఎంసీ తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఈ సమావేశానికి సంబంధించిన ఫొటోలు పోస్ట్ చేసింది. దీనికి 'టీఎంసీ ఒక కుటుంబంలా ఐక్యంగా నిలుస్తుంది. ప్రజల తీర్పును దోచుకునే వారి ముందు మేం ఎప్పటికీ తలవంచం. సత్యమే గెలుస్తుంది' అని రాసుకొచ్చింది. ఎన్నికల ఫలితాల తర్వాత కూడా ఆమె ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. చాలామంది ఇతర పార్టీలకు వెళ్తారని తనకి తెలుసన్నారు. అందుకు వారికి సొంత కారణాలు ఉండొచ్చని.. వెళ్లాలనుకునే వారిని తాను ఆపాలనుకోవడం లేదని వ్యాఖ్యానించారు. ఇక 294 స్థానాలకు ఇటీవల అసెంబ్లీ ఎన్నికలు జరగ్గా.. 3 దఫాలుగా అధికారంలో ఉన్న టీఎంసీ కేవలం 80 సీట్లనే గెలుచుకుంది. మమతకు కంచుకోట అయిన భవానీపుర్‌లో ఆమె ఓటమి పాలయ్యారు.

# వచ్చే నెల 25 నుంచి ఎస్ఐఆర్



మొదటి పేజీ తరువాయి..

దశలో ఫారం తప్ప అదనపు పత్రాలు అవసరం లేదని సీఈవో తెలిపారు. ఫారం ఇచ్చిన వారందరి పేర్లు డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలో చేర్చుతారని, ఫారం ఇవ్వని ఓటర్ల జాబితా బూత్ వారీగా ప్రదర్శిస్తారని తెలిపారు. డ్రాఫ్ట్ రోల్స్ తర్వాత అభ్యంతరాలను స్వీకరిస్తామని చెప్పారు. పుట్టిన తేదీ ఆధారంగా పత్రాల సమర్పణకు నిబంధనలు వర్తిస్తాయన్నారు. 1987 జూలై 1కు ముందు పుట్టిన వారికి ఒకే పత్రం సరిపోతుందని.. 1987 2004 మధ్య పుట్టిన వారికి తల్లిదండ్రుల వివరాలు కూడా తప్పనిసరి అని చెప్పారు. 2004 తర్వాత జన్మించిన వారికి తల్లిదండ్రుల పత్రాలు తప్పనిసరన్నారు.

2002లో రాష్ట్రంలో ఎస్ ఐ ఆర్ చేశారని సీఈవో తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండాలన్నదే ఎస్ఐఆర్ ఉద్దేశమన్నారు. రాష్ట్రంలో 3.45 కోట్ల ఓటర్లు, 35 వేల పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. పొలిటికల్ పార్టీలకు కూడా ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎన్యుమరేషన్ తర్వాత డ్రాఫ్ట్ విడుదల చేస్తామని.. అందులో చూసుకొని ఓటర్లు మార్పు, చేర్పులు చేసుకోవచ్చని సీఈవో సుందర్శన్ రెడ్డి వెల్లడించారు.

**జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటి సర్వే**

జూలై 31న డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదల
జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాల స్వీకరణ
అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితా

# హైదరాబాద్-బెంగళూరు హైస్పీడ్ కారిడార్ సర్వే కొలిక్కి

మొదటి పేజీ తరువాయి..



ఈ హైస్పీడ్ కారిడార్ ముగుస్తుంది. ఈ మొత్తం ప్రాజెక్టులో తెలంగాణ రాష్ట్ర పరిధిలోనే సుమారు 205 కిలోమీటర్ల మేర ఈ రైలు మార్గం నిర్మించనున్నారు. అయితే, ఈ కారిడార్ తుది రూపురేఖల విషయంలో నేషనల్ హైస్పీడ్ రైల్ కారిడార్ లిమిటెడ్ తొలుత శంషాబాద్, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్, కర్నూలు మీదుగా ట్రాక్ నిర్మించాలని భావించింది. కానీ తెలంగాణ ప్రభుత్వం ఇందుకు భిన్నంగా సరికొత్త ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. మహబూబ్‌నగర్ వైపు ఇప్పటికే రైల్వే నెట్‌వర్క్ అందుబాటులో ఉన్నందున.. ట్రైన్ సదుపాయం లేని ప్రాంతాల మీదుగా బుల్లెట్ రైలు మార్గాన్ని తీసుకెళ్లాలని సూచించింది. ప్రభుత్వం సూచించిన శంషాబాద్, మన్ననూరుశ్రీశైలం, సోమశిల రూట్ వైపే ఎన్‌హెచ్‌ఎస్ఆర్‌సీఎల్ మొగ్గు చూపింది. కొత్త అలైన్‌మెంట్ ప్రకారం.. కోకాపేటలో ప్రారంభమయ్యే ఈ హైస్పీడ్ రైలు, శంషాబాద్ మీదుగా నల్లమల అటవీ ప్రాంతాన్ని తాకుతూ.. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోని మన్ననూరు, కృష్ణా నది తీరంలోని సోమశిల మీదుగా కర్నూలుకు కనెక్ట్ అవుతుంది. నల్లమల అటవీ ప్రాంతంలోని మన్ననూరు నుంచి శ్రీశైలం వరకు ఉన్న మార్గం టైగర్ రిజర్వ్ జోన్ కావడమే కాకుండా ఘాట్ రోడ్డుతో కూడుకున్నది కావడంతో ఇక్కడ పర్యావరణ అనుమతులు, సాంకేతిక సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉంది. ఇందుకోసం అత్యాధునిక ఎకోఫ్రెండ్లీ ఇంజినీరింగ్ డిజైన్లను పరిశీలిస్తున్నారు. కోకాపేట నుంచి శంషాబాద్ వరకు ఉన్న మొదటి స్ట్రెచ్ కనెక్టివిటీ కోసం ప్రస్తుతం రెండు ఆప్షన్లపై సర్వే జరుగుతోంది. ఇందులో మొదటిది ఔటర్ రింగ్ రోడ్ వెంబడి నిర్మించడం కాగా, రెండోది ఔటర్ రింగ్ రోడ్డుకు వెలుపల నుంచి ప్రతిపాదించడం. ప్రాథమిక సర్వే పూర్తయిన వెంటనే సమగ్ర ప్రాజెక్టు నివేదిక రూపొందించనున్నారు. డీపీఆర్ దశలో పర్యావరణ, భౌగోళిక పరిస్థితులను బట్టి స్వల్ప మార్పులు చేర్పులు జరిగే అవకాశం ఉంది. ఈ హైస్పీడ్ ట్రైన్ కారిడార్ ద్వారా తెలంగాణ పరిధిలో ఐదు అత్యాధునిక బుల్లెట్ రైల్వే స్టేషన్లను నిర్మించబోతున్నారు. మౌలిక వసతుల హబ్‌గా మారుతున్న శంషాబాద్, ప్రతిష్ఠాత్మక భారత్ ఫ్యూచర్ సిటీ, ఆమన్‌గల్లు, పర్యాటక ప్రాంతాలైన మన్ననూరు, సోమశిలలను హైస్పీడ్ స్టేషన్లుగా గుర్తించారు. ఈ స్టేషన్ల ఏర్పాటు ద్వారా ఆయా ప్రాంతాల ఆర్థిక స్వరూపం మారిపోవడంతో పాటు పర్యాటక రంగానికి భారీగా ఊతం లభించనుంది. గంటకు 250 నుంచి 300 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే ఈ బుల్లెట్ ట్రైన్ అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నుంచి బెంగళూరు ప్రయాణం కేవలం రెండున్నర నుంచి మూడు గంటల్లోనే పూర్తవుతుంది. డీపీఆర్ ఆమోదం పొందిన తర్వాత భూసేకరణ ప్రక్రియ ప్రారంభం కానుంది

# పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్‌కు రూ.10 పెరిగే అవకాశం!

మొదటి పేజీ తరువాయి..

లీటర్ పెట్రోల్, డీజిల్‌పై సగటున రూ.3 పెంచుతూ శుక్రవారం భారత చమురు రంగ కంపెనీలు నిర్ణయించాయి. సమీప భవిష్యత్తులో ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తత కారణంగా రాబోయే రోజుల్లో అంతర్జాతీయంగా ఇంధన ధరలు భారీగా పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో చమురు కంపెనీలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఆర్థిక నష్టాల నుంచి బయటపడేందుకు రూ.3 పెంచాయని, కానీ ఈ పెంపు చాలదని ఎంకే గ్లోబల్ విశ్లేషకులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రెండు మూడు వారాల్లో దశలవారీగా పెరుగుదల ఉండవచ్చని అన్నారు.

అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో ధరల పెరుగుదలను నియంత్రించడానికి కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం వసూలును దాదాపు నిలిపివేసింది. ప్రభుత్వరంగ చమురు కంపెనీలు కూడా లాభాలను వదులుకుని అధిక వ్యయాన్ని భరించాయి. ఇలాంటి పరిస్థితుల్లో కంపెనీలు ఇంధన ధరలు పెంచుతున్నాయి. నిన్న పెరిగిన స్వల్ప పెరుగుదల కూడా కంపెనీల రోజువారీ నష్టాలను కొంతమేర తగ్గించిందే తప్ప తొలగించలేదు.

# కేంద్రవాటా కోసం ఎదురుచూపులు

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, మే 16

రాష్ట్రంలో అత్యంత ప్రజాదరణ పొందిన ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద కేంద్ర ప్రభుత్వ వాటాగా రావలసిన నిధుల కోసం ఈ ఏడాది మార్చి నుంచి ఎదురుచూస్తున్నామని, కేంద్రం ఒక్కో ఇంటికి సుమారు రూ. 1.13 లక్షల వాటా విడుదల కావాల్సి ఉందని కేంద్రం నుంచి నిధుల వస్తాయన్న నమ్మకంతో ఇందిరమ్మ లబ్ధిదారులకు ఫైనల్ బిల్ ఆపడం జరిగిందని రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇప్పటి వరకు కేంద్రం నుంచి గ్రామీణ ప్రాంతానికి ఒక ఇల్లు కూడా మంజూరు కాలేదని తెలిపారు. శనివారం రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్‌లో మీడియాతో చిట్ చాట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిన నిధుల కోసం పలు మార్లు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు తాను కూడా ప్రాతినిధ్యం చేశామని చెప్పారు. ఆ నిధుల విడుదల కోసం ప్రయత్నిస్తూ మరోవైపు ప్రస్తుతం పూర్తయిన ఒక్కో ఇంటికి రూ.1.60 లక్షలను తాత్కాలికంగా ఆపామని , ఒకవేళ కేంద్రం మరో 1520 రోజుల్లోగా విడుదల చేయకపోతే రాష్ట్ర ప్రభుత్వమే భరించి లబ్ధిదారులకు నిధులు అందజేస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో తొలివిడత మూడున్నర లక్షలకు పైగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయగా ఇంతవరకు సుమారు 1.32 లక్షల ఇండ్లు పూర్తయ్యాయని, జూన్ నెలాఖరుకల్లా 6872 వేల ఇండ్లు శ్లాబ్‌ల నిర్మాణం పూర్తవుతుందన్నారు.

రెండవ విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూన్ 2న ఆదిలాబాద్‌లో ప్రారంభిస్తారని తెలిపారు. 2వ విడత మంజూరులో వివిధ రకాల వెసులుబాట్లను కల్పిస్తామని అన్నారు. గోడలు, బేస్‌మెంట్ లెవెల్, శ్లాబ్ వరకు ఉన్న గోడలు, శ్లాబ్ లేని ఇండ్లకు కూడా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఒక్కో నియోజకవర్గానికి ఎన్ని ఇండ్లు మంజూరు చేయాలనే అంశాన్ని కూడా ఈనెల 21న క్యాబినెట్‌లో చర్చించి ప్రకటిస్తామని



మంత్రి పొంగులేటి తెలిపారు.

గత 25 రోజులుగా రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాల పరిధిలో రెవెన్యూ, హౌసింగ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ , సర్వే అంశాలపై విస్తృతంగా చర్చించామని మంత్రి చెప్పారు. ప్రజా ప్రతినిధుల నుంచి అభిప్రాయాలు, సలహాలు, సూచనలు స్వీకరించి కొన్ని విషయాలపై అక్కడికక్కడే నిర్ణయాలు తీసుకొని పరిష్కరించినట్లు వివరించారు. ఈ సారి ప్రత్యేకంగా కలెక్టర్లు లేదా అదనపు కలెక్టర్లు, డిఎఫ్ఓలను సమావేశపరిచి రెవెన్యూ, అటవీ భూముల సరిహద్దులపై చర్చించి రోవర్ల సాయంతో సరిహద్దుల గుర్తింపుపై ఒక అవగాహన కల్పించామన్నారు. సరిహద్దులను కచ్చితంగా ఖరారు చేసేలా ఆదేశించామన్నారు. 1/70 సమస్యపై కూడా చర్చించామన్న మంత్రి.. రాష్ట్రంలో కొన్ని దశాబ్దాల నుంచి రెవెన్యూ ఫారెస్ట్ మధ్య భూ సరిహద్దు వివాదాలు ఉన్నాయని వీటి పరిష్కారానికి జయింట్ సర్వే నిర్వహించి శాశ్వ పరిష్కారం చూపబోతామన్నారు.

రాష్ట్రంలో ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాలను గుర్తించి సమగ్ర సర్వే కార్యక్రమం చేపడతాం. రిజిస్ట్రేషన్ల సమయంలో సర్వర్ల డౌన్ అంశంపై దృష్టి సారించి కొత్త సాఫ్ట్ వేర్ ఏర్పాటుకు టెండర్లు పిలిచామన్నారు. సుమారు 14.08 కోట్లతో టెండర్ ఖరారైందన్న పొంగులేటి... మరో 34 నెలల్లో ఈ సమస్య తీరుతుందని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వహయాంలో అసంపూర్తిగా ఉండిపోయిన 2బిహెచ్‌కే ఇండ్లకు సంబంధించి పాతరేట్లతో పూర్తి చేసేలా కాంట్రాక్టర్లను కోరామన్నారు. అత్యధిక శాతం ఈ పనుల పూర్తికి ముందుకు రానందున లబ్దిదారులను ఎంపిక చేసి వారికే మిగిలిన మొత్తాన్ని ఇస్తూ వారిచేతనే పూర్తిచేయించేలా నిర్ణయించినట్లు చెప్పారు. ఈమేరకు ఈనెలాఖరులోగా ఇటువంటి ఇండ్లను గుర్తించేలా కలెక్టర్లకు ఆదేశాలిచ్చామని మంత్రి వెల్లడించారు. పలు ప్రాంతాల్లో పదికిపైగా ఇండ్లు కలిగిన టవర్లను గుర్తించి వాటికి పాలకవర్గాన్ని ఏర్పాటు చేస్తూ, వాటి దిగువ కమర్షియల్ షాపులను లీజుకు బదులు పూర్తిగా బహిరంగ వేలంలో విక్రయించి ఆ మొత్తాన్ని ప్రభుత్వ ప్రాతినిధ్యం కలిగిన పాలక వర్గం ఎకౌంట్‌లో వేయాలని నిర్ణయించినట్లు చెప్పారు.

రాష్ట్రంలో భూముల ధరలను సవరించాలని కొన్ని ప్రాంతాల వాస్తవ ధరలతో పోలిస్తే భారీగా హెచ్చుతగ్గులున్న భూముల ధరలను క్రమబద్ధీకరించాలని ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని మంత్రి వెల్లడించారు. దీనికి అనుగుణంగా ఈనెల చివరిలోగా భూముల ధరలను సవరించి అమలులోకి తీసుకువస్తామని వెల్లడించారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో 2022 సంవత్సరంలో ఆరునెలలు తిరగకుండానే రెండు సార్లు భూముల ధరలను అశాస్త్రీయ పద్దతిలో పెంచారని అన్నారు. ఆర్థిక నిపుణులైన అరవింద్ సుబ్రహ్మణ్యం గారి సలహాలు, సూచనల మేరకు శాస్త్రీయ పద్దతిలో విశ్లేషించి భూముల ధరలను సవరిస్తున్నామని వెల్లడించారు.

పాలేరు నియోజకవర్గాన్ని 20 వేల ఓటర్ల చొప్పున 14 క్లస్టర్‌లుగా విభజించి ఇప్పటి వరకు 13 ప్రాంతాలలో ప్రజా దర్బార్ నిర్వహించామని చెప్పారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల్లో అత్యధికంగా 52 శాతం ఇందిరమ్మ ఇండ్ల కోసమే ఉన్నాయన్నారు. తర్వాత స్థానంలో ధరణితో భూ సమస్యలు,ఆసరా పెన్షన్లు, గృహ లక్ష్మి, గ్యాస్ సబ్సిడీ, రేషన్ కార్డులలో కుటుంబీకుల పేర్ల చేర్పు వంటివి ప్రాధాన్యతా క్రమంలో ఉన్నాయన్నారు. ఆసరా పెన్షన్ల విషయంలో ప్రభుత్వం కచ్చితమైన నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.

# యువతను అభివృద్ధి చెందిన భారతదేశ మూల స్తంభాలుగా చూస్తాను

మొదటి పేజీ తరువాయి..

ముఖ్యంగా దేశవ్యాప్తంగా ఉన్న యువతలో తీవ్ర వివాదాన్ని రేకెత్తించాయి.

**యువత బొద్దింకల వంటివారు అనే వ్యాఖ్యపై సిజెఐ వివరణ**

తన వ్యాఖ్యలపై స్పందిస్తూ, మీడియాలోని ఒక వర్గం తన అభిప్రాయాలను వక్రీకరించి, దేశ యువతపై విమర్శలుగా చిత్రీకరించిందని సిజెఐ కాంత్ పేర్కొన్నారు. నిన్న ఒక అసంబద్ధమైన కేసు విచారణ సందర్భంగా నేను మౌఖికంగా చేసిన వ్యాఖ్యలను, మీడియాలోని ఒక వర్గం వక్రీకరించి ఉటంకించడం చదివి నేను ఎంతో బాధపడ్డాను. నకిలీ, బోగస్ డిగ్రీల సహాయంతో న్యాయవాద వృత్తి వంటి రంగాల్లోకి ప్రవేశించిన వారిని మాత్రమే నేను ప్రత్యేకంగా విమర్శించాను. అటువంటి వ్యక్తులే మీడియా, సోషల్ మీడియా, ఇతర గౌరవప్రదమైన వృత్తుల్లోకి కూడా చొరబడి, పరాన్నజీవుల వలె తయారయ్యారు. నేను మన దేశ యువతను విమర్శించానని చెప్పడం పూర్తిగా నిరాధారం, అని ఆయన అన్నారు.

దేశ యువత పట్ల తనకు ఎంతో గర్వం ఉందని, వారిని అభివృద్ధి చెందిన భారతదేశానికి మూలస్తంభాలుగా తాను





పరిగణిస్తున్నానని భారత ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారని వార్తా సంస్థ ఎఎన్ఐ తెలిపింది. మన ప్రస్తుత భవిష్యత్ మానవ వనరుల పట్ల నాకు గర్వంగా ఉండటమే కాకుండా, భారతదేశంలోని ప్రతి యువకుడూ నాకు స్ఫూర్తినిస్తాడు. భారతీయ యువత నా పట్ల ఎంతో ఆదరాభిమానాలను, గౌరవాన్ని కలిగి ఉన్నారని చెప్పడం ఏమాత్రం అతిశయోక్తి కాదు; అలాగే, నేను కూడా వారిని అభివృద్ధి చెందిన భారతదేశానికి మూలస్తంభాలుగా చూస్తాను అని ఆయన అన్నారు.

**వివాదానికి కారణమేమిటి?**

సీజేఐ, జస్టిస్ జయమాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఎదుట జరిగిన విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. సీనియర్ న్యాయవాదుల హోదాకు సంబంధించి సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అమలు చేయడంలో జాప్యం జరిగిందంటూ ఢిల్లీ హైకోర్టుపై ధిక్కార చర్యలు చేపట్టాలని కోరుతూ న్యాయవాది సంజయ్ దుబే దాఖలు చేసిన పిటిషన్‌ను ఈ ధర్మాసనం విచారిస్తోంది.

న్యాయవ్యవస్థ, చట్టబద్ధ వ్యవస్థపై పెరుగుతున్న అనవసర దాడులను సీజేఐ కాంత్ తీవ్రంగా విమర్శించారు. కొంతమంది నిరుద్యోగ యువకులు ఆ తర్వాత మీడియా, సోషల్ మీడియా, ఆర్టీఐ కార్యకర్తలు, ఇతర కార్యకర్తలుగా మారి సంస్థలను లక్ష్యంగా చేసుకోవడం ప్రారంభిస్తున్నారని ఆయన అన్నారు.

బొద్దింకల వంటి యువకులు కొందరు ఉన్నారు. వీరికి ఎటువంటి ఉపాధి లభించదు, ఏ వృత్తిలోనూ వీరికి స్థానం ఉండదు. వీరిలో కొందరు మీడియా ప్రతినిధులుగా, మరికొందరు సోషల్ మీడియా కార్యకర్తలుగా, ఆర్టీఐ కార్యకర్తలుగా లేదా ఇతర కార్యకర్తలుగా మారి, అందరిపైనా దాడి చేయడం ప్రారంభిస్తారు, అని సీనియర్ న్యాయవాది హోదా కల్పనకు సంబంధించిన ఒక పిటిషన్ విచారణ సందర్భంగా భారత ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించినట్లు గతంలో వెలువడిన ఒక నివేదిక పేర్కొంది.

పిటిషన్‌ను విచారించడానికి ధర్మాసనం నిరాకరించి, పిటిషనర్ ప్రవర్తనను తీవ్రంగా ఖండించింది. సీనియర్ అడ్వకేట్ హోదా అనేది కోర్టు ప్రసాదించే ఒక గౌరవం తప్ప, దానిని చట్టపరమైన చర్యల ద్వారా పొందకూడదని అది వ్యాఖ్యానించింది.

స్పష్టంగా అసంతృప్తిగా ఉన్న సీజేఐ, పిటిషనర్ ఫేస్‌బుక్‌లో ఉపయోగించారని ఆరోపించిన భాషను కూడా ప్రస్తావిస్తూ, అటువంటి ప్రవర్తన న్యాయ నిపుణుల నుండి ఆశించే ప్రమాణాలకు అనుగుణంగా లేదని హెచ్చరించారు.

ఫేస్‌బుక్‌లో మీరు వాడుతున్న భాష ఎలాంటిదో ప్రజలు అర్థం చేసుకోనివ్వండి. వృత్తిలో క్రమశిక్షణ అంటే ఏమిటో నేను మీకు చూపిస్తాను, అని ఆయన అన్నారు.

**'సమాజంలోని పరాన్నజీవుల'పై సిజెఐ వ్యాఖ్యలు**

సమాజంలో సంస్థలపై దాడి చేసే పరాన్నజీవులు ఇప్పటికే ఉన్నారని న్యాయస్థానం పేర్కొంది. పిటిషనర్ కూడా వారితో చేతులు కలపాలనుకుంటున్నారా అని ప్రశ్నించింది.

వ్యవస్థపై దాడి చేసే పరాన్నజీవులు సమాజంలో ఇప్పటికే ఉన్నారు, మరి మీరు వారితో చేతులు కలపాలనుకుంటున్నారా? అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

విచారణ సందర్భంగా, నకిలీ లేదా సందేహాస్పద డిగ్రీలు కలిగి ఉన్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న న్యాయవాదుల సంఖ్య పెరుగుతుండటంపై కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విషయంపై దర్యాప్తు జరగాలని పేర్కొంది.

నల్ల గౌన్లు ధరించిన వేలాది మంది మోసగాళ్ల డిగ్రీలపై తీవ్ర అనుమానాలు ఉన్నాయి. సీబీఐ దీనిపై చర్య తీసుకోవాలి, అని సీజేఐ కాంత్ వ్యాఖ్యానించారు. విచారణ కొనసాగుతుండగా, పిటిషనర్ న్యాయస్థానం ఎదుట క్షమాపణలు తెలిపి, తన పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికి అనుమతి కోరారు. ఆ తర్వాత ధర్మాసనం పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికి అనుమతించింది.



# గ్రేటర్ హైదరాబాద్





## అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేత

**షాద్ నగర్:**
కేంద్ర నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఈడీయం చేస్తూ ఆయిల్ కంపెనీలు అన్నిటిని ప్రైవేటు పరం చేసి ఆయిల్ కంపెనీలు ఇష్టం వచ్చినట్టుగా ధరలు పెంచుతుంటే దున్నపోతు మీద వాన పడ్డట్టుగా వ్యవహరిస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం అని మండిపడ్డారు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బికేఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధుల జంగయ్య తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో షాద్ నగర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. దేశాన్ని ఏలే నరేంద్ర మోడీ ప్రభుత్వానికి మంచి బుద్ధి ప్రసాదించి ధరలను నియంత్రించే విధంగా నరేంద్ర మోడీకి తలలో కనిపించైన చెప్పాలి అంబేద్కర్ అని వినతి పత్రాన్ని అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో ప్రభుత్వం ఉన్నదా లేదా అన్నట్టుగా అనిపిస్తుందని వారన్నారుధరల మీద నియంత్రణ లేదు ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన వెంబడి ధరలుపెంచి ప్రజలకు అధిక భారాన్ని మోపుతున్న నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం ఇది ప్రజల ప్రభుత్వం కాదని ఇది కార్పొరేట్ బడా పెట్టుబడిదారుల ప్రభుత్వమని వారు ఆరోపించారు ఓడ ఎక్కిన తర్వాత ఓడ మల్లయ్య ఓడ దిగినంక బోడి మల్లయ్య అనే చందస్తంగా ప్రభుత్వ పాలన ఉందని సందర్భానుసారం ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారాన్ని నిలబెట్టుకోవడంతోపాటు ప్రజలం మోసగించే విద్య నరేంద్ర మోడీకి తప్ప ఇంతకుముందు పరిపాలన చేసిన ఏ ఒక్క ప్రధానమంత్రి కి లేదని అన్నారు అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగాయని పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను పెంచి ప్రజల మీద పారం మోపడం సరైనది కాదు అని మండిపడ్డారు పద్దారు నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే దేశ ప్రజలపై ప్రేమే ఉంటే ఆ భారాన్ని ప్రభుత్వం భరించాలి తప్ప ప్రజల మీద మోపకూడదని వారు హితవు పలికారు ఇకనైనా పునరాలోచన చేసి పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని వారు డిమాండ్ చేశారు లేనియెడల దేశ ప్రజలు ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి రమేష్ యాదవ్ కొత్తూరు మండల ఏ ఐ టియు సి ప్రధాన కార్యదర్శి శేఖర్ రెడ్డి ఫరూక్నగర్ మండల నాయకులు రాములు గౌడ్ జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



## మహిళ కమిషన్ సభ్యురాలికి బీరంగూడ గ్రామ కమిటీ సన్మానం

**బీరంగూడ:**
మహిళ కమిషన్ సభ్యులు గా నియమితులైన బీరంగూడ గ్రామ వాసి శశికలా యాదవరెడ్డి ని బీరంగూడ గ్రామ అధ్యక్షులు అడెల్లి రవీందర్ ఆధ్వర్యంలో శాలువా కాపీ పూల బొకేతో ఘనంగా సన్మానం చేశారు. ఈసందర్భంగా బీరంగూడ గ్రామ అభివృద్ధి విషయంపై వారు చర్చించారు. పార్టీలకు అతీతంగా బీరంగూడ అభివృద్ధి కీ కలిసి కట్టుగా కృషిచద్దామని తెలిపారు. ఈసందర్భంగా శశికలా బీరంగూడ అభివృద్ధి కీ సంపూర్ణ సహకారం అందజేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో బీరంగూడ అధ్యక్షులు అడెల్లి రవీందర్ మాజీ కన్సిలర్ అనురుద్ రెడ్డి యాదవ రెడ్డి ప్రధాన కార్యదర్శి చిన్నా వీరేష్ ఉపాధక్షులు సత్యనారాయణ నక్కల కిష్టయ్య కోశాధికారి బంటు శివ కార్యదర్శి బంటు రమేష్ సభ్యులు ఎడ్ల అశోక్ బంటు ప్రవీణ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు



## జిన్నారం మున్సిపాలిటీలో కొనసాగుతున్న జనగణన

**జిన్నారం మే 16(వుదయం ప్రతినిధి)**
జిన్నారం మున్సిపాలిటీలో జనగణన ప్రక్రియ గత రెండు మూడు రోజులుగా కొనసాగుతోంది. జన గణన సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగులు ఇంటింటికి తిరుగుతూ కుటుంబ వివరాలు, జనాభా సమాచారం సేకరిస్తున్నారు. ప్రజలు సరైన వివరాలు అందించి అధికారులకు సహకరించాలని అధికారులు కోరుతున్నారు. జనగణన ద్వారా ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఖచ్చితమైన డేటా అందుబాటులోకి రానుంది. ఇంటి యజమాని వివరాలతో పాటు కుటుంబ సభ్యుల సంఖ్యను ఆన్లైన్ లో నమోదు ప్రక్రియ చేస్తున్నారు. ఇంటికి వచ్చే సర్వే సిబ్బందికి మున్సిపల్ ప్రజలు సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

# గర్భిణీల ప్రాణాలతో వైద్య సిబ్బంది చెలగాటం..!

- షాద్ నగర్, తాండూరు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వరుస ఘటనలు
- కాన్పు అయిన మహిళల తీవ్ర అవస్థ దేవుడెరుగు..?
- సంఘటన తర్వాత దీనిపై వైద్య సిబ్బంది నిశబ్దం
- చర్యల కోసం బాధితుల డిమాండ్
- సంఘటనలు వెలుగు చూస్తున్నా - చర్యలు శూన్యం



మొన్న రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో ప్రసవించిన ఓ మహిళ విషయంలో కడుపులోని కాటన్ ఉంచిన వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తీవ్ర అస్వస్థతకు గురై మూడు నెలల పాటు నరకయాతన అనుభవించిన సంఘటన మరువకముందే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లా వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలోని ప్రభుత్వ మాతా శిశు సంరక్షణ ఆసుపత్రిలో కూడా మరో మహిళ పట్ల ఇదే సంఘటన ఎదురయింది. వారం వ్యవధిలో రెండు ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ వైద్య సేవలు ప్రతిష్టపాలు అవుతున్నాయి. ఈ నేపథ్యంలో సంఘటన జరిగాక వైద్య ఆరోగ్యశాఖ అధికారులు దీనిపై ఎలాంటి విచారణ విషయంలో వెంటనే స్పందించకపోవడం పట్ల జనాల్లో ప్రభుత్వ వైద్యం పట్ల నిరాసక్తి కలుగుతుంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల పర్యవేక్షణ లోపించింది. డెలివరీ కోసం వచ్చే గర్భిణీల ప్రాణాలతో వైద్య సిబ్బంది చెలగాటం ఆడుతున్నారు. తాజాగా జరుగుతున్న పరిణామాలలో వైద్యులు చేసిన నిర్లక్ష్యం వారి ప్రాణాల మీదకు తెచ్చింది.అసలేం జరిగిందంటే..?

**షాద్ నగర్ లో..**
రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో భవ్య అనే 27 సంవత్సరాల మహిళ గత ఫిబ్రవరి 7న ఆస్పత్రిలో ప్రసవం కోసం వచ్చింది. అయితే ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవించిన అనంతరం ఒక మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఆమెకు సాధారణ ప్రసవం కాక రక్తస్రావం కాకుండా వైద్య సిబ్బంది భవ్య వజైనలో కాటన్ బట్టను పెట్టి మర్చిపోయారు. అయితే మూడు నెలలుగా భవ్య తీవ్ర కడుపునొప్పి రక్తస్రావంతో బాధపడుతోందనీ ఆమె అత్త నిర్మలమ్మ వైద్యుల ముందు వాపోయారు. అయితే ఏంటి బేటిక్ ఇతర పెయిన్ కిల్లర్స్ మందులు రాసి ఇచ్చారు. భవ్యకు ఎం జరిగింది? ఎవరు కనీసం ఆమె చేయి పట్టుకుని పరీక్షించలేదు. కేవలం మందులు రాసి మాత్రమే పంపించారు. దీంతో వారు మూడు నెలల పాటు అనేక ఇబ్బందులు ఎదుర్కొని ప్రభుత్వ వైద్య సేవల పట్ల నిరాసక్తి వ్యక్తం చేశారు. ఇంతకు కడుపునొప్పి తగ్గకపోవడంతో మరో మహిళా డాక్టర్ ను ప్రత్యేకంగా కలుసుకున్నారు. ఆమె ద్వారా భవ్యను పరీక్షించి ఆమె కడుపు ఒజైనాలో ఉన్న కాటన్ వస్త్రాన్ని బయటకు లాగి పడేశారు. ఇంత నిర్లక్ష్యం నిర్లిప్తత ఎందుకని బాధితురాలి అత్త నిర్మలమ్మ వైద్య శాఖలోని సిబ్బందిని ప్రశ్నిస్తుంటే చర్యలు తీసుకోవడానికి కానీ లేదా వారికి తగిన సమాధానం చెప్పడానికి వైద్య సిబ్బంది సిద్ధంగా లేరని ఆమె వాపు అవుతుంది. ప్రభుత్వ ఆసుపత్రిలో జాబుదారితనం లేకపోవడం ఏమిటని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తుంది. సంఘటన జరిగి ఇన్ని రోజులు గడుస్తున్నప్పటికీ తన ఫిర్యాదులు కూడా స్వీకరించడం లేదని ఫిర్యాదు ఇవ్వడానికి వస్తే అధికారులు పట్టించుకోవడంలేదని తనను పంపించేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటన జరిగి మీడియాలో అనేక కథనాలు వస్తున్నప్పటికీ ఇప్పటివరకు అధికారులు మీడియాకు కూడా ముఖం చాటేశారు. జరిగిన విషయంపై వివరణ కూడా ఇచ్చుకోలేని పరిస్థితి నెలకొంది. ఈ వ్యవహారంలో బాధితులదే తప్పు అన్న విధంగా వైద్య సిబ్బంది కొత్త విషయాన్ని క్రియేట్ చేసి పట్టించుకోవడంలేదని సాదాసీదాగా ఈ విషయాన్ని కొట్టిపారేస్తున్నారని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

**కాటన్ ఉంచి.. కుట్లు వేసేశారు !**
**తాండూరు ప్రభుత్వాసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం**
**కాన్పు అయిన మహిళకు తీవ్ర అస్వస్థత**
వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం నావాల్గకు చెందిన గర్భిణి ఆర్తి ఈ నెల 3న తాండూరు మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో చేరింది. అదే రోజు ఆమెకు సాధారణ ప్రసవం కాగా రక్తస్రావం కాకుండా వైద్యులు కాటన్ ఉంచి కుట్లు వేశారు. అనంతరం దానిని తొలగించకుండా ఆమెను ఇంటికి పంపించేశారు. ఈ క్రమంలో బాధిత మహిళ తీవ్ర అస్వస్థతకు గురైంది. దీంతో శుక్రవారం కుటుంబ సభ్యులు ఆమెను మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చి వైద్య సిబ్బందిని నిలదీశారు. ఆర్తి ఆరోగ్య పరిస్థితిని గమనించిన ఆర్ఎంఓ డాక్టర్ అనిల్
కుమార్ అత్యవసర చికిత్స నిమిత్తం హైదరాబాద్కు తరలించారు. ఆగ్రహించిన బాధితురాలి బంధువులు డాక్టర్ స్నేహ, మంజులపై చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులకు ఫిర్యాదు చేశారు. సీఎం సొంత జిల్లాలో కూడా వైద్య సేవల పట్ల పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు..

## నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా సెంట్రింగ్ పనులు బంద్

- ఒక ఫిట్‌కు రూ.150 రేటు సాధించే వరకు ఉద్యమం ఆగదు : కంకంటి జంగయ్య కురుమ
- పది ఏళ్లుగా ఒకే రేటు.. లేబర్ ఛార్జీలు రెట్టింపు.. కాంట్రాక్టర్లకు భారీ నష్టాలు



**శంకర్‌పల్లి, మే 16 (వుదయం):**
రాష్ట్ర సెంట్రింగ్ యూనియన్ పిలుపు మేరకు నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా సెంట్రింగ్ పనులు పూర్తిగా నిలిపివేస్తున్నట్లు శంకర్‌పల్లి సెంట్రింగ్ యూనియన్ అధ్యక్షుడు కంకంటి జంగయ్య కురుమ తెలిపారు. ఈ సందర్భంగా వైస్ ప్రెసిడెంట్ నాగరాజుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. గత పదేళ్లుగా సెంట్రింగ్ పనులకు ఒకే రేటు కొనసాగుతుండగా, కార్మికుల లేబర్ ఛార్జీలు మాత్రం రెట్టింపుగా పెరిగిపోయాయని అన్నారు. ఈ పరిస్థితుల వల్ల సెంట్రింగ్ కాంట్రాక్టర్లు తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
యూనియన్ ఆధ్వర్యంలో శనివారం శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సాతి ప్రవీణ్ కుమార్కు, అలాగే శంకర్‌పల్లి సీఐ మీర్ ముద్దసిర్ అలీ, ఎస్ఐ సురేష్లకు సెంట్రింగ్ పనులు నిలిపివేస్తున్నట్లు వినతిపత్రాలు అందజేశారు. సెంట్రింగ్ పనుల రేటు పెంచాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా స్పందన లేకపోవడంతో చివరకు ఉద్యమ బాట పట్టాల్సి వచ్చిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఇదే తరహా పరిస్థితి నెలకొనడంతో యూనియన్ పిలుపునకు సంఘీభావంగా పనులు నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు.
ఈ సందర్భంగా కంకంటి జంగయ్య మాట్లాడుతూ, "గత పది సంవత్సరాలుగా సెంట్రింగ్ పనులకు రేటు మారలేదు. కానీ లేబర్ రేటు మాత్రం రెండు రెట్లు పెరిగింది. మెటీరియల్ ధరలు కూడా పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో పాత రేటుతో పనులు కొనసాగించడం అసాధ్యం. కాంట్రాక్టర్లకు తీవ్ర నష్టం జరుగుతోంది" అని పేర్కొన్నారు. అందుకే ఒక ఫిట్‌కు 150 రూపాయలు రేటు నిర్ణయించే వరకు ఈ ఉద్యమాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు. అవసరమైతే మరింత ఉధృతంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి శేఖర్ రెడ్డి, కోశాధికారి వేమారెడ్డి, సలహాదారులు మల్లేష్, బాలరాజ్, బిక్షపతి, శ్రీనివాస్, కృష్ణ, రైటర్ కృష్ణ, బి శ్రీనివాస్, కే కృష్ణ, పోచయ్య, బంధయ్య గౌడ్, ఆగమయ్య తదితరులు పాల్గొన్నారు. సెంట్రింగ్ పనుల రేటు పెంపు డిమాండ్‌పై ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి న్యాయం చేయాలని యూనియన్ నేతలు డిమాండ్ చేశారు



## వరుస చోరీలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్ట్,బంగారు ఆభరణాలు స్వాధీనం

**అమీనుపూర్ , మే 16 (వుదయం):**
అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇళ్లల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్‌జిల్లా నిందితుడిని శేరిలింగంపల్లి జోన్ క్రైమ్ టీమ్, మరియు అమీన్‌పూర్ పోలీసులు ఉమ్మడిగా శ్రమించి అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుండి సుమారు 50 తులాల బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శేరిలింగంపల్లి జోన్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం రామ్ నాయక్ తండాకు చెందిన మాండ్ల శివ అలియాస్ ఎర్ర శివ (32) నగరానికి వలసవచ్చి రంగారెడ్డి జిల్లా మీర్పేట్ మండలం భూపేష్ గుప్తా కాలనీలో నివాసం ఉంటున్నాడు. గృహ నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ విలాసవంతమైన జీవితానికి అలవాటు పడిన అతను సులభంగా డబ్బు సంపాదించడం కోసం దొంగతనాలు చేయడం ప్రారంభించాడు. వరుస చోరీలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసురుతున్నాడు. ఇదే క్రమంలో ఈఏడాది ఫిబ్రవరి 21న రాత్రి అమీన్‌పూర్ పరిధిలోని గాంధీగూడెం కాలనీలో ఉన్న ఒక ఇంటి తాళాన్ని ఇనుప రాడ్‌తో పగలగొట్టి, లోపలికి చొరబడి బంగారం, వెండి ఆభరణాలను దొంగిలించాడు. అలాగే ఏప్రిల్ రెండవ వారంలో అమీన్‌పూర్ పరిధిలోని బందంకొమ్ము ప్రాంతంలో తాళం వేసి ఉన్న ఒక ఇంటిని లక్ష్యంగా చేసుకుని, సుమారు 50 తులాల బరువున్న వజ్రాలు పొదిగిన బంగారు ఆభరణాలను అపహరించాడు. అదే నెల చివరి వారంలో బీరంగూడ ప్రాంతంలోని ఓ ఇంట్లో చొరబడి అల్మారాలో దాచిన విలువైన వాచీలతో పాటు కొంత నగదును దొంగిలించాడు. వరుస చోరీలను సీరియస్ గా తీసుకున్న పోలీసులు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ భూపతి, అమీన్‌పూర్ డీఐ శ్రీ సత్యనారాయణ క్రైమ్ టీమ్ సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి నిందితుడిని పట్టుకున్నారు. అతడి వద్ద నుండి 45 తులాల బంగారు ఆభరణాలు, వజ్రాలు పొదిగిన నగలు, రూ. 5,000 నగదు, ఒక స్కూటర్, దొంగతనానికి ఉపయోగించిన ఒక ఇనుప రాడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఎర్ర శివపై మల్కాజ్‌గిరి కమిషనరేట్, సైబరాబాద్ కమిషనరేట్, నాగర్‌కర్నూల్ జిల్లాల పరిధిలో మొత్తం 24 దొంగతనం కేసులు ఉన్నాయి. గతంలో ఇతను పలుమార్లు జైలుకు కూడా వెళ్లి వచ్చాడని పోలీసులు తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసు సిబ్బందిని శేరిలింగంపల్లి జోన్ డీసీపీ చింతామనేని శ్రీనివాస్, డీసీపీ (క్రైమ్స్) ముత్యంరెడ్డి, అడిషనల్ డీసీపీ ఎన్. ఉదయ్ రెడ్డి, ఏసీపీ (క్రైమ్స్) నాగేశ్వరరావులు అభినందించారు.








## బోర్ మోటార్ ను ప్రారంభించిన షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్

**షాద్ నగర్:**
వేసవికాలం దృష్టిలో పెట్టుకొని షాద్ నగర్ మున్సిపాలిటీలో షాద్ నగర్ 15వ వార్డులో నీటి ఎద్దడి నివారణ కోసం నూతనంగా బోరు మోటర్ ను ఏర్పాటు చేస్తారు శనివారం బోర్ మోటార్ ను ప్రారంభించిన షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్. షాద్ నగర్ మున్సిపల్ ప్రజలకు ఎటువంటి సమస్య వచ్చిన నా దృష్టి కి తీసుకుని రండి తప్పకుండా పరిష్కారం చేస్తానని తెలిపిన మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ అన్నారు,, ఈ కార్యక్రమంలో జమ్రుద్ ఖాన్ సాదిక్ మల్లికార్జున్ మున్సిపల్ అధికారులు,కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు...

## నేడు బొల్లారంలో ఉచిత వైద్య శిబిరం

**జిన్నారం మే 16(వుదయం ప్రతినిధి)**
బొల్లారం డివిజన్ పరిధిలోని బిజెపి పార్టీ కార్యాలయంలో నేడు ఉదయం 9 గంటల నుంచి 11:30 గంటల వరకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు డివిజన్ పార్టీ అధ్యక్షుడు ఆనంద్ కృష్ణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శుభకర ఆసుపత్రి సౌజన్యంతో రోగులకు జనరల్ ఫిజీషియన్ వైద్యులు ఆర్బిఎస్ టిఎస్హెచ్ బీపీ చెక్ అప్ ఈసీజీ వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించి మందులు పంపిణీ చేస్తారని పారిశ్రామికవాడలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.






## బి ఎం ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మరాఠీ కృష్ణమూర్తికి ఘన సన్మానం

- ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్, ఆర్టిజన్ సమస్యల పరిష్కారం కోసం పోరాడాలి - బీజేపీ అధికార ప్రతినిధి కప్పర ప్రసాదరావు

**గజ్వేల్, 16 మే (వుదయం):**
తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ (బీఎంఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఇటీవల ఎన్నికైన మరాఠీ కృష్ణమూర్తిని గజ్వేల్‌లోని వారి నివాసంలో పలువురు నాయకులు కలిసి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ అధికార ప్రతినిధి కప్పర ప్రసాదరావు మాట్లాడుతూ, ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్, ఆర్టిజన్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం యూనియన్ నిరంతరం పోరాటం చేయాలి. ఉద్యోగుల హక్కుల పరిరక్షణలో బీఎంఎస్ కీలక పాత్ర పోషిస్తోంది. నూతన రాష్ట్ర కమిటీ కార్మికుల సంక్షేమం కోసం సమిష్టిగా పనిచేయాలి" అని అన్నారు.అనంతరం నిర్వహించిన సమావేశంలో ఉద్యోగుల సమస్యలు, సంఘ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. మరాఠీ కృష్ణమూర్తికి కప్పర ప్రసాదరావు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బింగి స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి తూర్పుంటి శీను, జిల్లా ఉపాధ్యక్షులు బాలు భూపతి రాజు, గజ్వేల్ నియోజకవర్గ అధ్యక్షులు గుడాల శేఖర్, ప్రధాన కార్యదర్శి ఎల్లంరాజు, రాష్ట్ర నాయకులు సిద్ధల రవి, బైరి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



"మేనల్లుడు (అభిషేక్ బెనర్జీ) రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి పదేళ్లుగా ప్రజలు ఓటు వేయలేని పరిస్థితి ఫల్తాలో ఉంది. ఈ రీపోలింగ్‌తో ఓటర్ల హక్కులు మళ్లీ స్థిరపడతాయి. ఇప్పుడు పరిస్థితి మారింది. ఫల్తా ఓటర్లు బీజేపీ అభ్యర్థిని లక్ష కు పైగా మెజారిటీతో గెలిపించాలని కోరుతున్నా. అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో తృణమూల్ నేత, ఫల్తా అభ్యర్థి జహంగీర్ ఖాన్ తనను తాను "పుష్ప"గా చెప్పుకున్నారు. "పుష్ప" సినిమాలో అల్లు అర్జున్ పోషించిన స్మగ్లర్, శక్తిమంతమైన పాత్ర. "పుష్ప" అని చెప్పుకునే జహంగీర్ ఖాన్ అత్యంత కిరాతక నేరస్థుడిగా గుర్తింపు పొందిన వ్యక్తి. అతడి వ్యవహారాన్ని నేను స్వయంగా చూసుకుంటా. పుష్ప అని చెప్పుకునే ఆ వ్యక్తి బాధ్యత ఇప్పుడు నాది"

- సువేందు అధికారి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి

## వే'మన' పద్యం

పాల నీడిగింట గ్రోలుచునుండెనా
మనుజులెల్లగూడి మద్యమండ్రు
నిలువదగనిచోట నిలువ నిందలువచ్చు
విశ్వదాభిరామ వినురవేమ



# ఘర్షణా బిందువుగా తైవాన్

తైవాన్ విషయంలో విభేదాలు చైనా, అమెరికాల మధ్య సంబంధాలను దెబ్బతీస్తాయని హెచ్చరిస్తూ గ్జీ జిన్‌పింగ్ చేసిన తాజా వ్యాఖ్యలు, ప్రపంచంలోని అత్యంత సంక్లిష్టమైన భౌగోళిక రాజకీయ వివాదంపై మరోసారి ప్రపంచ దృష్టిని సడింది. తైవాన్ స్వాతంత్రం, తైవాన్ జల సంధికి ఇరువైపులా శాంతి అనేవి ప్రాథమికంగా పరస్పరం పొసగని విషయాలని గ్జీ స్పష్టం చేశారు. ఇది దశాబ్దాలుగా బీజింగ్ స్థిరంగా కొనసాగిస్తున్న వైఖరి. ఈ అంశం చైనా విదేశాంగ విధానంలో ప్రధానమైనదిగా, అమెరికాచైనా సంబంధాలలో ఒక పెద్ద ఘర్షణా బిందువుగా మిగిలిపోయింది.

తైవాన్ ఆధునిక రాజకీయ స్థితికి మూలాలు చైనా అంతర్యుద్ధం, శతాబ్దాల తరబడి మారుతున్న వలస పాలనలో ఉన్నాయి. చారిత్రాత్మకంగా ఫార్మోసా అని పిలిచే ఈ ద్వీపంలో, కొన్ని భాగాలు 17వ శతాబ్దంలో డచ్, స్పానిష్ వారి నియంత్రణలోకి రాకముందు శతాబ్దాల పాటు స్థానిక సమాజాలు నివసించాయి. తరువాత క్వింగ్ రాజవంశం 1684లో తైవాన్‌ను ఫుజియాన్ ప్రావిన్స్‌లో విలీనం చేసి, 1885లో అధికారికంగా దానిని ఒక ప్రత్యేక ప్రావిన్స్‌గా చేసిందని చరిత్ర చెప్తోంది.

మొదటి సినోజపనీస్ యుద్ధంలో చైనా ఓటమి పాలైన తర్వాత, 1895లో తైవాన్ ను జపాన్‌కు అప్పగించారు. 1945లో రెండవ ప్రపంచ యుద్ధం ముగిసే వరకు అది జపాన్ వలస పాలనలోనే కొనసాగింది.

1949లో చైనా అంతర్యుద్ధంలో మావో జెడాంగ్ నేతృత్వంలోని కమ్యూనిస్టు దళాల చేతిలో ఓటమి పాలైన రిపబ్లిక్ ఆఫ్ చైనా ప్రభుత్వం, తైవాన్‌కు తరలిపోయింది. ఆ తర్వాత, మావో బీజింగ్‌లో పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనాను స్థాపించడం చరిత్ర. అప్పటి నుంచే, రెండు ప్రభుత్వాలూ కూడా మొత్తం చైనాకు తామే ప్రతినిధులమని ప్రకటించుకుంటున్నారు. తైవాన్‌ను ఒక విడిపోయిన ప్రాంతంగా, అవసరమైతే బలప్రయోగం ద్వారా అయినా చివరికి చైనా ప్రధాన భూభాగంతో తిరిగి ఏకీకృతం చేయాలని బీజింగ్ భావిస్తోంది. ఈ పునరేకీకరణను సాధించడానికి సైనిక చర్యను విరమించుకోవడానికి చైనా అధికారులు పదేపదే నిరాకరించారు. 1971లో, ఐక్యరాజ్యసమితి తీర్మానం 2758 ప్రకారం, చైనా ప్రధాన కార్యాలయాన్ని తైపీ నుండి బీజింగ్‌కు బదిలీ చేయడం ద్వారా, పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా (పిఆర్‌సి) అంతర్జాతీయ చట్టబద్ధతను గణనీయంగా బలోపేతం చేసింది. నివేదికల ప్రకారం, నేడు కేవలం కొన్ని దేశాలు మాత్రమే తైవాన్‌తో అధికారిక దౌత్య సంబంధాలను కొనసాగిస్తున్నాయి.

తైవాన్‌పై తన ప్రాదేశిక వాదనకు మద్దతుగా చైనా తరచుగా ఈ తీర్మానాన్ని సాక్ష్యంగా ఉదహరిస్తుంది. అయితే, ఐక్యరాజ్యసమితి తీర్మానం ఐక్యరాజ్యసమితిలో ప్రాతినిధ్యానికి సంబంధించినదే తప్ప, తైవాన్ సార్వభౌమాధికారాన్ని స్పష్టంగా నిర్ధారించలేదని తైపీ, వాషింగ్టన్ వాదిస్తున్నాయి.

ఒకప్పుడు హాంగ్ కాంగ్‌లో అమలు చేసిన నమూనాను పోలిన ఒక దేశం, రెండు వ్యవస్థలు అనే చట్రాన్ని బీజింగ్ కూడా ప్రతిపాదించింది. కానీ ఈ ప్రతిపాదనకు తైవాన్‌లో పెద్దగా మద్దతు లభించలేదు.

అమెరికా 1979లో అధికారికంగా దౌత్య గుర్తింపును తైపీ నుండి బీజింగ్‌కు మార్చింది. అయితే, అదే సమయంలో వాషింగ్టన్ తైవాన్ సంబంధాల చట్టాన్ని ఆమోదించింది. ఇది తైవాన్‌తో అనధికారిక సంబంధాలు కొనసాగడానికి అనుమతించడంతో పాటు, ఆ ద్వీపానికి రక్షణ మద్దతు అందించడానికి అమెరికాను కట్టుబడి ఉండేలా చేసింది. అమెరికా ఒకే చైనా విధానం, బీజింగ్ ఒకే చైనా సూత్రంకు భిన్నంగా ఉంటుంది. తైవాన్ చైనాలో భాగమనే బీజింగ్ వాదనను వాషింగ్టన్ అంగీకరించినప్పటికీ, ఆ ద్వీపంపై చైనా సార్వభౌమాధికారాన్ని అది అధికారికంగా ఆమోదించదు.

విస్తృతమైన దౌత్య గుర్తింపు లేనప్పటికీ, తైవాన్ తన సొంత ప్రజాస్వామ్య ప్రభుత్వం, సైన్యం, పాస్‌పోర్ట్, న్యాయ వ్యవస్థ, కరెన్సీతో వాస్తవ సార్వభౌమ రాజ్యంగా పనిచేస్తోంది. కొందరు రాజకీయ కార్యకర్తలు దేశం పేరును రిపబ్లిక్ ఆఫ్ తైవాన్‌గా మార్చాలని వాదిస్తున్నప్పటికీ, అటువంటి రాజ్యాంగ మార్పుకు శాసనసభ, ప్రజల నుండి అఖండ మద్దతు అవసరం. ఈ విషయంపై తైవాన్‌లోని ప్రధాన రాజకీయ పార్టీలు విభేదిస్తున్నందున, సమీప భవిష్యత్తులో అటువంటి చర్య రాజకీయంగా కష్టంగానే ఉంటుంది.

గ్జీ జిన్‌పింగ్ తైవాన్‌కు ఇచ్చిన హెచ్చరిక, ఆ ద్వీపపు వివాదాస్పద హోదాపైనా, అలాగే పెరుగుతున్న అమెరికాచైనా ఉద్రిక్తతలలో దాని పాత్రపైనా దృష్టి మళ్లేలా చేస్తోంది.

## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# మానవాళి శ్రేయస్సుకు టెలీకమ్యూనికేషన్, ఇన్ఫర్‌మేషన్ రంగాలు




17 మే 1865 రోజున పారిస్‌లో జరిగిన తొలి "అంతర్జాతీయ టెలిగ్రాఫ్ ఒప్పందం"పై సంతకం చేయడంతో "అంతర్జాతీయ టెలీకమ్యూనికేషన్ యూనియన్ (ఐటియూ)" ఆవిర్భవించడం జరిగిన విషయానికి గుర్తుగా 2005 నుంచి ప్రతి ఏటా 17 మే రోజున "ప్రపంచ టెలీకమ్యూనికేషన్, సమాచార సమాజ దినోత్సవం (వరల్డ్ టెలీకమ్యూనికేషన్ అండ్ ఇన్ఫర్‌మేషన్ సొసైటీ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. నాటి నుంచి నేటి వరకు శాస్త్రసాంకేతికరంగాలు కొత్త పుంతలు తొక్కుతూ, సమాచార విప్లవ సునామీకి కారణం అవుతున్నది టెలీకమ్యూనికేషన్స్, ఇన్ఫర్‌మేషన్ రంగాల్లో వచ్చిన సానుకూల మార్పులతో ప్రపంచ మానవాళి అనుసంధానం సుసాధ్యం అయ్యింది. స్మార్ట్‌ఫోన్లు, అంతర్జాలం, టెలీకమ్యూనికేషన్, సమాచార సాధన, ఉపగ్రహాలు, ఫైబర్ ఆప్టిక్స్, డేటా వ్యవస్థలు, రేడియో, టీవీ, ప్రసార సాధనాలు లాంటి అనేక ఉపయుక్త ఉపకరణాలతో మానవాళి నేడు డిజిటల్ విప్లవం నుంచి ఏఐ యుగం వైపు అడుగులు వేస్తున్నది. నేడు భూమి కుగ్రామం అయ్యింది. దూరాలు, సరిహద్దుల అర్థాలు మారిపోయాయి.

**టెలీకమ్యూనికేషన్, సమాచార అనువర్తనాలు:**

ప్రపంచ టెలీకమ్యూనికేషన్, సమాచార సమాజ దినోత్సవం వేదిక కేవలం సాంకేతిక వేడుక మాత్రమే కాదు. ఈ వేదికగా సమ్మిళితత్వం, స్థితిస్థాపకత, సుస్థిరతలకు సరైన సమాధానాలు దొరుకుతున్నాయి. ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు పడుతున్నాయి. సమాచార ప్రసారాల్ని ఒక జీవనాధారంగా, ఒక అభ్యసన సాధనంగా, నూతన అవకాశాలకు వారధిగా ప్రచారం చేయడానికి ఈ వేదికలు ఉపయోగపడుతున్నాయి. ముందస్తు హెచ్చరికలు, అత్యవసర సమాచార ప్రసారాలు సుసాధ్యం చేయబడుతున్నవి. విపత్తులు, ఇతర సమయాల్లో ఆన్‌లైన్ తరగతులు, సమావేశాలు జరుగుటకు బాటలు పడ్డాయి. ప్రపంచ టెలీకమ్యూనికేషన్, సమాచార సమాజ దినోత్సవం వేదికగా డిజిటల్ అక్షరాస్యతను ప్రోత్సహించడం, స్క్రీన్ సమయాన్ని సమతుల్యం చేయడం, ఆన్‌లైన్ భద్రతపై చర్చించడం, మానవ జీవితాల్లో అనువర్తనాలను ప్రచారం చేయడం లాంటి అంశాలు చర్చించడం జరుగుతుంది.

**ప్రపంచ టెలీకమ్యూనికేషన్, సమాచార సమాజ దినోత్సవం-2026 ఇతివృత్తం:**

ప్రపంచ టెలీకమ్యూనికేషన్, సమాచార సమాజ దినోత్సవం2026 ఇతివృత్తంగా "డిజిటల్ జీవనరేఖలు: అనుసంధానించిన ప్రపంచంలో స్థితిస్థాపకతను బలోపేతం చేయడం" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. మన జీవితాలు టెక్నాలజీ వలలో చిక్కుకొని పోయాయి. స్మార్ట్‌ఫోన్ లేనిదే క్షణం గడవడం లేదు. సామాజిక మాధ్యమాల్లో సంచరించడం సర్వసాధారణం అయిపోయింది. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ముందస్తు హెచ్చరికలు భారీ ఆస్తి ప్రాణ నష్టాలను అరికడుతున్నాయి. ఉపగ్రహాలు భూమి మీద ఉన్న మానవాళిని ఏకం చేస్తున్నాయి. ఈ రోజున ఇంటర్నెట్, నూతన టెక్నాలజీల వల్ల కలిగే సామాజిక ప్రయోజనాలపై అవగాహన కలిపించడం, డిజిటల్ అంతరాలను తగ్గించడం, టెలీకమ్యూనికేషన్‌ఇన్ఫర్‌మేషన్ రంగాల అనువర్తనాలను వివరించడం విధిగా జరుగుతుంది.

1850 దశకంలో టెలిగ్రాఫ్‌ల వినియోగం ఊపందుకుంది. 1865 మే 17న యూరప్‌లోని 20 దేశాలు కలిసి అంతర్జాతీయ టెలిగ్రాఫ్ యూనియన్ ఏర్పాటు అయ్యింది. 1934లో దీని పేరును ఇంటర్నేషనల్ టెలీకమ్యూనికేషన్ యూనియన్‌గా మార్చడం జరిగింది. 1947 నుంచి ఐరాసకు అనుబంధ సంస్థగా పనిచేస్తోంది. 1969 నుంచి ఐటీయూ చొరవతో ఈ దినోత్సవం జరపడం ప్రారంభమైంది. 2005 నుండి ఐరాస నేతృత్వంలో ప్రపంచ టెలీకమ్యూనికేషన్, సమాచార సమాజ దినోత్సవం వేడుకలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. టెలీకమ్యూనికేషన్, ఇన్ఫర్‌మేషన్ లేని నేటి ప్రపంచం చీకటిమయం అవుతుంది. మన జీవనశైలిలో టెక్నాలజీ ఒక అవిభాజ్య అంగం అయిపోయింది. నేటి టెలీకమ్యూనికేషన్ విప్లవంతో పాటు ఇన్ఫర్‌మేషన్ సునామీని మానవాళి సుస్థిరాభివృద్ధికి వినియోగించుకోవాలని కోరుకుందాం, డిజిటల్ అంతరాలను తగ్గిద్దాం.

**(17 మే "ప్రపంచ టెలీకమ్యూనికేషన్, సమాచార సమాజ దినోత్సవం" సందర్భంగా)**



మధుసూదన్ రెడ్డి
9949700037

# కేరళలో కాంగ్రెస్ విజ్ఞతతో కూడిన నిర్ణయం?



అప్పటి ప్రతిపక్ష నాయకుడిగానూ, ప్రస్తుత ముఖ్యమంత్రి నియమిత వ్యక్తిగానూ ఉన్న వి.డి. సతీశన్ నేతృత్వంలో సాగిన భారీ 'పుదుయుగ యాత్ర' ముగింపు సందర్భంగా, ఈ నాయకులందరూ బాగానే నృత్యం చేస్తారు, కానీ వారందరూ కలిసికట్టుగా నృత్యం చేయాల్సిన అవసరం ఉంది అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. కేరళలో ఐకమత్యం ఎంత ఆవశ్యకమో గుర్తుచేసే ఒక సూటి వ్యాఖ్య అది. నిజానికి, ఈసారి అంతర్గత కలహాలను పక్కన పెట్టి యుడిఎఫ్ వారందరూ కలిసికట్టుగా అడుగులు వేసి, ఒక అద్భుతమైన ప్రజా తీర్పును సొంతం చేసుకున్నారన్నది వాస్తవం. కాంగ్రెస్ అధిష్ఠానంతో సాగించిన తీవ్రమైన అధికార పోరాట నృత్యం అనంతరం, కాంగ్రెస్ అధిష్ఠానం తదుపరి కేరళ ముఖ్యమంత్రిగా ఎంపిక చేసిన సతీశన్‌కు, "కలిసి నృత్యం చేయండి" అనే సలహా ఇప్పటికీ ఎంతో కీలకం. సతీశన్ వాదన బలంగా ఉంది. ఫిబ్రవరి 6 నుండి మార్చి 7 వరకు కేరళ ఉత్తర కొన నుండి దక్షిణ తీరం వరకు ఆయన ఈ పోరాటానికి ఆయన నాయకత్వం వహించారు. పుదుయుగ యాత్ర ద్వారా కాంగ్రెస్ ప్రచారానికి ముఖచిత్రంగా తన స్థానాన్ని ఆయన చాటిచెప్పారు.

గత ఐదేళ్లుగా ప్రతిపక్ష నాయకుడిగా పినరయి విజయన్‌తో నేరుగా తలపడి, ఆయన తనను తాను ఒక స్పష్టమైన ప్రత్యామ్నాయంగా నిరూపించుకున్నారు. యుడిఎఫ్‌లో అత్యంత శక్తివంతమైన మిత్రపక్షమైన ఐయుఎంఎల్ సంపూర్ణ విశ్వాసం, మద్దతు అప్పట్లో ఆయనకు ఉండేవి, ఇప్పటికీ ఉన్నాయి; అంతేకాక, యుడిఎఫ్‌లో అత్యంత ప్రముఖమైన ప్రజా ముఖంగా ఆయన స్పష్టంగా నిలుస్తున్నారు.

సతీసన్ బహిరంగంగా కనిపించే పాత్రకు భిన్నంగా, కేసీ వేణుగోపాల్ (కేసీవీ) పార్టీకి ప్రధాన నిర్ణయాధికారిగా వ్యవహరించారు. రాహుల్ గాంధీతో తనకున్న సాన్నిహిత్యాన్ని ఉపయోగించుకుని, కేసీవీ ప్రధాన వ్యూహకర్తగా వ్యవహరిస్తూ, అభ్యర్థులను స్వయంగా ఎంపిక చేస్తూ, ప్రచారాన్ని సరైన మార్గంలో నడిపించారు. అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేయకపోవడం ద్వారా, ఆయన ఓటర్లకు గందరగోళ సంకేతాలు వెళ్లకుండా నివారించారు. కేరళలో కేంద్ర అధికార అక్షంగా, పార్టీ క్రమశిక్షణను కాపాడటంలోనూ, ఎలాంటి ఘర్షణ వాతావరణం కనిపించకుండా ప్రచారానికి దూరంగా ఉండటంలోనూ కేసీవీ ప్రశంసలకు అర్హులు.

నెహ్రూగాంధీ కుటుంబానికి అత్యంత విశ్వాసపాత్రుడైన రమేష్ చెన్నితాల, ప్రచార కమిటీ అధిపతిగా వ్యవహరించారు. ముఖ్యమంత్రి పదవి కోసం ఆయన ప్రయత్నించినప్పటికీ, 2021 ఎన్నికల వైఫల్యం నేపథ్యంలో ఆయన రాజకీయ వైభవం ముగిసిపోయిందని చాలామంది భావిస్తున్నారు. ఈసారి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించడానికి ఆయనకు ఉన్న ఏకైక మార్గంగా కెసివి, సతీశన్ మధ్య ఉన్న పోటీ తీవ్రమైన ప్రతిష్టంభనకు చేరుకున్న పక్షంలో ఆయన ఒక "సర్వసమ్మత అభ్యర్థి"గా ఎంపిక అవుతానని ఆశించారు.

అప్పుడు కాంగ్రెస్ అధిష్ఠానానికి ఒక సందిగ్ధ పరిస్థితి ఎదురైంది. నాయకత్వ ఆదేశాలను కచ్చితంగా పాటించే కెసివి వంటి విధేయుడిని ఎంచుకోవాలా, లేక తరచుగా తనదైన శైలిలో స్వతంత్రంగా వ్యవహరించే శక్తివంతమైన ప్రజా నాయకుడైన సతీశన్‌ను నియమించాలా? అన్నదే అది.

విడిఎస్ తన పట్టు వదలకపోవడమే ఆయన నియామకానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. తాను అసెంబ్లీకి రాజీనామా చేస్తానని, మరెవరి ప్రభుత్వంలోనూ భాగం కాబోనని ఆయన చెప్పినట్లు సమాచారం. ఇది ఒక పెను విపత్తుకు దారితీసేది. ఆయనను వెళ్లనిస్తే తీవ్ర అస్థిరత, భారీ ప్రజా వ్యతిరేకత ఏర్పడేవి. ఇంతటి ఘన విజయం తర్వాత పార్టీ అలాంటి పరిస్థితిని భరించలేని స్థితిలో ఉండేది. మరో కారణం, 22 మంది ఎమ్మెల్యేలు ఉన్న అతి పెద్ద మిత్రపక్షమైన ఐయూఎంఎల్ సంపూర్ణ మద్దతు ఇవ్వడం.

నిజానికి, సతీసన్‌ను నియమించడం కోసం లీగ్ ఒత్తిడికి కాంగ్రెస్ లొంగిపోయిందని ఆరోపిస్తూ, బీజేపీ ఆరోపణలు చేసింది. ఇది ఒక సాధారణ రాజకీయ ఆరోపణ అయినప్పటికీ, బీజేపీ ఉద్దేశపూర్వకంగా కాంగ్రెస్‌ను 'మైనారిటీఆధారిత' పార్టీగా చిత్రీకరిస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ వాదనను ఆ పార్టీ జాతీయ స్థాయిలో పదేపదే ప్రచారం చేసింది. ఇలా చేయడం ద్వారా, ఎల్‌డీఎఫ్ ఘోర పరాజయం వల్ల ఏర్పడిన శూన్యంలో ఒక అవకాశాన్ని అందిపుచ్చుకోవడానికి, కేరళలో హిందూ ఓటు బ్యాంకును పటిష్టం చేసుకోవాలని వారు లక్ష్యంగా పెట్టుకున్నారు.

రాజకీయ ఆరోపణలను పక్కన పెడితే, యుడిఎఫ్‌ను ఒక విస్తృత సామాజిక కూటమిగా పరిగణించే, దృఢమైన లౌకిక భావజాలం కలిగిన నాయకుడిగా సతీశన్ విస్తృతంగా గుర్తింపు పొందారు. తన పూర్వగాములలో చాలామందిలా కాకుండా, ఆయన ఎన్ ఎస్ ఎస్ లేదా ఎస్ ఎన్‌డిపి వంటి శక్తివంతమైన మతపరమైన లేదా కులఆధారిత ప్రయోజన వర్గాలను బుజ్జగించే ప్రయత్నం చేయలేదు. ఈ వైఖరి ఆయన లౌకిక నిబద్ధతను మరింత బలపరుస్తున్నప్పటికీ, రాష్ట్ర పరిపాలనలో తమ మాటే చెల్లుబాటు కావాలని అలవాటు పడిన ఈ ప్రభావవంతమైన వర్గాల నుండి ఆయన తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందని కూడా దీని అర్థం.

కర్ణాటకలో కనిపించిన నాయకత్వ అంతర్యుద్ధాలు పునరావృతమవుతాయనే భయంతో, సతీశన్‌ను పక్కన పెట్టడం భారీ ప్రజా వ్యతిరేకతకు, తక్షణ అస్థిరతకు దారితీస్తుందని కాంగ్రెస్ హైకమాండ్ గ్రహించింది. ఈ నిర్ణయం సంపూర్ణ స్పష్టత కోసం, ఎలాంటి గందరగోళాన్నైనా తొలగించడం కోసం తీసుకున్నది. రాబోయే ఐదేళ్లపాటు ఇదే పరిస్థితి కొనసాగుతుందని కేరళ ఆశిస్తోంది.

గాంధీ కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా ఉన్న కెసివిని బుజ్జగించడం సులభమని భావించారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఆ పదవి కోసం ఆయన మొదట్లో చేసిన ప్రయత్నం చూస్తుంటే, ఆయనకు అధిష్ఠానం ఆశీస్సులు ఉన్నాయనిపిస్తుంది. ఢిల్లీ నుండి పచ్చజెండా లభించకుండా ఆయన బహుశా సతీశన్‌ను సవాలు చేసి ఉండేవారు కాదు.

వి.డి. సతీశన్ తన అధికార ధోరణికి ప్రసిద్ధి చెందారు. పశ్చిమ కనుమలలోని శిఖరాలన్నింటినీ అధిరోహించిన వన్యప్రాణి ప్రేమికుడు, పుస్తక ప్రియుడు అయిన ఆయన, తన కథలను తానే రాసుకునే ఒక ఏకాకి. ఆయనలోని ఈ స్వతంత్ర తిరుగుబాటు స్వభావమే హైకమాండ్‌ను కలవరపెడుతోంది. బెంగళూరుపై పట్టు కోల్పోయిన విధంగా తిరువనంతపురంపై కూడా నియంత్రణ కోల్పోవడానికి వారు సుముఖంగా లేరు.

సతీశన్ పదవీ ప్రమాణ స్వీకారం చేయనున్న తరుణంలో, సమ్మిళితత్వం పాటించడమే ఆయనకు అతిపెద్ద సవాలు కానుంది. ఇందులో విజయం సాధించాలంటే, ఆయన కెసివి, చెన్నితాల, ఇద్దరి అనుచరులనూ కీలక పదవుల్లో సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. ఆయన ముఖ్యమంత్రి కావచ్చు, కానీ ఒక పెద్ద, సంక్లిష్టమైన నృత్య బృందంలో సమానులలో ప్రథముడిగాస మిగిలిపోవాలి. కేరళకు నాయకత్వం వహించాలంటే, సతీసన్ చివరకు అందరితో కలిసి నృత్యం చేయడం, ఢిల్లీ, తిరువనంతపురం మధ్య అనేక రాగాలకు నృత్యం చేయడం నేర్చుకోవాలి.

# సంక్షోభంలో పొదుపు, దేశ ప్రగతికి గెలుపు

నేపథ్యంలో దేశ ఆర్థిక వ్యవస్థను
కాపాడుకోవడానికి నరేంద్ర మోడీ
ఇచ్చిన ఏడు పొదుపు పిలుపులకు స్పందిస్తూ
రాసిన కవిత)

యుద్ధ సంక్షోభం
దేశ రక్షణకు పొదుపు
మంత్రం కావాలి

పచ్చిమాసియా తీరాల్లో
కమ్ముకున్న యుద్ధ మేఘాలు
చమురు ధరల సంక్షోభం
దేశ ప్రగతికి అడ్డంకిగా
నిలిచిన వేళ ప్రధాని నరేంద్ర
మోడీ ఇచ్చిన పొదుపు
మంత్రం అందరం పాటిద్దాం

స్వయం నియంత్రణతో దేశ
ఆర్థిక వ్యవస్థను కాపాడుదాం

వాహనాల వాడకం తగ్గిద్దాం
ప్రజా రవాణాను ఆశ్రయిద్ధాం
ఒకే కారులో నలుగురం
ప్రయాణిద్దాం
ఇంధన భారాన్ని తగ్గిద్దాం
అనవసరపు ప్రయాణాలకు
స్వస్తి పలుకుదాం

వర్క్ ఫ్రమ్ హోంకు
ప్రాధాన్యత ఇద్దాం
బంగారు కొనుగోళ్ళుఆపి
విదేశీ మారకపు నిల్వలు
రక్షిద్దాం

పసిడిపై మోజును ఏదాది
పాటు వాయిదావేద్దాం

విదేశీ దిగుమతులు అడ్డుకుందాం
దిగుమతుల ప్రత్యామ్నాయ
ఉత్పత్తులు పెంచుదాం

పరాయి దేశాల వంట
నూనెల వాడకాన్ని తగ్గిద్దాం
స్వదేశీ నూనెలను ప్రోత్సహిద్దాం
ప్రకృతి సాగును ప్రోత్సహిద్దాం

విదేశీ విహార యాత్రలు వద్దు
స్వదేశీ పర్యటనే ముద్దు



స్వదేశీ మంత్రంతో ఆత్మనిర్భర
భారతను గెలిపిద్దాం

సొంత సుఖాల కన్నా
దేశ ప్రజల శ్రేయస్సేమిన్న
జాతి అభివృద్ధే ధ్యేయంగా
స్వదేశీయే జాతి జీవనశైలిగా

ఎంచుకుందాం స్వదేశీ
ఉత్పత్తులను నమ్మదాం
స్వదేశీ ముద్దు విదేశీ వద్దు

ప్రధాని చెప్పిన ఏడు సూత్రాలు
పాటించడం మన జాతీయ
బాధ్యతగా స్వీకరిద్దాం

భారత దేశ ప్రతిష్ఠలు
ప్రపంచానికి చాటుదాం

పొదుపు అనే ఆయుధంతో
సంక్షోభాన్ని ఎదుర్కొందాం

ఆడంబరాలు వద్దు ఆదాయాన్ని
మించి వ్యయం చేయద్దు
అప్పుల పాలు కావద్దు
మిత వ్యయ మంత్రమే
మన ఆర్థిక వికాస తంత్రమై
ప్రగతికి దిక్సూచి కావాలి

మితవ్యయమే మనకు
రక్షణ కవచం అవుతుంది

ఆదాయాన్ని మించి ఖర్చు
చేయద్దు పొదుపుంచేసే
గుణమే ప్రగతికి పురోగతికి
మూలం

అవసరాల కోసం పరిమిత
ధనాన్ని వాడాలి
అనవసరపు కొనుగోళ్లకు
దూరంగా ఉండాలి

నేటి పొదుపే రేపటికి మదుపు
ఆర్థిక క్రమశిక్షణే వృద్ధికి
అభివృద్ధికి దిశ దశ కావాలి

కష్టపడి సంపాదించిన
ధనాన్ని దాచుకో
జాగ్రత్తగా వాడుకో
ఆర్థిక స్వతంత్రాన్ని
రక్షించుకో

అపరిమిత కోరికలకు పరిమిత
వనరులకు మధ్య సంతులితను
పాటించాలి సహజ వనరుల
అభివృద్ధితో ఆర్థిక వ్యవస్థలో
వెలుగులు నింపాలి

ప్రభుత్వం పౌరసమాజం
పరిమిత ప్రత్యామ్నాయ
ప్రయోజనాలున్న వనరులను
అభిలషణీయంగా
ఉపయోగించాలి

ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి
ఉత్పాదకత ఉపాధి
ఆదాయాలను సృష్టించాలి
మానవ వనరుల వికాసంతో
సంక్షోభాలను నివారించే శక్తి
సామర్థ్యాలు పెరుగాలి
సుస్థిర ఆర్థికాభివృద్ధితో
ఆర్థిక వ్యవస్థలో స్వావలంబన
స్వయం స్వమృద్ధి జరగాలి

**(పశ్చిమాసియా యుద్ధ సంక్షోభం ( ఇరాన్ అమెరికా ఉద్రిక్తతల )**



నేదునూరి కనకయ్య
9440245771



# జాతీయం-అంతర్జాతీయం



## వారు తీవ్రవాదులు కాదు - సుప్రీం

- నోయిడా నిరసనల సందర్భంగా అరెస్టైన కార్యకర్తలను మే 18న హాజరుపరచాలని యుపి ప్రభుత్వానికి ఆదేశం



**న్యూఢిల్లీ, మే 16 (వుదయం):**

నోయిడాలో ఇటీవల జరిగిన నిరసనల సందర్భంగా అరెస్టు అయిన ఇద్దరు కార్యకర్తలు, ఆదిత్య ఆనంద్, రూపేష్ రాయ్ ను మే 18న మధ్యాహ్నం 2 గంటలకు తమ ముందు హాజరుపరచాలని సుప్రీం కోర్టు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆదిత్య ఆనంద్ సోదరుడైన కేశవ్ ఆనంద్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ ఉత్తర్వును కోర్టు జారీ చేసింది. తన సోదరుడిని యూపీ పోలీసులు కస్టడీలో చిత్రహింసలకు గురిచేశారని కేశవ్ తన పిటిషన్‌లో ఆరోపించారు.

ఉగ్రవాదులుగా పరిగణించలేం: సుప్రీంకోర్టు

జస్టిస్ బి.వి. నాగారత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం యూపీ ప్రభుత్వానికి నోటీసు జారీ చేసింది. ఆ ఇద్దరు కార్మికులను కోర్టులో హాజరుపరచాలని ఆదేశించింది. ఆ ఇద్దరూ కేవలం అధిక వేతనాల కోసం నిరసన తెలుపుతున్నారని, వారిని ఉగ్రవాదులుగా పరిగణించాల్సిన అవసరం లేదని కోర్టు వ్యాఖ్యానించింది.

వారు ఉగ్రవాదులు కాదు, కేవలం కనీస వేతనాలు వంటి ప్రాథమిక హక్కులను డిమాండ్ చేస్తున్నారు అని ప్రభుత్వ న్యాయవాదితో న్యాయమూర్తి నాగారత్న అన్నారు. వామపక్ష భావజాలాన్ని అనుసరించినంత మాత్రాన ఎవరూ ఉగ్రవాదిగా మారిపోరు అని కూడా కోర్టు పేర్కొంది.

రాష్ట్ర ప్రభుత్వం వారిని పోలీసు కస్టడీకి తరలించాలని యోచిస్తోందన్న ఆందోళనను వారి న్యాయవాది వ్యక్తం చేసిన తర్వాత, ఇద్దరు నిందితులను జ్యుడీషియల్ కస్టడీలోనే ఉంచాలని కోర్టు ఆదేశించింది.

ఆదిత్య ఆనంద్ ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, రూపేష్ ఒక ఆటో డ్రైవర్ ఆదిత్య ఆనంద్ ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కాగా, రాయ్ ఒక ఆటో డ్రైవర్. వీరిద్దరూ ఇటీవల నోయిడాలో జరిగిన కార్మికుల నిరసనలో పాల్గొన్నారు. ఆదిత్య ఆనంద్‌ను తిరుచిరాపల్లి రైల్వే స్టేషన్ వద్ద అరెస్టు చేశారు. అతని ఆచూకీకి సంబంధించిన ఏ సమాచారాన్ని అందించినా రూ. 1 లక్ష నగదు బహుమతిని ఇస్తామని ఉత్తరప్రదేశ్ పోలీసులు ప్రకటించారు. తాను ఎన్ ఐటి జంషెడ్‌పూర్ నుండి బిటెక్ పట్టా పొందినట్లు అతను పేర్కొంటున్నాడు.

రూపేష్ రాయ్ ఒక ఆటోరిక్షా డ్రైవర్. ఏప్రిల్ 17న అతను అరెస్టు చేయబడ్డాడు. ఒక రోజు తర్వాత ఆనంద్ కూడా అరెస్టు అయ్యాడు. మూడవ వ్యక్తిగా, మనీషా చౌహాన్ అనే మహిళను కూడా యుపి పోలీసులు అరెస్టు చేశారు.

యుపి పోలీసుల ప్రకారం, గత నెలలో నోయిడాలో కార్మికులు నిర్వహించిన ధర్నా వెనుక సూత్రధారి ఆదిత్య ఆనంద్. నోయిడాలో జరిగిన కార్మికుల నిరసనల సమయంలో చోటుచేసుకున్న హింసాత్మక కార్యకలాపాలను ఆయనే నడిపించారని సమాచారం. ఈ నిరసనల సందర్భంలో జరిగిన రెచ్చగొట్టే చర్యలను ప్రణాళిక రచించి, అమలు చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారని పోలీసులు తెలిపారు.

కస్టడీలో హింసించారన్న ఆరోపణలను కూడా రాష్ట్ర ప్రభుత్వం ఖండించింది. అరెస్టుకు గల కారణాన్ని తెలియజేయడంతో సహా, అరెస్టుకు సంబంధించిన అన్ని నిబంధనలను వారు పాటించారని యూపీ ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. అయినప్పటికీ, మే 18న ఆ ఇద్దరినీ తమ ముందు హాజరుపరచాలని కోర్టు ఆదేశించింది.

## 9, 10 తరగతులకు మూడు భాషలను తప్పనిసరి చేసిన సీబీఎస్ఈ





**న్యూఢిల్లీ, మే 16 (వుదయం):**

విద్యా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ), 202627 విద్యా సంవత్సరం నుంచి 9 10వ తరగతుల భాషా విధానంలో కీలక మార్పులను ప్రకటించింది. మే 15, 2026న జారీ చేసిన ఒక సర్క్యులర్‌లో, ఈ సవరించిన విధానం జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి) 2020, పాఠశాల విద్య కోసం జాతీయ పాఠ్యప్రణాళిక చట్రం (ఎన్‌సిఎఫ్ఎస్ఇ) 2023లకు అనుగుణంగా రూపొందించినట్టు బోర్డు పేర్కొంది.

నోటిఫికేషన్ ప్రకారం, జూలై 1, 2026 నుండి 9, 10వ తరగతి విద్యార్థులకు ఆర్1, ఆర్2, ఆర్3 అనే మూడు భాషల అధ్యయనం తప్పనిసరి అవుతుంది. ఈ భాషలలో కనీసం రెండు భాషలు భారతీయ స్థానిక భాషలై ఉండాలని కూడా బోర్డు స్పష్టం చేసింది.

9, 10వ తరగతులకు భాషా విధానాన్ని సవరించిన సిబిఎస్ ఇ 202627 విద్యా సంవత్సరానికి సంబంధించి, 9, 10వ తరగతుల కోసం ఇటీవల విడుదలైన ఎన్‌సిఆర్‌టి సిలబస్‌ను సమీక్షించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు బోర్డు పేర్కొంది. ప్రస్తుత విద్యా సంవత్సరం ఇప్పటికే ఏప్రిల్ 2026లో ప్రారంభమైనప్పటికీ, దీని అమలు కోసం ఒక 'పరివర్తనాత్మక విధానాన్ని' అనుసరిస్తామని సిబిఎస్ ఇ తెలిపింది.

సవరించిన భాషా విధానం ప్రకారం, విదేశీ భాషను అభ్యసించాలనుకునే విద్యార్థులు, తాము ఎంచుకున్న ఇతర రెండు భాషలు భారతీయ స్థానిక భాషలైతేనే ఆ విదేశీ భాషను ఎంచుకోవడానికి వీలుంటుంది. విదేశీ భాషలను అదనపు నాలుగవ భాషగా కూడా అభ్యసించవచ్చు.

భాషా విద్యకు సంబంధించిన నవీకరించిన పాఠ్యప్రణాళిక లక్ష్యాలు, సామర్థ్యాలు, అభ్యాస ఫలితాలను క్షుణ్ణంగా సమీక్షించాలని సిబిఎస్ ఇ తన అనుబంధ పాఠశాలలన్నింటినీ ఆదేశించింది.

బోధనా వనరులపై మార్గదర్శకాలు

మధ్య దశ, మాధ్యమిక దశ విద్యల మధ్య పఠన అవగాహన, మౌఖిక సంభాషణ, వ్యాకరణం, రచన నైపుణ్యాల వంటి భాషా సామర్థ్యాలలో దాదాపు 75 నుండి 80 శాతం సారూప్యత ఉందని ఈ సర్క్యులర్ ప్రముఖంగా పేర్కొంది.

ఆర్3 కోసం ప్రత్యేక పాఠ్యపుస్తకాలు అందుబాటులోకి వచ్చేంత వరకు, 202627 విద్యా సంవత్సరానికి గాను 9వ తరగతి విద్యార్థులు తాము ఎంచుకున్న భాషకు సంబంధించిన 6వ తరగతి ఆర్3 పాఠ్యపుస్తకాలనే వినియోగిస్తారు. ఈ పాఠ్యపుస్తకాలకు అదనంగా, కవితలు, చిన్న కథలు, కల్పిత రచనలతో సహా స్థానిక లేదా రాష్ట్ర స్థాయి సాహిత్య సామగ్రిని కూడా జోడించి బోధించాలని పాఠశాలలను కోరడం జరిగింది.

ఈ అనుబంధ సామగ్రి ఎంపిక, బోధనాపరమైన వినియోగానికి సంబంధించిన వివరణాత్మక మార్గదర్శకాలను జూన్ 15, 2026 నాటికి జారీ చేస్తామని సిబిఎస్ ఇ తెలిపింది.

భాషా ఉపాధ్యాయుల కోసం తాత్కాలిక చర్యలకు అనుమతి

ఈ పరివర్తన కాలంలో స్థానిక భారతీయ భాషల కోసం అర్హతగల ఉపాధ్యాయులను ఏర్పాటు చేయడంలో కొన్ని పాఠశాలలు ఇబ్బందులు ఎదుర్కోవచ్చని బోర్డు అంగీకరించింది.

సహోదయ క్లస్టర్ల ద్వారా పాఠశాలల మధ్య వనరుల పంపిణీ, హైబ్రిడ్ బోధనా సహాయం, పదవీ విరమణ చేసిన భాషా ఉపాధ్యాయులను వినియోగించుకోవడం, తగిన అర్హతలు గల పోస్ట్ గ్రాడ్యుయేట్లను నియమించుకోవడం వంటి సౌకర్యవంతమైన ఏర్పాట్లను ఉపయోగించుకోవడానికి సీబీఎస్ఈ పాఠశాలలను అనుమతించింది. 9 షెడ్యూల్డ్ భాషలలోని 6వ తరగతి ఆర్3 పాఠ్యపుస్తకాలు జూలై 1, 2026లోపు పాఠశాలలకు అందుబాటులోకి తీసుకురానున్నట్టు కూడా బోర్డు తెలిపింది.

## తీరు మార్చుకోకుంటే పాక్ అస్తిత్వానికే ముప్పు

**న్యూఢిల్లీ, మే 16 (వుదయం):**



పాకిస్తాన్ భౌగోళిక, చారిత్రక భాగస్వామిగా ఉండాలనుకుంటోందా లేదా అనేది నిర్ణయించుకోవాలంటూ, భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది శనివారం నాడు పాకిస్తాన్‌కు ఒక గట్టి సందేశాన్ని పంపారు. న్యూఢిల్లీలోని మాణెక్‌షా సెంటర్‌లో జరిగిన ఒక ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతూ, గత ఏడాది 'ఆపరేషన్ సిందూర్'కు దారితీసిన పరిస్థితులే మళ్లీ తలెత్తితే భారత సైన్యం ఎలా స్పందిస్తుందని అడిగిన ప్రశ్నకు జనరల్ ద్వివేదిని స్పందించారు.

నేను ఇంతకుముందు చెప్పినది మీరు విని ఉంటే, పాకిస్తాన్ ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తూ, భారతదేశానికి వ్యతిరేకంగా కార్యకలాపాలు కొనసాగిస్తే, వారి అస్తిత్వమే ప్రమాదంలో పడుతుంది, అని ఆర్మీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ బదులిచ్చారు.పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌పై భారత్ చేపట్టిన వైమానిక దాడులైన 'ఆపరేషన్ సింధూర్' మొదటి వార్షికోత్సవాన్ని జరుపుకున్న వారం రోజుల తర్వాత జనరల్ ద్వివేది ఈ వ్యాఖ్యలు చేశారు.సమయంలో పాకిస్థాన్‌లో ఉగ్రవాద స్థావరాల ఉనికి గురించి ప్రపంచానికి ఆధారాలు అందించామని పేర్కొన్నారు. పొరుగుదేశం తన తీరును మార్చుకోకుంటే ఆ ఆపరేషన్‌కు సంబంధించిన రెండో వెర్షన్ తీవ్రస్థాయిలో ఉంటుందని హెచ్చరించారు. భారత ప్రభుత్వం ఎప్పుడూ దేశ ప్రజల పురోగతి, శ్రేయస్సుపైనే దృష్టిపెడుతుందని.. తన మార్గంలో ఎవరైనా అడ్డంకులు సృష్టిస్తే, దీటుగా స్పందిస్తుందని అన్నారు.

ఏడాదికి పైగా నిలిచిపోయిన భారతదేశంతో చర్చలను తిరిగి ప్రారంభించగలమనే ఆశాభావాన్ని ఇటీవల వ్యక్తం చేసిన పాకిస్తాన్‌కు, ఈ వ్యాఖ్యలు ఒక సూటి సందేశంగా నిలిచాయి.

పాకిస్థాన్ చర్చలకు సుముఖం

భారతదేశం, పాకిస్థాన్‌ల మధ్య చర్చలకు ద్వారం ఎప్పుడూ తెరిచే ఉండాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ ఎస్ ఎస్) నాయకుడు దత్తాత్రేయ హోసబాలే చేసిన వ్యాఖ్యకు, భారత మాజీ సైన్యాధిపతి జనరల్ ఎం.ఎం. నరవణే మద్దతు తెలపడాన్ని పాకిస్థాన్ గురువారం స్వాగతించింది.

ఒక పత్రికా సమావేశంలో, పాకిస్తాన్ విదేశాంగ కార్యాలయ ప్రతినిధి తాహిర్ అంద్రాబి మాట్లాడుతూ, భారతదేశంలో చర్చల కోసం వస్తున్న పిలుపులను తాను ఒక సానుకూల పరిణామంగా చూస్తున్నానని, అయితే ఆ వ్యాఖ్యలపై ఏదైనా అధికారిక స్పందన వస్తుందో లేదో చూడాల్సి ఉందని అన్నారు.

**ఆపరేషన్ సింధూర్**

ఏప్రిల్ 22న జరిగిన ఘోరమైన పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా, గత సంవత్సరం మే 7వ తేదీ తెల్లవారుజామున ఆపరేషన్ సింధూర్‌ను ప్రారంభించారు. భారత బలగాలు పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ (పిఓకె)లోని పలు ఉగ్రవాద లాంచ్‌ప్యాడ్‌లు, ఇతర సంబంధిత మౌలిక సదుపాయాలపై కచ్చితమైన దాడులు నిర్వహించాయి.

పాకిస్తాన్ కూడా భారతదేశంపై దాడులను ప్రారంభించింది. ఇవి దాదాపు నాలుగు రోజుల పాటు కొనసాగాయి. ఆ తర్వాత న్యూఢిల్లీ చేపట్టిన ప్రతి దాడులన్నీ కూడా 'ఆపరేషన్ సింధూర్' పరిధిలోనే నిర్వహించారు.

అణు ఆయుధాలు కలిగిన ఈ రెండు పొరుగు దేశాల మధ్య దాదాపు 88 గంటల పాటు సాగిన ఈ సైనిక ఘర్షణ, మే 10 సాయంత్రం ఇరుపక్షాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత నిలిచిపోయింది. పాకిస్తాన్ సైనిక కార్యకలాపాల డైరెక్టర్ జనరల్ (డిజిఎంఒ) తన భారతీయ డిజిఎంఒపే సంప్రదించి, కాల్పుల విరమణను కోరడంతో ఈ ఒప్పందం కుదిరిందని భారత సైన్యం వెల్లడించింది.

## విజయ్ వద్ద కీలక శాఖలు

- మంత్రులకు శాఖలు కేటాయింపు
- ఎన్.ఆనంద్‌కు గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ కేటాయింపు
- అదవ అర్జునకు పబ్లిక్ వర్క్స్, క్రీడల అభివృద్ధి శాఖలు



**వుదయం డెస్క్, మే 16:**

తమిళనాడు ముఖ్యమంత్రికి, ఇతర మంత్రులకు శాఖలను కేటాయిస్తూ లోక్ భవన్ శనివారం ప్రకటన విడుదల చేసింది. విజయ్ ముఖ్యమంత్రిగా ఈ నెల 10వ తేదీన ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఆయనతో పాటు మరో తొమ్మిది మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. విజయ్ సిఫార్సు మేరకు మంత్రులకు లోక్ భవన్ శాఖలను కేటాయించింది.

ముఖ్యమంత్రి విజయ్ తన వద్ద హోం, పోలీస్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, మహిళా సంక్షేమం, యువజన సంక్షేమం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ వాటర్ సప్లై శాఖలను వుంచుకున్నారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, పేదరిక నిర్మూలన, నీటిపారుదల ప్రాజెక్టుల శాఖలను ఎన్.ఆనంద్‌కు, పబ్లిక్ వర్క్స్, హైవేస్, మైనర్ పోర్ట్స్, క్రీడల అభివృద్ధి శాఖలను ఆదవ్ అర్జునకు, ఆరోగ్యం, మెడికల్ ఎడ్యుకేషన్, ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖలను డాక్టర్ కె.జి.అరుణ్ రాజ్‌కు, ఫైనాన్స్, పెన్షన్స్ శాఖల బాధ్యతలను కె.ఎ. సెంగొట్టయ్యన్‌కు అప్పగించారు.

ఫుడ్ అండ్ సివిల్ సప్లైస్, కన్స్యూమర్ ప్రొటెక్షన్, ప్రైస్ కంట్రోల్ శాఖలను పి.వెంకటరమణన్‌కు కేటాయించారు. విద్యుత్, న్యాయ, జైళ్లు, అవినీతి నిరోధక శాఖలను ఆర్.నిర్మల్ కుమార్‌కు, స్కూల్ ఎడ్యుకేషన్, తమిళ అభివృద్ధి, సమాచార ప్రచార శాఖ, కల్చర్, ఫిల్మ్ టెక్నాలజీ శాఖలను రాజ్ మోహన్‌కు,మైన్స్ అండ్ మినరల్స్ శాఖను డాక్టర్ టి.కె.ప్రభుకు, ఇండస్ట్రీస్, ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ శాఖల బాధ్యతలను ఎస్.కీర్తనకు అప్పగించారు.

## సైకిల్‌పై కార్యాలయానికి కేంద్ర మంత్రి టోకన్ సాహు

- ఇంధనాన్ని పొదుపుగా వాడాలని పౌరులకు పిలుపు
- మనం ఆదా చేసే ప్రతి చుక్క ఇంధనంతో భారత భవితకు, గౌరవానికి భద్రత

**వుదయం డెస్క్, మే 16:**



ఇంధన పొదుపు కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపునకు మద్దతుగా కేంద్ర గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ సహాయమంత్రి టోకన్ సాహు ఈ రోజు తన నివాసం నుంచి సంకల్ప్ భవన్ వరకు 3 కిలోమీటర్లు సైకిల్‌పై ప్రయాణించారు. తద్వారా సుస్థిర పట్టణ రవాణా, పర్యావరణ బాధ్యత, దేశ సేవ గురించి పౌరులకు బలమైన సందేశాన్ని అందించారు.

ఈ సందర్భంగామాట్లాడుతూ... వర్క్ ఫ్రమ్ హోమ్, ఆన్‌లైన్ తరగతులు, వీడియో అనుసంధానం ద్వారా సమావేశాలు, పెట్రోల్‌డీజిల్ వినియోగాన్ని తగ్గించడం వంటి కోవిడ్‌కాలపు పద్ధతులను పునరుద్ధరించాలని ప్రధానమంత్రి చేసిన విజ్ఞప్తిని సాహు గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రపంచంలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల్లో అది అత్యంత సముచితం, సందర్భోచితమని ఆయన పేర్కొన్నారు. ఇటువంటి చర్యలు దేశ ప్రయోజనాలకు ఎంతగానో దోహదపడతాయన్నారు. దీనిని దేశ సేవగా భావిస్తూ, ఈ సామూహిక కృషిలో పాలు పంచుకోవడం బాధ్యత గల ప్రతీ పౌరుడి విధి అని టోకన్ సాహు ఉద్ఘాటించారు.

ఇంధన పొదుపు కేవలం ఆర్థిక అవసరం మాత్రమే కాదనీ... పర్యావరణం పట్ల మన బాధ్యత, క్లిష్ట సమయాల్లో దేశాన్ని బలోపేతం చేయగల సామూహిక జాతీయ కర్తవ్యమని సాహు స్పష్టం చేశారు. "మనం ఆదా చేసే ప్రతి లీటరు ఇంధనం దేశ విస్తృత ప్రయోజనాలకు దోహదపడుతుందన్నారు. దేశం సమష్టిగా సుస్థిరత, స్వయంసమృద్ధి దిశగా ముందుకుసాగుతున్న తరుణంలో చిన్నవైనప్పటికీ... అవగాహనతో కూడిన జీవనశైలి మార్పుల ద్వారా పౌరులు అర్థవంతమైన సహకారం అందించగలరు" అని ఆయన అన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోడీని ఆదర్శంగా తీసుకుని కేంద్ర మంత్రులు, సీనియర్ నాయకులు ఇప్పటికే తమ కాన్వాయ్‌లను 50 శాతం తగ్గించడం ప్రారంభించారని సాహు పేర్కొన్నారు. వ్యక్తిగత ఆచరణ ద్వారా నాయకత్వం ఒక శక్తిమంతమైన సందేశాన్ని పంపుతుందనీ... అది విస్తృత ప్రజా భాగస్వామ్యానికి స్ఫూర్తినిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.

ప్రజా భాగస్వామ్యం, దేశభక్తి గురించిన విస్తృత సందేశాన్ని అందిస్తూ... "పొదుపు దిశగా వేసే ప్రతి అడుగు దేశ సేవ దిశగా ఒక ముందడుగు అవుతుంది. మనం ఆదా చేసే ప్రతి చుక్క ఇంధనం భారత భవితను, గౌరవాన్ని పరిరక్షిస్తుంది" అని సాహు పేర్కొన్నారు.

ఈ ఉద్యమంలో చురుగ్గా పాలుపంచుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ... ప్రజా రవాణా, ఎలక్ట్రిక్ బస్సులు వాడడం, సైకిల్ తొక్కడం, సాధ్యమైన చోట్ల కార్‌పూలింగ్‌ను ఉపయోగించుకోవడం ద్వారా పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించాలని సాహు పౌరులకు విజ్ఞప్తి చేశారు.

## లాక్‌డౌన్‌పై కిరణ్ రిజిజు క్లారిటీ

**వుదయం డెస్క్, మే 16:**



పశ్చిమాసియా యుద్ధం కారణంగా ప్రపంచ దేశాల్లో ఆర్థిక సంక్షోభం నెలకొంది. దాదాపు అన్ని దేశాలు కఠిన పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. ప్రస్తుతం భారత్ కూడా కఠిన ఆంక్షలు అమలు చేస్తోంది. పౌరులంతా పొదుపు పాటించాలని ప్రధాని మోడీ పిలుపునిచ్చారు.తాజాగా ఇదే అంశంపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు కీలక వ్యాఖ్యలు చేశారు. అలాగే లాక్‌డౌన్‌పై కూడా స్పందించారు. లాక్‌డౌన్ లేదు.. కానీ భారత్ మాత్రం సిద్ధంగా ఉండాలన్నారు. ప్రస్తుతం దేశంలో ఎలాంటి అత్యవసర పరిస్థితి లేదని.. లాక్‌డౌన్ వంటి పరిస్థితులు రావని స్పష్టం చేశారు. అయితే ప్రపంచ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని భారత్ ముందస్తుగా సిద్ధంగా ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

## రూ. 182 కోట్ల విలువైన మాదక ద్రవ్యాల పట్టివేత

**వుదయం డెస్క్, మే 16:**

'ఆపరేషన్ రేజ్ పిల్‌లో భాగంగా, జిహాదీ డ్రగ్‌గా ప్రసిద్ధి చెందిన కాప్టగాన్‌ను నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సిబి) తొలిసారి స్వాధీనం చేసుకుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా శనివారం తెలిపారు. దీని విలువ రూ. 182 కోట్లు. ఈ చర్యను ఒక పెద్ద విజయంగా అభివర్ణిస్తూ, మధ్యప్రాచ్యానికి తరలిస్తున్నట్లు ఆరోపించిన సరుకును స్వాధీనం చేసుకోవడం, అలాగే ఒక విదేశీయుడిని అరెస్టు చేయడం వంటివి మాదకద్రవ్యాలపై ప్రభుత్వ జీరోటాలరెన్స్ విధానాన్ని ప్రతిబింబిస్తున్నాయని షా అన్నారు.

భారతదేశంలోకి ప్రవేశించే లేదా భారతదేశం గుండా ప్రయాణించే ప్రతి గ్రాము మాదకద్రవ్యంపై అధికారులు కఠినంగా వ్యవహరిస్తారని షా ఎక్స్‌పై చేసిన ఒక పోస్టులో నొక్కిచెప్పారు. ఈ ఆపరేషన్‌ను నిర్వహించిన ఎన్‌సిబి అధికారులను ప్రశంసించారు.

**.అధికారులు క్యాప్టగాన్‌ను ఎలా గుర్తించారు?**

క్యాప్టగాన్ అక్రమ రవాణాకు భారతదేశాన్ని ఒక రవాణా మార్గంగా ఉపయోగిస్తున్నారని ఒక విదేశీ మాదకద్రవ్యాల నియంత్రణ సంస్థ అందించిన నిఘా సమాచారం ఆధారంగా, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో న్యూఢిల్లీలోని నెబ్ సరాయ్‌లో ఉన్న ఒక అద్దె ఇంటిని గుర్తించింది. మే 11, 2026న నిర్వహించిన సోదాతో, సౌదీ అరేబియాలోని జెడ్డాకు ఎగుమతి చేయడానికి ఉద్దేశించినట్లు ఆరోపితమైన, ఒక వాణిజ్య చపాతీ కోసే యంత్రంలో దాచి ఉంచిన సుమారు 31.5 కిలోల క్యాప్టగాన్ మాత్రలను స్వాధీనం చేసుకున్నారు.

నిందితుడిని మరింతగా విచారించగా, గుజరాత్‌లోని ముంద్రాలో ఉన్న కంటైనర్ ఫెసిలిటేషన్ స్టేషన్ (సిఎఫ్ఎస్) వద్ద నిలిపి ఉంచిన ఒక కంటైనర్ వద్దకు దర్యాప్తు అధికారులు చేరుకున్నారు. అక్కడ మే 14, 2026న అధికారులు దాదాపు 196.2 కిలోల క్యాప్టగాన్ పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నారు. సిరియా నుండి దిగుమతి చేసుకుని, గొర్రెల ఉన్నిని తీసుకువెళ్తున్నట్లుగా ప్రకటించిన ఆ కంటైనర్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేయగా, మాదక ద్రవ్యం ఉన్న మూడు సంచులను కనుగొన్నారు.

క్యాప్టగాన్ దుర్వినియోగం ఒక ప్రధాన శాంతిభద్రతల, ప్రజారోగ్య సవాలుగా మారిన గల్ఫ్ దేశాలకు, ముఖ్యంగా సౌదీ అరేబియా, పొరుగున ఉన్న మధ్య ప్రాచ్య దేశాలకు ఈ సరుకును తరలించడానికి ఉద్దేశించినట్లు దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు.

భారతదేశపు తొలి క్యాప్టగాన్ స్వాధీనం ఈ ఆపరేషన్ భారతదేశపు మొట్టమొదటి క్యాప్టగాన్ స్వాధీనమని, మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు దేశాన్ని ఒక రవాణా కేంద్రంగా ఉపయోగించుకోవడానికి అంతర్జాతీయ మాదకద్రవ్య సిండికేట్లు చేస్తున్న ప్రయత్నాలను ఇది ఎత్తిచూపుతోందని అధికారులు తెలిపారు. బహుళ అధికార పరిధులలో



పనిచేస్తున్న అంతర్జాతీయ మాదకద్రవ్య ముఠాలను నిర్మూలించడంలో ప్రపంచవ్యాప్త నిఘా సమాచార మార్పిడి, సమన్వయంతో కూడిన చట్ట అమలు ప్రయత్నాల ప్రాముఖ్యతను కూడా ఈ కేసు నొక్కి చెబుతోంది.

ఇది, మాదకద్రవ్యాల అక్రమ రవాణా కోసం అంతర్జాతీయ మాదకద్రవ్య సిండికేట్లు వాణిజ్య సరుకు రవాణా, కంటైనర్ వ్యాపార మార్గాలను దుర్వినియోగం చేస్తున్న ధోరణి పెరుగుతోందనడానికి నిదర్శనంగా నిలుస్తోంది.

**కాప్టగాన్ అంటే ఏమిటి?**

కాప్టగాన్ అనేది వాస్తవానికి ఫెనెథిలైన్ అనే పదార్థానికి ఉన్న బ్రాండ్ పేరు. ఇది 1960లలో ఎడిహెచ్‌డి, నార్కోలెప్సీ వంటి రుగ్మతలకు చికిత్స అందించేందుకు అభివృద్ధి చేసిన ఒక కృత్రిమ ఉత్ప్రేరకం (సింథెటిక్ స్టిమ్యులెంట్). దీనికి బానిసయ్యే ప్రమాదం అధికంగా ఉండటం, దుర్వినియోగమయ్యే అవకాశం ఉండటం వల్ల, 1980ల నాటికి ఈ ఔషధం అంతర్జాతీయంగా నిషేధించబడింది.

నేడు, నల్లబజారులో అక్రమంగా విక్రయించబడుతున్న కాప్టగాన్ మాత్రలలో, రహస్య ప్రయోగశాలల్లో తయారు చేసిన, ఆంఫెటమైన్, మెథామెఫటమైన్, కెఫైన్ ఇతర కృత్రిమ ఉత్ప్రేరకాల మిశ్రమాలు ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి.పశ్చిమ ఆసియాలోని కొన్ని ప్రాంతాలలో, పెరిగిన చురుకుదనం, ఎక్కువసేపు మేల్కొని ఉండటం, అలసట తగ్గడం, దూకుడు స్వభావం పెరగడం వంటి ఉత్తేజపరిచే, ఉల్లాసకరమైన ప్రభావాల కోసం ఈ మందును విరివిగా దుర్వినియోగం చేస్తారు. దీనిని పదేపదే వాడటం వలన విచక్షణ కోల్పోవడం, ఆవేశపూరిత ప్రవర్తన, మానసిక ఆధారపడటం వంటివి కూడా ఏర్పడవచ్చు. దీనిని తరచుగా పేదవాడి కొకైన్ అని పిలుస్తారు.

**దీనిని జిహాదీ డ్రగ్ అని ఎందుకు పిలుస్తారు?**

పశ్చిమ ఆసియాలోని సంఘర్షణ పీడిత ప్రాంతాలలో పనిచేస్తున్న తీవ్రవాద నెట్‌వర్క్‌లకు, దీని అక్రమ రవాణాకు మధ్య సంబంధాలు ఉన్నాయనే ఆరోపణల కారణంగా, అంతర్జాతీయ భద్రతా చర్చలలో క్యాప్టగాన్‌ను తరచుగా జిహాదీ డ్రగ్ అని పిలుస్తుంటారు.

సంవత్సరాల పాటు జరిగిన దర్యాప్తులలో, ఇరాక్ , సిరియా ఇస్లామిక్ స్టేట్‌తో సహా పలు మిలిటెంట్ గ్రూపులు, తమ యోధులను ఎక్కువసేపు మేల్కొని ఉంచడానికి, భయం, అలసటను అణచివేయడానికి, తీవ్రమైన పోరాట కార్యకలాపాలను కొనసాగించడానికి ఈ ఉత్ప్రేరకాన్ని ఉపయోగించాయని ఆరోపణలు వెల్లడయ్యాయి.

పశ్చిమ ఆసియాలో అత్యంత వేగంగా విస్తరిస్తున్న కృత్రిమ మాదకద్రవ్యాల ముప్పులలో ఒకటిగా క్యాప్టగాన్ వ్యాపారాన్ని అంతర్జాతీయ సంస్థలు గుర్తించాయి. ఇందులో రహస్య తయారీ కేంద్రాలు, హవాలా ఫైనాన్సింగ్, నకిలీ వ్యాపార పత్రాలు, అధునాతన అక్రమ రవాణా మార్గాలు ఇమిడి ఉన్నాయి. చారిత్రాత్మకంగా సిరియాను అక్రమ క్యాప్టగాన్ ఉత్పత్తికి ఒక ప్రధాన కేంద్రంగా పరిగణిస్తున్నారు.

అధికార వర్గాల సమాచారం ప్రకారం, క్యాప్టగాన్ అక్రమ రవాణా ద్వారా ఆర్జించిన భారీ లాభాలను, తీవ్రవాద సంబంధిత నెట్‌వర్క్‌లకు నిధులు సమకూర్చడానికి కూడా వినియోగించినట్లు తెలుస్తోంది.



# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ ఉమ్మడి జిల్లాల వార్తలు

## నగర అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకం



- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- కలెక్టర్ చాహత్ బాజ్‌పాయితో కలిసి పలు అభివృద్ధి పనుల క్షేత్రస్థాయి పరిశీలన
- 10 రోజుల్లో నాలాల పూడికతీత పనులు పూర్తి కావాలి

**హనుమకొండ, మే 16 (వుదయం జిల్లా ప్రతినిధి) :** నియోజకవర్గ సమగ్ర అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయితో కలిసి ఆయన నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆర్.ఈ.సి ప్రధాన రహదారి వెంట నిర్మించనున్న కల్వర్ట్, సైడ్ డ్రైనేజీ పనులు, రాజాజీనగర్ నాలా బ్రిడ్జి పూడికతీత పనులతో పాటు అశోక్ జంక్షన్ నుంచి బుద్ధభవన్ మీదుగా కాకతీయ యూనివర్సిటీ వరకు రోడ్డు పరిస్థితులను అధికారులతో కలిసి వారు సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ యుద్ధప్రాతిపదికన పనులు, వర్షాకాలం ముంచుకొస్తున్న నేపథ్యంలో ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాం. రాబోయే 10 రోజుల్లో నాలాల పూడికతీత పనులను పూర్తి చేసి వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించాం.రవాణా వ్యవస్థ మెరుగుదల: అశోక్ జంక్షన్ నుంచి కేయూ రోడ్డు వరకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ బస్సుల రాకపోకల కోసం బస్ స్టాండ్ నుంచి కాంగ్రెస్ భవన్ రోడ్డు మీదుగా కేయూ రోడ్డుకు అనుసంధానం చేసే ప్రతిపాదనలను పరిశీలిస్తున్నాం.రూ.24 కోట్లతో అభివృద్ధి పనులు: అంబేద్కర్ జంక్షన్ నుంచి వడ్డేపల్లి చర్చి వరకు రోడ్డు విస్తరణ, సైడ్ డ్రైనేజీ నిర్మాణం, జంక్షన్ల సుందరీకరణ కోసం రూ.24 కోట్ల నిధులు కేటాయించాం. అతి త్వరలోనే ఈ పనులకు శంకుస్థాపన చేస్తాం. రోడ్డు విస్తరణలో నష్టపోయే వారికి న్యాయం చేస్తాం.శాశ్వత పరిష్కారాలే లక్ష్యం: గత పాలకుల నిర్లక్ష్యం వల్లే నగరంలో వరదలు, ట్రాఫిక్ సమస్యలు వచ్చాయి. భవిష్యత్తులో ఇలాంటివి రాకుండా మాస్టర్ ప్లాన్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రణాళికల ప్రకారం శాశ్వత పరిష్కారాల దిశగా పనులు చేపడుతున్నాం.ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఈఈ సురేష్ బాబు, జీడబ్ల్యూఎంసీ ఈఈ రవికుమార్, డీఈలు సారంగపాణి, గోపి, సీఎంహెచ్వో డాక్టర్ రాజారెడ్డి, ఎమ్ హెచ్ ఓ రాజేష్, ఇతర శాఖల అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి 24x7' టోల్ ఫ్రీ ఏర్పాటు

- వరి సేకరణ, తాగునీరు,
- గ్యాస్, ఇంధన సరఫరా ఫిర్యాదుల తక్షణ పరిష్కారం
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వెల్లడి

**జనగామ, మే 16 (వుదయం ప్రతినిధి) :** జనగామ జిల్లా ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో 24 గంటలూ పనిచేసే (24×7) సరికొత్త టోల్ ఫ్రీ సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శనివారం రోజున ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు తమ సమస్యలపై నేరుగా ఈ కేంద్రానికి ఫిర్యాదు చేయవచ్చని ఆయన పేర్కొన్నారు. తక్షణ పరిష్కార చర్యలు కొరకు ఈ హెల్ప్‌లైన్ సహాయ కేంద్రం ద్వారా ముఖ్యంగా జిల్లాలో వరి సేకరణ, తాగునీటి సరఫరా, గ్యాస్ సరఫరా, ఇంధన (పెట్రోల్/డీజిల్) సరఫరాతో పాటు ఇతర అత్యవసర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరిస్తారని కలెక్టర్ తెలిపారు. అందిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, నివారణ చర్యలు చేపట్టేలా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు ఆయన వివరించారు. గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం చేయాలి.. ఈ ఉచిత సహాయ కేంద్రం వివరాలు జిల్లాలోని ప్రతి పౌరుడికి




తెలిసేలా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని జీపీఓలు, పంచాయితీ కార్యదర్శులు, ఫీల్డ్ సిబ్బంది గ్రామగ్రామాన విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. వీటితో పాటు గ్రామ పెద్దలు, స్వయం సహాయక సంఘాలు (SHGలు), రైతు సంఘాలు, యువజన సంఘాలు తమ వాట్సాప్ గ్రూపుల ద్వారా ఈ హెల్ప్‌లైన్ నంబర్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు.

**టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ నంబర్: 1800-425-6605**

(ఉచిత కాల్ - 24×7 సేవలు అందుబాటులో ఉంటాయి) ఈ ప్రత్యేక హెల్ప్‌లైన్ సేవలు కేవలం జనగామ జిల్లా ప్రజల ఫిర్యాదుల కొరకు మాత్రమే కేటాయించబడినవి. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

## ఎస్సీ, బీసీ విద్యార్థులకు కొత్త హాస్టళ్లు నిర్మించాలి

- మంత్రికి వినతిపత్రం అందజేసిన ఎస్ఎఫ్ఐ
- మెస్, కాస్మోటిక్ చార్జీలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్

**ములుగు, మే 16 (వుదయం ప్రతినిధి) :** గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని, అలాగే ములుగు జిల్లా కేంద్రంలో ఎస్సీ (SC) కళాశాల వసతి గృహం, ఏటూరునాగారం మండల కేంద్రంలో ఎస్సీ, బీసీ (BC) కళాశాల వసతి గృహాలను ఏర్పాటు చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ (SFI) నాయకత్వం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రికి వినతిపత్రం అందజేసింది.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామెర కిరణ్ మాట్లాడుతూ.. ములుగు జిల్లా కేంద్రంతో పాటు ఏటూరునాగారం ప్రాంతాలలో ఉన్నత విద్య అభ్యసిస్తున్న ఎస్సీ, బీసీ విద్యార్థులు సరైన వసతి సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థులు ప్రైవేట్ గదుల్లో అధిక అద్దెలు చెల్లించలేక చదువుకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రభుత్వ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక హాస్టళ్లను ఏర్పాటు చేసి, ఉచిత భోజనం, వసతితో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ఎల్. రవి, నాయకుడు జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.



## శిశు మరణాలపై సమీక్ష

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా , మే 16 (వుదయం ప్రతినిధి) :** )జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.తుకారాం రాథోడ్ ఆదేశాల మేరకు జిల్లా చైల్డ్ హెల్త్ అండ్ ఇమ్యూనిజేషన్ అధికారి డా ప్రతాప్ ఆధ్వర్యంలో జిల్లా డి యం ఎచ్ ఓ కార్యాలయంలో ఏప్రిల్ నెలకు సంబంధించిన చిన్నారుల మరణాలపై రివ్యూ కార్యక్రమం నిర్వహించారు.ఈ సమావేశంలో చిన్నారుల మరణాలకు సంబంధించిన వివరాలను సమగ్రంగా పరిశీలించి, మరణాలకు గల కారణాలపై విచారణ చేపట్టారు. భవిష్యత్తులో ఇలాంటి మరణాలను నివారించేందుకు అవసరమైన చర్యలపై వైద్య అధికారులకు సూచనలు తెలియజేశారు.అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మాట్లాడుతూ మాత్న, శిశు మరణాలను నివారించేందుకు ఆరోగ్య సిబ్బంది అందరూ సమిష్టిగా పనిచేయాలని సూచించారు. గర్భిణీలు, బాలింతలకు ప్రసవం అనంతరం పిల్లలు రెండు సంవత్సరాలు వయస్సు వచ్చే వరకు నిరంతర ఆరోగ్య విద్య, పోషకాహార సూచనలు వైద్య సేవలపై అవగాహన కల్పించాలని వివరించారు.ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు, సిహెచ్ఓ నాగభూషణం , ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుకు సర్కారు బడులే బాట

**యాదాద్రి భువనగిరి మే 16(వుదయం)** విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకుంటూ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని టీచర్ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాలలో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్య విజయోత్సవం 202526 విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది.

ఈ ఈ కార్యక్రమానికి టీచర్ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ... ముందుగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు పదవ తరగతి అనేది జీవితంలో ఎదిగేందుకు మొదటి మెట్టు అయినందున ఇంతటితో విద్యార్థులు తమ కష్టాన్ని ఆపకుండా ఇంకా కష్టపడి జీవితంలో చదివితే భవిష్యత్తులో ఒక గౌరవప్రదం పొందే అవకాశం విద్యార్థులకు కలుగుతుందన్నారు

## ఇందిరా మహిళా డెయిరీ విజయవంతం కావాలి

- కలెక్టర్ దివాకర టి.ఎస్.
- నిధులు వృథా కాకుండా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలి
- గ్రామ, మండల స్థాయిలో మౌళిక సదుపాయాల అభివృద్ధి పనులు సమాంతరంగా చేపట్టాలి
- ఉపాధి హామీ ద్వారా మౌళిక సదుపాయాల పనులకు వెంటనే పరిపాలనా అనుమతులు పొందాలి
- ఇందిరా మహిళా డెయిరీపై సమీక్షించిన జిల్లా కలెక్టర్ఖ

**ఖమ్మం, వుదయం బ్యూరో మే 16:** ఇందిరా మహిళా డెయిరీ కార్యక్రమం అమలుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి, పక్కాగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శనివారం కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి ఇందిరా మహిళా డెయిరీ కార్యక్రమంపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ప్రతి శాఖకు కేటాయించిన లబ్ధిదారుల లక్ష్యాలకు అనుగుణంగా బడ్జెట్ విడుదల అనంతరం అందుబాటులో ఉన్న నిధుల ప్రకారం ప్రాధాన్యత క్రమంలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, పశువుల యూనిట్ల గ్రౌండింగ్‌కు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు.ఇందిరా మహిళా డెయిరీ కార్యక్రమానికి సంబంధించి బడ్జెట్ త్వరగా విడుదలయ్యేలా ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి, మైనారిటీ శాఖల ఉన్నతాధికారులతో జిల్లా కలెక్టర్ ఫోన్ ద్వారా మాట్లాడి చర్యలు తీసుకోవాలని కోరారు. విడుదలైన నిధులు సక్రమంగా వినియోగం అయ్యేలా అధికారులు నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని, యూనిట్లు



నిర్దేశిత కాల వ్యవధిలో గ్రౌండింగ్ అయ్యేలా చూడాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నిధులు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఇందిరా మహిళా డెయిరీ కార్యక్రమానికి అవసరమైన గ్రామ స్థాయి, మండల స్థాయి మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను సమాంతరంగా చేపట్టాలని, దీనిపై సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టాల్సిన మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు అవసరమైన పరిపాలనా అనుమతులు వెంటనే పొందాలని సూచించారు.కొంతమంది లబ్ధిదారులకు అవసరమైన పశువుల షెడ్ల నిర్మాణాలను ఉపాధి హామీ క్రింద పరిగణనలోకి తీసుకుని, వాటిని నిర్ణీత సమయంలో పూర్తి చేసే విధంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పశువుల షెడ్ల నిర్మాణానికి ప్రారంభంగా వినియోగిస్తున్న డీఎంఎఫ్‌టీఈ నిధులను, ఉపాధి హామీ నిధులు మంజూరైన తర్వాత తిరిగి జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లాలో సభ్యులకు మంజూరైన పశువుల షెడ్ల నిర్మాణాలకు సంబంధించి, ఆసక్తి చూపిస్తూ ముందుండి పనులు చేపట్టే లబ్ధిదారులను ఎంపీడీవోలు గుర్తించాలని ఆదేశించారు. ఫీల్డ్ స్థాయిలో ఇప్పటికే పనులు ప్రారంభమైన లబ్ధిదారుల కోసం అవసరమైన అంచనాలను వెంటనే సిద్ధం చేయాలని సూచించారు. ప్రగతిశీల లబ్ధిదారులకు పనులు ప్రారంభించేందుకు అడ్వాన్స్ మొత్తాన్ని అందించి, అనంతరం ఉపాధి హామీ నిధులు వచ్చిన తర్వాత ఆ మొత్తాన్ని తిరిగి జమ చేసే విధానాన్ని పారదర్శకంగా, ఖచ్చితంగా పర్యవేక్షించాలని అధికారులకు తెలిపారు. పశువుల షెడ్ల నిర్మాణం పటిష్టంగా, నాణ్యతతో ఉండేలా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్హులైన లబ్ధిదారులకు సోలార్ వ్యవస్థ ఏర్పాటును కూడా చేపట్టాలని ఆదేశించారు. రెడ్కో అధికారులతో సమన్వయం చేసుకుని అర్హతలను పరిశీలించాలని సూచించారు. సోలార్ వ్యవస్థ ఏర్పాటుకు సాధ్యమైన ప్రాంతాలను సాంకేతికంగా పరిశీలించి, అనుకూల ప్రాంతాల్లోనే పనులు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇందిరా మహిళా డెయిరీ వచ్చే రెండు సంవత్సరాల్లో పూర్తిస్థాయి స్వయం సమృద్ధి సాధించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రతి బీఎంసీ వద్ద బ్రేక్ ఈవెన్ సాధించేందుకు రోజుకు ఎంత లీటర్ల పాలు సేకరించాల్సి ఉంటుందో అంచనా వేసి, ఆ లక్ష్యాన్ని చేరుకునేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. డెయిరీ స్థిరత్వం కోసం ఎంత మేర పాలు సేకరించాలి, సేకరించిన పాలను ఎక్కడ విక్రయించాలి అనే అంశాలపై పూర్తి స్థాయి కార్యాచరణ ప్రణాళికను వచ్చే మంగళవారం లోగా సమర్పించాలని ఆదేశించారు.గరిష్టంగా 10 రోజుల ఆపరేషనల్ వ్యయాన్ని పరిగణనలోకి తీసుకొని ఆర్థిక ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ప్రతి 10 రోజులకు వ్యాపారం ద్వారా నిధులు అందే విధంగా ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్‌పై స్పష్టమైన ప్రణాళిక ఉండాలని తెలిపారు. ఇందిరా మహిళా డెయిరీ నిర్వహణలో ఆదాయం, వ్యయం, పాల సేకరణ, మార్కెటింగ్, తదితర అంశాలపై సమగ్ర కార్యాచరణను పకడ్బందీగా రూపొందించాలని అధికారులను ఆదేశించారు.స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ అధికారులు చొరవతో పనిచేసి కేటాయించిన బడ్జెట్ సమయానికి విడుదలై, సక్రమంగా వినియోగం అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సమీక్షా సమావేశంలో డిఆర్డిఓ శ్రీరామ్, సిపిఓ శ్రీనివాస్, బిసి అభివృద్ధి అధికారి జి.జ్యోతి, ఇంచార్జీ ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, జిల్లా మైనారిటీ అభివృద్ధి అధికారి ముజాహిద్, పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి పురంధర్, పంచాయతీ రాజ్ ఈఈ మహేష్, విజయ డెయిరీ డిడి కె.రవి కుమార్, డిఆర్డిఓ ఏపిడి జయశ్రీ, వ్యవసాయ శాఖ ఏడిఏ ఎస్. విజయ్ చంద్ర, ఏపిఎంలు, ఎంపీడీఓలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ధరల బాదుడుపై సీపీఐ ఫైర్

### పెట్రో, గ్యాస్ ధరలు తగ్గించకుంటే వీధులకెక్కుతాం

- పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు
- తగ్గించకపోతే సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తాం
- సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు హెచ్చరిక

**సూర్యాపేట జిల్లా మే 16(వుదయం)** కేంద్రం లో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, సి ఎన్ జి గ్యాస్ ధరలు పెంచి పేదల నడ్డి విరిచిందని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో వాణిజ్య భవన్ సెంటర్లో ఆటోలను తాళ్లతో లాగుతూ వినూత్న నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఇప్పటికే నిత్యవసర వస్తువుల ధరలతో ఇబ్బంది పడుతున్న సామాన్యులు తాజాగా పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో పేద మధ్య తరగతి ప్రజలపై మరింత భారం పెరిగింది అన్నారు. కేంద్ర ప్రభుత్వం ధరలను పెంచబోమని అబద్ధాలు ప్రచారం చేస్తూ ప్రజల నమ్మిస్తూ ఎన్నికలు ముగిసిన వెంటనే ధరలను పెంచుతూ మోసం చేస్తున్నారని విమర్శించారు. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు పెరగడంతో ఇక్కడ కూడా పెట్రోల్,




డీజిల్, గ్యాస్ ధరలు పెంచుతున్నామని మాట్లాడుతున్న బిజెపి ప్రభుత్వం అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ తగ్గినప్పుడు ఎందుకు ఇక్కడ ధరలు తగ్గించలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని మోడీ సర్కార్ కార్పొరేట్ వర్గాలకు ఊడిగం చేస్తూ పేదల సంక్షేమాన్ని విస్మరిస్తుందని అన్నారు. గడిచిన 12 ఏళ్లుగా ఆదాని, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తుల కనుసన్నల్లో పాలకులు ముందుకు సాగుతున్నారని వి మర్శించారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక చర్యలను ప్రతి ఒక్కరూ నిరసించాలని పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించని ఎడల ప్రజా ఆగ్రహాన్ని గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ అనంతుల మల్లేశ్వరి, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు దంతాల రాంబాబు, గీత పనివారాల సంఘం జిల్లా అధ్యక్షులు రేగటి లింగయ్య, పట్టణ కార్యవర్గ సభ్యులు చామల అశోక్ కుమార్, దీకొండ శ్రీనివాస్, పట్టణ మైనార్టీ నాయకులు ఎండి పాషా, ఏఐవైఎఫ్ గౌరవ పట్టణ అధ్యక్షులు కుక్కడప్పు శౌరి, పట్టణ కార్యదర్శి ఎడెల్లి శ్రీకాంత్, పూన్నం రమేష్ , అయితే గాని కామేష్, గురు స్వామి, మహిళా సంఘం నియోజకవర్గ నాయకురాలు పొదిల వెంకటమ్మ, దంతాల పద్మ రేఖ, దేశ గాని హేమలత, సివిల్ సప్లై హమాలీ నాయకుడు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## రైతుల నుంచి ధాన్యం సేకరణ

### పారదర్శకంగా కొనుగోళ్లు జరిగేలా ప్రత్యేక నిఘా



జిల్లా అదనపు కలెక్టర్ అశోక్ కుమార్

**జయశంకర్ భూపాలపల్లి ,మే 16(వుదయం జిల్లా ప్రతినిధి)** జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ సూచించారు. ఈ నేపథ్యంలో శనివారం గోర్లవీడు గ్రామంలోని వెంకటేశ్వర రైస్ మిల్లు, కొండంపేటలోని వెంకటేశ్వర ఇండస్ట్రీస్ రైస్ మిల్లులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మిల్లుల్లో ధాన్యం దిగుమతుల విధానం, నిల్వ పరిస్థితులు, నాణ్యత ప్రమాణాలు, ప్రభుత్వ మార్గదర్శకాల అమలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మిల్లులో నిల్వ ఉంచిన ధాన్యం స్టాక్‌లను తనిఖీ చేసి, సంబంధిత రికార్డులను పరిశీలించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.రైతులు ప్రభుత్వంపై నమ్మకంతో ధాన్యాన్ని విక్రయిస్తున్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా తక్షణ చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని మిల్ యాజమాన్యానికి సూచించారు. రైతులు ధాన్యం తీసుకువచ్చిన వెంటనే అన్‌లోడింగ్ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని, వాహనాలు ఎక్కువసేపు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న అక్నాలెడ్జ్‌మెంట్‌లను వెంటనే క్లియర్ చేసి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు.ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలను ప్రతి మిల్లులో కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. ధాన్యం నిల్వ, రవాణా, రికార్డు నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యం చోటు చేసుకోరాదని హెచ్చరించారు. అదేవిధంగా జిల్లాలో ట్యాబ్ ఎంట్రీల ప్రక్రియను ప్రతిరోజూ క్రమం తప్పకుండా నిర్వహించాలని జిల్లా సహకార అధికారిని ఆదేశించారు.

కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన 100 శాతం ట్యాబ్ ఎంట్రీలు 24 గంటలలోపు నమోదు అయ్యేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు.ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ట్యాబు ఎంట్రీలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, సోమవారం నాటికి కనీసం 90 శాతం ఎంట్రీలు పూర్తి అయ్యేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఎటువంటి అవాంతరాలు లేకుండా సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ సూచించారు.ఈ తనిఖీలో జిల్లా సివిల్ సప్లైస్ అధికారి కిరణ్ కుమార్, జిల్లా మేనేజర్ రాములు, అసిస్టెంట్ సివిల్ సప్లైస్ అధికారి వేణు, సివిల్ సప్లైస్ ఇన్‌స్పెక్టర్ సురేందర్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థుల్లో సృజనాత్మకత పెరగాలి.

చదువుతో పాటు కళలు, చేతివృత్తులపై ఆసక్తి పెంపొందించుకోవాలి: కలెక్టర్

**నల్గొండ, మే 16 (వుదయం జిల్లా ప్రతినిధి)** విద్యార్థులు చదువుతో పాటు కళలు, . ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్ల వ్యయంతో 2500 మంది విద్యార్థులు చదివేలా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. .పిల్లలను తీర్చిదిద్దడంలో తల్లుల పాత్ర కీలకమని పేర్కొన్న కలెక్టర్, వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులను పాఠశాలకు తీసుకెళ్లే సమయంలో తల్లిదండ్రులు, పిల్లలు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. పాఠశాలల వద్ద స్కూల్ జోన్లు ఏర్పాటు చేసి రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం "అలైవ్ అరైవ్" కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తోందన్నారు.నల్గొండ జిల్లాకు విద్యా రంగంలో ప్రత్యేక గుర్తింపు ఉందని, రాష్ట్రవ్యాప్తంగా వివిధ రంగాల్లో ఉన్నత హోదాల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు ఉన్నారని, దీనికి తల్లిదండ్రుల ప్రోత్సాహమే కారణమని అన్నారు.

## కలిసికట్టుగా డెంగీని నిర్మూలిద్దాం

– జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి రాథోడ్

**మహబూబాబాద్, మే 16 (వుదయం ప్రతినిధి) :** జాతీయ డెంగి నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ నుండి నెహ్రూ సెంటర్ వరకు సాగిన ఈ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డెంగీ ప్రజారోగ్యానికి పెద్ద సమస్యగా మారిందని, ప్రజలు, ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు కలిసికట్టుగా కృషి చేస్తేనే దీని నియంత్రణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఇది మానవ ప్రేరేపిత వ్యాధి అని, మన నిర్లక్ష్యం వల్లే దోమలు వృద్ధి చెందుతున్నాయని తెలిపారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. పాత టైర్లు, కొబ్బరి చిప్పలను తొలగించాలి.దోమలు కుట్టకుండా పొడుగు చేతుల చొక్కాలు, ప్యాంట్లు ధరించాలి.డెంగీకి కచ్చితమైన ఔషధం లేదా టీకా లేనందున, వ్యాధి సోకిన వారు తప్పనిసరిగా దోమతెరల్లోనే నిద్రించాలి. 60 శాతం మంది డెంగీ బాధితుల్లో ఎలాంటి లక్షణాలు కనిపించవు, కాబట్టి ప్రభావిత ప్రాంతాల్లో విస్తృతంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలి.జిల్లా కీటక జనిత వ్యాధుల నియంత్రణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. డెంగీ నివారణలో



ప్రజలను భాగస్వాములను చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఏటా మే 16న జాతీయ డెంగీ నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ సుధీర్ రెడ్డి, జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, DPMO వాల్య, ఆరోగ్య విద్యా బోధకులు పురుషోత్తం, సబ్ యూనిట్ ఆఫీసర్ గోపిచంద్, MPHEO తోట శ్రీనివాస్, హెల్త్ సూపర్వైజర్ ఫహీముద్దీన్, కౌన్సిలర్ రమేశ్, పట్టణ ఆరోగ్య కేంద్రం ఏ ఎన్ ఏం లు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి.

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద.

**వరంగల్ జిల్లా మే 16 (వుదయం జిల్లా ప్రతినిధి)** వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శంభునిపేటలో శనివారం సమగ్ర శిక్ష తెలంగాణ మరియు ఏ ఎల్ ఐ ఎం సి ఓ (దివ్యాంగుల ఉపకరణాల సంస్థ) సంయుక్త ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు సహాయక ఉపకరణాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద పాల్గొని దివ్యాంగులకు 115 సహాయక ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులు ఎప్పుడూ ఆత్మస్థైర్యం కోల్పోకూడదని, జీవితంలో ఎల్లప్పుడూ సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని సూచించారు. దివ్యాంగులకు దేవుడు అసాధారణ ప్రతిభను ప్రసాదించాడని, ఆ ప్రతిభను వెలికితీయడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన మనోవికాస కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గత విద్యా సంవత్సరంలో ఆగస్టు నెలలో నిర్వహించిన అసెస్మెంట్ క్యాంపులో అర్హులుగా గుర్తించిన 99 మంది దివ్యాంగ విద్యార్థులకు గాను మొత్తం 115 సహాయక ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ ఉపకరణాలలో బ్రెయిలీ కిట్లు, మొబైల్ ఫోన్లు, వీల్ చెయర్లు, వినికిడి యంత్రాలు మరియు ఇతర అవసరమైన ఉపకరణాలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు, సీఎంఓ అండ్ ఇంక్లూజు ఎడ్యుకేషన్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ డా. కె. శ్రీనివాస్, డిఎం హెచ్ ఓ డా. సాంబశివరావు మండల విద్యాశాఖ అధికారి ప్రసాద్, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఫీక్, సి ఆర్ పి లు, ఐఇఆర్పి లు, ప్రత్యేక ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు సి డబ్ల్యూ ఎస్ ఎన్ విద్యార్థులు పాల్గొన్నారు.

# మహబూబ్ నగర్ | మెదక్ ఉమ్మడి జిల్లాల వార్తలు

## కాకర్ల సురేష్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



నారాయణపేట మే16 (వుదయం ప్రతినిధి)

నారాయణపేట జిల్లా కేంద్రంలోని కాకర్ల సురేష్ వెల్ఫేర్ ట్రస్ట్ , అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో బాటసారులకు వేసవి తాపాన్ని తీర్చేందుకు అమావాస్య సందర్భంగా పాత బస్టాండ్ ఆవరణలో మజ్జిగ పంపిణీ చేశారు. అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లా అధ్యక్షులు డాక్టరేట్ కాకర్ల భీమయ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మనోహర్ ప్రసాద్ గౌడ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొంతకాలంగా సురేష్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేసవి తాపాన్ని తీర్చేందుకు బాటసారులకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లా అధ్యక్షులు డాక్టర్ కాకర్ల భీమయ్యను అభినందించారు. దీనితో పాటు క్రికెట్ టోర్నమెంట్ తదితర కార్యక్రమాలను పట్టణంలో నిర్వహిస్తున్నందుకు ఆయన వారిని కొనియాడారు. గతంలో డాక్టర్ కాకర్ల భీమయ్య చేసిన సేవలకు గాను డాక్టరేట్ అవార్డు రావడం ఎంతో గొప్ప విషయమని, భవిష్యత్తులో మరిన్ని సేవలు ప్రజలకు మరెన్నో అవార్డులు పొందాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో దామరగిద్ద మాజీ జడ్పిటిసి భీమయ్యగౌడ్ నారాయణపేట మున్సిపల్ మాజీ కౌన్సిలర్ సూర్యకాంత్, ప్రముఖ కూరగాయల వ్యాపారవేత్త శశికాంత్ యాదవ్, శంభు లింగం లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## గోడపత్రిక, కరపత్రం ఆవిష్కరణ



సదాశివపేట వుదయం

సదాశివపేటలోని బసవేశ్వర మందిరంలో శ్రీ ఆది జగద్గురు పంచాచార్య యుగమనోత్సవము, శ్రీ మహాత్మ బసవేశ్వర జయంతోత్సవాల సందర్భంగా గోడపత్రిక, కరపత్రాన్ని వీరశైవ లింగాయత్ సమాజం ఎడ్లబజార్ అధ్యక్షుల చేతుల మీదుగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అధ్యక్షులు గందిగా రాజు మాట్లాడుతూ, మే 23న హైదరాబాద్‌లో ఆల్ ఇండియా వీరశైవ మహాసభ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన ప్రజాప్రతినిధులకు సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరై జగద్గురువుల ఆశీర్వాదం పొందాలని కోరారు.ఆల్ ఇండియా వీరశైవ మహాసభ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుధీర్ కుమార్ పాటిల్ మాట్లాడుతూ,సంగారెడ్డి జిల్లా నుంచి వీరశైవ లింగాయతులు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యనిర్వాహక అధ్యక్షులు అమ్మిశెట్టి జయప్రకాశ్ మాట్లాడుతూ, ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా హైదరాబాద్‌లో ఆది జగద్గురు పంచాచార్య యుగమనోత్సవము, మహాత్మ బసవేశ్వర జయంతోత్సవాలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అధిక సంఖ్యలో పాల్గొని గురువుల ఆశీర్వాదాలు పొందాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సిద్దికేర్ వినోద్, కోశాధికారి అమరాధి రాచన్న, జిల్లా ఉపాధ్యక్షులు వీర మహేందర్ అడ్వకేట్, సమాజ సభ్యులు రాచప్ప, రమేష్, రవి, సురేష్, శేఖర్, సతీష్, రవణప్ప, షాబాద్ వీరన్న, విశ్వనాథ్, ప్రవీణ్, లోకేష్, మల్లేశం, వైద్యనాథ్ పాల్గొన్నారు. మహిళా సభ్యులు అన్నపూర్ణ, కవిత, పల్లవి, సంధ్యా, రమా, స్వాతి, శిరీష, లలిత తదితరులు హాజరయ్యారు.

## కొనుగోలు కేంద్రాలను సందర్శించిన ఎంపీడీవో



మెదక్ జిల్లా వుదయం

ప్రతినిధి నిజాంపేట మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో సొసైటీ కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఎంపీడీవో రాజిరెడ్డి, సందర్శించారు. కొనుగోలు కేంద్రాలలో కాంటాలు అయిన ధాన్యాన్ని లారీలలో రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు చేపట్టామన్నారు. ఈ అకాల వర్షాలకు వడ్లు తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొమ్మెన మల్లేశం, ఉపసర్పంచ్ ఆకుల మహేందర్, కార్యదర్శి వెంకట నరసింహారెడ్డి,సొసైటీ సెక్రటరీ జ్యోతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అలంపూర్ ఏఎంసీని సందర్శించిన అదనపు కలెక్టర్ మధు మోహన్



అలంపూర్ మే 16 (వుదయం ప్రతినిధి)

అలంపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మధు మోహన్ శనివారం రోజు ఆకస్మికంగా సందర్శించారు. మార్కెట్ యార్డ్‌లో నెలకొన్న సమస్యలను స్వయంగా పరిశీలించిన ఆయన, అక్కడికి వచ్చిన రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పంటల కొనుగోలు, నిల్వ, తూకం, రవాణా తదితర అంశాలపై రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వినిపించగా, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే మార్కెట్‌లో పనిచేస్తున్న హమాలీలతో కూడా ప్రత్యేకంగా సమావేశమై చర్చలు జరిపారు. రాబోయే రోజుల్లో వర్షాలు పడే సూచనలు ఉన్న నేపథ్యంలో, రైతులు తమ ధాన్యాన్ని త్వరగా విక్రయించుకునేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు.ఈ క్రమంలో ఆదివారం రోజున కూడా పనులు కొనసాగించేలా హమాలీలను ఒప్పించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు.

రైతుల ప్రయోజనాల దృష్ట్యా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు.

# వచ్చే ఖరీఫ్‌లో సన్న వడ్లు పండించాలి జిల్లా కలెక్టర్ కె. హైమావతి

**హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ గోదాములను తనిఖీ చేసిన కలెక్టర్**
**అకాల వర్షా ల నేపథ్యంలో ధాన్యం దిగుమతి ముమ్మరం**
**రేషన్ షాపుల కోసం ఇతర జిల్లాలపై ఆధారపడకుండా రైతులు సహకరించాలి**



సిద్దిపేట, మే 16 (వుదయం బ్యూరో)

వచ్చే ఖరీఫ్ సీజన్‌లో రైతులందరూ సన్న వరి ధాన్యం పండించేందుకు ముందుకు రావాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి పిలుపునిచ్చారు. శనివారం హుస్నాబాద్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ (AMC) గోదాముల్లో జరుగుతున్న వరి ధాన్యం దిగుమతి ప్రక్రియను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. హుస్నాబాద్, అక్కన్నపేట మండలాలకు సంబంధించిన వరి ధాన్యాన్ని ఇక్కడి 5,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల రెండు గోదాముల్లో దిగుమతి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఒక గోదాము దాదాపు పూర్తిగా నిండిపోగా, రెండో గోదాములో ఉన్న ఖాళీ గన్నీ బ్యాగులను వేరే చోటికి తరలించి, అక్కడ కూడా ధాన్యాన్ని నిల్వ చేయాలని అధికారులను ఆదేశించారు. అకాల వర్షాల వల్ల రైతులు నష్టపోకుండా ఉండేందుకే ప్రస్తుతం మార్కెట్ కమిటీ గోదాముల్లో ధాన్యం దిగుమతి ప్రక్రియను వేగవంతం చేశామని ఆమె స్పష్టం చేశారు. మార్కెట్ యార్డుకు వచ్చిన రైతులతో కలెక్టర్ ముచ్చటించారు. వచ్చే ఖరీఫ్ సీజన్ లో సన్న వడ్లను పండించాలని, వీటికి ప్రభుత్వం ఇచ్చే బోనస్ కూడా లభిస్తుందని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలోని రేషన్ షాపుల్లో పంపిణీ చేసేందుకు సన్న బియ్యం సరిపోక ఇతర జిల్లాల నుండి దిగుమతి చేసుకోవాల్సి వస్తోందని, అదే మన జిల్లా రైతులు సన్న వరి పండిస్తే జిల్లా అవసరాలకు సరిపోతుందని ఆమె సూచించారు. మార్కెట్ కమిటీ పరిధిలోని హమాలీలు కేవలం ఇక్కడి పనులకే పరిమితం కావాలని, బయటి పనులకు వెళ్లకుండా చూడాలని మార్కెట్ కమిటీ ఛైర్మన్ తిరుపతి రెడ్డిని కలెక్టర్ ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లు, దిగుమతుల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఈ తనిఖీ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఆర్డీఓ రామ్మూర్తి, ఏసిపి సదానందం, తహసిల్దార్ లక్ష్మా రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ తిరుపతి రెడ్డి తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లోనూ రాణించాలి



వనపర్తి మే16 (వుదయం ప్రతినిధి)

విద్యార్థులు విద్యతో పాటు సాంస్కృతిక క్రీడల్లో భాగస్వాములై రాణించాలి అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఎన్ ఖీమ్య నాయక్

ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక లో భాగంగా మే, 11 నుండి 17 వరకు నిర్వహిస్తున్న విద్యా వస్తోత్సవాల్లో భాగంగా శనివారం ఐ.డి. ఒ.సి సమావేశ మందిరంలో జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో కళలు, హస్తకళలు మరియు సాంస్కృతిక దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఎన్ ఖీమ్య నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు వివిధ కళలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని రాణించాలని సూచించారు. విద్యార్థులు బాగా చదువుకుని తమ తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చడంతో పాటు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు బాగున్నాయని, అర్హులైన ఉత్తమ ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనలు చేస్తున్నారని దానితోపాటు విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు, ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం ఇస్తున్నారని తెలియజేశారు. ప్రతి ఒక్కరు చదువుకొని విద్యావంతులు కావాలనేది ప్రభుత్వ ఆశయమని, చదువుకున్న వారు నిరక్షరాస్యుల కంటే చాలా గొప్పగా ఆలోచన విధానం ఉంటుందన్నారు. చదువుకున్న వారు ఒక్క యుద్యోగమే కాకుండా ఏ రంగంలోనైనా రాణించగలరని వివరించారు. అందుకే బడిబాట కార్యక్రమంలో ఏ ఒక్క పిల్లలు బడి బయట కాకుండా బడిలో చేరే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.

అనంతరం విద్యార్థులు స్వయంగా రూపొందించిన చిత్ర కళలు, హస్త కళల ప్రదర్శనను అదనపు కలెక్టర్ సందర్శించి ఉత్తమ కళలు రూపొందించిన విద్యార్థులకు, చిత్రకళలు, నాట్యం చేసిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు.

పీఎంశ్రీ పాఠశాల విద్యార్థినులు, ఇతర ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, బాల భవన్ విద్యార్థులు నిరుపయోగ వస్తువులతో తయారు చేసిన హస్త కళలు, సాంస్కృతిక కార్యక్రమాలు, కూచిపూడి, భరత నాట్యం, ఫోక్ సాంగ్ పై చేసిన నృత్యాలు చూపరులను ఎంతో ఆకట్టుకున్నాయి. జిల్లా విద్యా శాఖ అధికారి మహమ్మద్ ఘని, యం. ఈ ఒ లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గజ్వేల్ మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డే'

*** విద్యా వారోత్సవాల్లో భాగంగా ఆరో రోజు ప్రత్యేక సదస్సులు**
*** బోధన, అభ్యాస ప్రక్రియలో ఏఐ వినియోగంపై అధ్యాపకులకు అవగాహన**
*** సాంకేతిక పరిజ్ఞానాన్ని సృజనాత్మకంగా వాడుకోవాలి: ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం**



గజ్వేల్, మే 16 ( వుదయం ప్రతినిధి )

ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాలలో భాగంగా శనివారం ఆరో రోజు కార్యక్రమంగా గజ్వేల్‌లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో "ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) డే" ను ఘనంగా నిర్వహించారు. అధ్యాపకులలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం మాట్లాడుతూ.. విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సృజనాత్మకంగా వినియోగించుకోవాలని సూచించారు. కృత్రిమ మేధ (AI) వంటి సరికొత్త టెక్నాలజీలపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా భవిష్యత్తులో అద్భుతమైన ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని, ఈ దిశగా విద్యార్థులను అధ్యాపకులు నిరంతరం ప్రోత్సహించాలని ఆమె పిలుపునిచ్చారు.

ఆన్‌లైన్ సదస్సులు - నిపుణుల విశ్లేషణ: సిద్దిపేట ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆన్‌లైన్ సదస్సులో ప్రముఖ ఏఐ పరిశోధకులు మహ్మద్ నసీరుద్దీన్ ప్రసంగించారు. విద్యా రంగంలో కృత్రిమ మేధస్సు వినియోగం, బోధన-అభ్యాస ప్రక్రియలో ఏఐ చూపబోయే ప్రభావం, భవిష్యత్ ఉపాధి అవకాశాల గురించి ఆయన కూలంకషంగా వివరించారు. ఐఐఈటీ సిద్దిపేటకు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ శ్రీ ఎస్. అబ్దుల్ ఖానీ ఆన్‌లైన్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఏఐ వల్ల కలిగే ప్రయోజనాలతో పాటు ఎదురయ్యే సవాళ్లు, నైతిక విలువలు, డిజిటల్ భద్రత వంటి అంశాలపై ఆయన అధ్యాపకులకు అవగాహన కల్పించారు.అనంతరం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ఇంగ్లీష్ అసోసియేట్ ప్రొఫెసర్ డా. మాధవి ఆధ్వర్యంలో ప్రత్యేక చర్చా కార్యక్రమం జరిగింది. బోధన, అభ్యాస ప్రక్రియలో ఏఐని ఏ విధంగా భాగస్వామ్యం చేయాలనే అంశంపై అధ్యాపకులతో ఆమె సుదీర్ఘంగా చర్చించారు. ఈ సదస్సులో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పెద్ద సంఖ్యలో, ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మిషన్ మోడ్ లో ధాన్యం సేకరణ

**దొడ్డు రకం దాన్యం బాయిల్డ్ మిల్లర్లు దిగుమతి చేసుకోవాలి**
**రెవెన్యూ అదనపు కలెక్టర్ జె ఎల్ బి హరిప్రియ**



మహబూబ్ నగర్ మే16 (వుదయం ప్రతినిధి)

జిల్లా లో బాయిల్డ్ రైస్ మిల్లర్ లు వారికి కేటాయించిన దొడ్డు రకం ధాన్యం సేకరణకు సహకరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ కోరారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం లోని ఎన్. ఐ.సి.కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లాలోని బాయిల్డ్ రైస్ మిల్లర్ లు,పౌర సరఫరాల శాఖ డి.టి.లు,లారీ కాంట్రాక్టర్ లతో ధాన్యం సేకరణ పై సమావేశం నిర్వహించి సమీక్షించారు.ప్రస్తుతం ధాన్యం సేకరణ పీక్ లో ఉందని,రాష్ట్ర ముఖ్యమంత్రి మిషన్ మోడ్ లో ధాన్యం సేకరణ చేయాలని ఆదేశాలు జారీ చేశారని,అందుకనుగుణంగా మే నెలాఖరు లోగా ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాలో 75 రైస్ మిల్లర్ లు ధాన్యం సేకరణలో పాల్గొంటున్నారని,ఇందులో 60 రా రైస్ మిల్లర్ లు,15 బాయిల్డ్ రైస్ మిల్లర్ లు ఉన్నారని తెలిపారు.ముఖ్యంగా దొడ్డు రకం ధాన్యం సేకరణ బాయిల్డ్ మిల్లర్ లు మిల్లింగ్ సామర్థ్యం మేరకు కేటాయించిన ధాన్యం జాప్యం లేకుండా దిగుమతి చేసుకోవాలని సూచించారు మిల్లు వద్ద హమాలీ లు సంఖ్య పెంచుకోవాలని ఆన్ లోడింగ్ త్వరగా వీలు అవుతుందని తెలిపారు.లారీ ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్ లు పెద్ద ఎత్తున ధాన్యం వచ్చిన కొనుగోలు కేంద్రాల కు లారీలు ఏర్పాటు చేయాలని అన్నారు.ధాన్యం సేకరణ వేగవంతం చేయుటకు,రవాణా సమస్య లేకుండా ట్రాన్స్పోర్ట్,పోలీస్ శాఖ సహకారం తో రోడ్డు పై లారీ లు,ట్రాక్టర్ లు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.ధాన్యం సేకరణ కొనుగోలు కేంద్రాల్లో ట్రాన్స్పోర్ట్ శాఖ ఏర్పాటు చేసిన లారీ లు ప్రత్యేక వరసలో ఏర్పాటు చేసి ధాన్యం ఆన్ లోడింగ్ చేసుకోవాలని సూచించారు.

పౌర సరఫరాల డి.టి.లు మిల్లు లలో ఆన్ లోడింగ్ మానిటర్ చేయాలని సూచించారు.

డి.సి.ఆర్.బి.డి.ఎస్.పి రమణా రెడ్డి, సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్,జిల్లా పౌర సరఫరాల సంస్థ డి.ఎం.రవి నాయక్ ,మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## డెంగ్యూ వ్యాధి నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత



మహబూబ్ నగర్ మే16 (వుదయం ప్రతినిధి)

డెంగ్యూ వ్యాధి నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ శశికాంత్ అన్నారు. ప్రతి సంవత్సరం మే 16 జాతీయ డెంగ్యూ నివారణ దినము సందర్భంగా మహబూబ్ నగర్ లో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కు మ్మరివాడి ప్రాథమిక పట్టణ ఆరోగ్య కేంద్రము వద్ద డెంగ్యూ అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ బండ్ల గేరి పాత జిల్లా వైద్యాధికారి కార్యాలయము నుండి చౌరస్తా వద్ద మానవహారం ఏర్పడి డెంగ్యూ నివారణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డా. శశికాంత్ మాట్లాడుతూ వ్యాధి నివారణ పై విస్తృతముగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలలో అవగాహన కల్పించాలని అన్నారు. నినాదము ఏకం అవ్వండి చర్యలు తీసుకోండి, నిర్మూలించండి అనే పదాలను అనే నినాదమును ప్రజలలో విస్తృతంగా ప్రచారం చెయ్యాలని కోరారు.డెంగ్యూ వ్యాప్తిని నివారించడానికి ఒక కుటుంబం లేదా ఒక డాక్టర్ మాత్రమే సరిపోరు, సమాజంలోని ప్రతి ఒక్కరూ కలిసి రావాలన్నారు. పరిసరాలను శుభ్రపరచడం నీటి నిల్వలను తనిఖీ పులి విద్య , డా. త స్లిమా ఫర్హాత్, డా.విజయ్ , హెల్త్ ఎడ్యుకేటర్లు హన్మంతు, నాగరాజు శెట్టి, నాగరాజు, సిహెచ్ఓ లు వరమ్మ, రమేష్, శ్రీనివాసులు, యుగంధర్,సబ్ యూనిట్ ఆఫీసర్ అశోక్ రాజు,శ్రీనివాసులు కంప్యూటర్, సూపెర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులు కళా రంగాల్లోనూ ప్రతిభ చాటాలి



**సృజనాత్మకంగా ఆలోచిస్తే కళల్లో రాణింపు**
**విద్యా వారోత్సవాల్లో**
**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

గద్వాల మే 16 (వుదయం ప్రతినిధి)

విద్యార్థులు చదువుతోపాటు కళా రంగాల్లోనూ ప్రతిభ చాటాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల్లో శనివారం ఆర్ట్, క్రాఫ్ట్, కల్చరల్ డే కార్యక్రమాలను ఐడిఓసి సమావేశపు మందిరంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఏ రంగంలో రాణించాలన్న సృజనాత్మకతను అలవర్చుకోవాలని, నూతన ఆవిష్కరణలకు కృషి చేయాలన్నారు. విద్యార్థులతోపాటు పలువురు ఉపాధ్యాయులు తయారుచేసిన క్రాఫ్ట్, ఆర్ట్ వస్తువులు అలంకరణకు, కానుకలుగా ఇచ్చేందుకు కూడా వినియోగించ వచ్చన్నారు. విద్యార్థులు నృత్య, నాటక ప్రదర్శనలతో పేరు ప్రఖ్యాతులు సంపాదించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయా కళల్లో రాణించిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు జిల్లా కలెక్టర్ బహుమతులు,

ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో విజయలక్ష్మి, సెక్టోరియల్ అధికారులు మైఖేల్, ప్రసాద్, జ్యోతి, కర్రెప్ప, వివిధ మండలాల విద్యాధికారులు, పలువురు ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా పరిశీలనలో ప్రత్యేక చర్యలు



**స్వచ్ఛమైన ఓటరు జాబితా కోసం జిల్లా యంత్రాంగం, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్,**

నాగర్ కర్నూల్ మే 16 (వుదయం ప్రతినిధి)

భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం పై తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లా ఎన్నికల అధికారులు (DEOs), ఎన్నికల నమోదు అధికారులు (EROs) తో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి, ఐఎఎస్ శనివారం హైదరాబాద్‌లోని సీఈఓ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా (SIR) కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం (ECI) త్వరలో ప్రకటించనున్నందున, మ్యాపింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేసి పురోగతి సాధించాలని కలెక్టర్లు, DEOs లను ఆయన ఆదేశించారు.నాగర్ కర్నూల్ కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ హాజరై మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు 75 శాతం మ్యాపింగ్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఓటరు జాబితాల పరిశీలన, బూత్‌ల వారీగా వివరాల సేకరణ, సిబ్బంది సమన్వయం వంటి అంశాల్లో ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా స్థాయిలో చేపడుతున్న ఏర్పాట్లను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డికు వివరించారు.స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, సర్ ప్రక్రియలో రాజకీయ పార్టీల సహకారం ఎంతో అవసరమని, అందుకోసం వారికి పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నామని కలెక్టర్ వివరించారు. ముఖ్యంగా బూత్ స్థాయి ఏజెంట్ల నియామకంపై పార్టీలకు సూచనలు చేయనున్నట్లు, జిల్లాలో పెరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, సంబంధిత పనిభారాన్ని దృష్టిలో ఉంచుకుని అదనంగా ముగ్గురు సహాయ అధికారులను నియమించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి ని కోరారు. అదనపు అధికారుల నియామకం ద్వారా మ్యాపింగ్, ఓటరు జాబితా పరిశీలన, ఫీల్డ్ స్థాయి పర్యవేక్షణ మరింత సమర్థవంతంగా కొనసాగుతాయని తెలిపారు.ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రతి దశను కచ్చితంగా అమలు చేస్తూ, స్వచ్ఛమైన మరియు నిష్పాక్షిక ఓటర్ జాబితా రూపకల్పనకు జిల్లా యంత్రాంగం కట్టుబడి పనిచేస్తోందని కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి వివరించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో ఆర్డీవోలు సురేష్ బాబు, యాదగిరి, బన్సీలాల్, కలెక్టరేట్ ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు

## షెడ్యూల్ ప్రకారం ఓటరు జాబితా తయారు చేయాలి



**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

గద్వాల మే 16 (వుదయం ప్రతినిధి)

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించి మ్యాపింగ్ ప్రక్రియను పూర్తిచేసి, ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకారం ఫైనల్ ఓటర్ జాబితాను తయారు చేయాల్సి ఉందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పై శనివారం హైదరాబాద్ నుంచి ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 76.54 శాతం మ్యాపింగ్ పూర్తయిందన్నారు. గద్వాల పురపాలికలో 52.99 శాతం మాత్రమే కావడంతో మెరుగైన పనితీరు కనబరచాలని ఆదేశించారు. గద్వాల మున్సిపాలిటీలో వార్డుల వారీగా సూపర్వైజర్లు, బిఎల్వోలు, వార్డ్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించాలన్నారు. బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించేందుకు ఈనెల 19న రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఫైనల్ ఓటర్ జాబితా అక్టోబర్ 1న ప్రచురించాల్సి ఉన్నందున జూన్ 15 నుంచి 24వ తేదీ వరకు పూర్తికాని మ్యాపింగ్ ప్రిపరేషన్ చేపట్టాలన్నారు. జూన్ 25 నుంచి జూలై 24 వ తేదీ వరకు బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికి తిరిగి ఓటరు జాబితాను సమగ్రంగా రూపొందించేందుకు అవసరమైన ఓటర్ల డాక్యుమెంట్స్ సేకరించాల్సి ఉంటుందన్నారు. జూలై 24 లోగా పోలింగ్ స్టేషన్ల రేష్నలైజేషన్, జూలై 31 న ఎలక్ట్రోరల్ డ్రాఫ్ట్ ప్రచురించాల్సి ఉంటుందన్నారు. డ్రాఫ్ట్ సంబంధించి జూలై 31 నుంచి ఆగస్టు 30వ తేదీ వరకు క్లేమ్స్, అభ్యంతరాలను స్వీకరించాలన్నారు. సెప్టెంబర్ 28 లోగా క్లేమ్స్, అబ్జెక్షన్స్ డిస్పోజల్ చేసి అక్టోబర్ 1న ఫైనల్ ఎలక్ట్రోరల్ పబ్లికేషన్ చేయడం జరుగుతుందన్నారు.

కలెక్టరేట్లో, ఆర్డీవో కార్యాలయంలో ఎస్ఐఆర్ హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాసరావు, సి సెక్షన్ పర్యవేక్షకులు మంజుల, గద్వాల్ తహసిల్దార్ హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ జానకి రామ్ సాగర్, తదితరులు పాల్గొన్నారు.



# కోదాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా గడ్డం అంజి

కోదాడ, మే 16(వుదయం):కోదాడ పట్టణంలోని స్థానిక భవాని నగర్‌లో శనివారం నిర్వహించిన కోదాడ నియోజకవర్గ ప్రెస్ క్లబ్ సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గడ్డం అంజి, ఉపాధ్యక్షుడిగా బాణాల అబ్రహం, ప్రధాన కార్యదర్శిగా బండారు నాగరాజు, కోశాధికారిగా షేక్ నూరుద్దీన్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా బత్తుల శ్రీను, కందిబండ హరీష్, నెమ్మాది రమేష్, వసంత్, నవీన్, వాంకుడోత్ రమేష్, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గడ్డం అంజి మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలిపారు.

# బెల్ట్ షాపులపై ఉడుతలపల్లి పంచాయతీ ఉక్కుపాదం



చండూరు, మే 16 ( వుదయం):గ్రామాల్లో బెల్ట్ షాపుల కారణంగా నిరుపేద కుటుంబాలు గుల్లవుతున్న నేపథ్యంలో చండూరు మండలం ఉడుతలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో బెల్ట్ షాపులను పూర్తిగా నిషేధిస్తూ గ్రామ పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. గ్రామంలో విచ్చలవిడిగా వెలిసిన బెల్ట్ షాపుల వల్ల ఎంతోమంది మద్యం వ్యసనానికి బానిసలవుతున్నారని, సంపాదనంతా మద్యానికే తగలేస్తూ కట్టుకున్న భార్య, కన్నపిల్లలు, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను పట్టించుకోకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో బెల్ట్ షాపుల నిర్మూలన కోసం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఎక్సైజ్ శాఖ అధికారులు గత కొంతకాలంగా చేస్తున్న కృషిని కొనియాడుతూ, వారి పిలుపునకు స్పందించి గ్రామాన్ని మద్యరహితంగా మార్చేందుకు ఈ తీర్మానం చేశామన్నారు. ఈ సామాజిక జాడ్యానికి అడ్డుకట్ట వేసేందుకు గ్రామస్తులంతా స్వచ్ఛందంగా సహకరించి, బెల్ట్ షాపుల నిర్మూలనలో భాగస్వాములు కావాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కావలి శివాని సురేష్, కార్యదర్శి శంకర్, ఉపసర్పంచ్ సిలుముల రజిత భీమయ్య, వార్డు సభ్యులు భూషిపాక సరిత శంకర్, గంట అరవింద్, కావలి అశోక్, భూషిపాక వీరప్రకాశ్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

### భద్రాద్రి క్షేత్రంలో ఎమ్మెల్సీ తక్కలపల్లి రవీందర్ రావు

# ప్రత్యేక పూజలు



భద్రాచలం, మే 16 ( వుదయం ప్రతినిధి) తెలంగాణ రాష్ట్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ను మహబూబాబాద్ ఎమ్మెల్సీ తక్కలపల్లి రవీందర్ రావు ఈరోజు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్సీకి దేవస్థాన అధికారులు, వేదపండితులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. ఆలయ సంప్రదాయాల ప్రకారం పూర్ణకుంభ స్వాగతంతో ఆయనను ఆలయంలోకి ఆహ్వానించారు. అనంతరం శ్రీ సీతారామచంద్ర స్వామివారి సన్నిధిలో ప్రత్యేక అర్చనలు, పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ప్రార్థించారు. భద్రాద్రి శ్రీ సీతారాముల దివ్య దర్శనం జీవితంలో ఎంతో ప్రశాంతతను, ఆధ్యాత్మిక చైతన్యాన్ని అందిస్తుందని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. ఆలయ ఆవరణలో కొంతసేపు ధ్యానం చేసిన ఆయన, భక్తులతో కలిసి స్వామివారి మహిమలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వేద ఆశీర్వచనాలు అందజేసి, స్వామివారి తీర్థ ప్రసాదాలను ఎమ్మెల్సీకి అందించారు. అనంతరం ఆలయ విశిష్టత, భద్రాచలం క్షేత్ర మహత్యం గురించి అర్చకులు వివరించారు. భక్తి, సంప్రదాయాలు, ఆధ్యాత్మికతకు భద్రాచలం నిలయమని ఎమ్మెల్సీ అభిప్రాయపడ్డారు. దర్శనం అనంతరం మీడియాతో మాట్లాడిన తక్కలపల్లి రవీందర్ రావు, భద్రాద్రి శ్రీ సీతారాముల ఆశీస్సులతో ప్రజలకు సేవ చేసే అవకాశం లభిస్తోందని తెలిపారు.

రాష్ట్ర అభివృద్ధి, ప్రజల ఆయురారోగ్యాలు, రైతుల సంక్షేమం కోసం స్వామివారిని ప్రార్థించినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక్కసారైనా భద్రాచలం వచ్చి స్వామివారిని దర్శించుకోవాలని ఆయన సూచించారు.

## ధాన్యం కొనుగోలులో స్పీడ్ పెంచండి”

# రోజుకు 15 వేల మెట్రిక్ టన్నుల సేకరణే లక్ష్యం

**– కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



సూర్యాపేట జిల్లా మే:16(వుదయం) జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా, డివిజన్ స్థాయి, మండల స్థాయి అధికారులతో ధాన్యం సేకరణపై వెబెక్స్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు చేయాలని పిలుపునిచ్చారు. కొన్ని అనివార్య కారణాల వల్ల ప్రస్తుతం అనుకున్న స్థాయిలో ధాన్యం సేకరణ జరగడం లేదని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రారంభంలో రోజుకు 5 వేల నుండి 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు తెలిపిన ఆయన..

ఇకపై ఆ వేగాన్ని పెంచి రోజుకు 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని, ఇందుకోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సమయానికి లారీలు రావడం లేదని, వచ్చిన లారీలను కూడా సెంటర్ ఇంచార్జ్ లు కొన్ని నిర్దిష్ట మిల్లులకు మాత్రమే ఎక్కువగా పంపిస్తున్నారని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనివల్ల మిల్లుల వద్ద లారీలు గంటల తరబడి నిలిచిపోతున్నాయన్నారు. మండల తహశీల్దార్లు ప్రత్యేక బాధ్యత తీసుకొని, మిల్లుల వద్ద ఎక్కువ లారీలు నిలిచిపోయిన చోట త్వరితగతిన అన్ లోడింగ్ ప్రక్రియ జరిగేలా చూడాలి. అదే విధంగా మిల్లుకు చేరుకున్న లారీలు 12 గంటల లోపు అన్ లోడింగ్ పూర్తి చేయాలని, ఒకవేళ 12 గంటల లోపు అన్ లోడింగ్ ప్రారంభం కాకపోతే, వెంటనే ఆ లారీలను ప్రత్యామ్నాయ అన్ లోడింగ్ పాయింట్లకు మళ్లించాలని సూచించారు. కొనుగోలు కేంద్రం నుండి లారీలో ధాన్యం లోడింగ్ పూర్తి చేసి, 3 గంటల లోపు మిల్లుకు తరలించాలన్నారు. ఏ మిల్లుకు ఎన్ని వాహనాలు వెళుతున్నాయి, ఎంత అన్ లోడింగ్ జరిగింది అనే రిపోర్టుతో పాటు, కొనుగోలు కేంద్రాలకు ఎన్ని లారీలు వస్తున్నాయనే పూర్తి వివరాలను రోజువారీగా ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు. కొన్ని ప్రాంతాలలో హమాలీల కొరత ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని, దాన్యం లోడింగ్, అన్ లోడింగ్ పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు మూడు షిఫ్టులలో హమాలీలు పనిచేసేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. విధుల్లో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే లేదా నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై కఠినమైన శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హెచ్చరించారు. కార్యక్రమం లో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డిఆర్డిఓ పిడి సన్యాసయ్య, డిఎస్ఓ మోహనబాబు, డిసిఓ ప్రవీణ్ కుమార్, డిఎం సివిల్ సప్లయస్ శ్రీధర్ రెడ్డి, డిఎంఓ నాగేశ్వర శర్మ, ఎఎస్ఓ శ్రీనివాస్ రెడ్డి, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంకుడు గుంతల నిర్మాణం ఒక ఉద్యమంలా సాగాలి

**: ఎంపీడీఓ బండారు యాదగిరి**

**: కళాజాత బృందాల ఆటపాటలతో ఐదు గ్రామాల్లో జలశక్తి అభియాన్ ప్రచారం**

**:ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో నీటి సంరక్షణపై అవగాహన సదస్సులు**



చండూరు,మే 16 (వుదయం):వర్షపు నీరు వృథా కాకుండా ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల ప్రాంగణాల్లో ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ఒక ఉద్యమంలా చేపట్టాలని చండూరు ఎంపీడీఓ బండారు యాదగిరి ప్రజలకు పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు జలశక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని బోడంగిపర్తి, తాస్కానిగూడెం, పుల్లెంల, ఇడికూడ, శిర్దేపల్లి గ్రామాలలో కళాజాత బృందాల ద్వారా నీటి సంరక్షణపై విస్తృత ప్రచారం, అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభల్లో ఎంపీడీఓ మాట్లాడుతూ.. భూగర్భ జలాల పెంపుదల, వర్షపు నీటిని సంరక్షించుకోవడం మనందరి కనీస బాధ్యతని, గ్రామాల్లోని ప్రతి ఇంటి పరిధిలోనూ, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ నీటి పొదుపు పద్ధతులను పక్కాగా పాటించాలని కోరారు. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతతో పాటు నీటి సంరక్షణపై పంచాయతీ పాలకవర్గాలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పిలుపునిచ్చారు. వేముల పుష్ప వీరేశం ఆధ్వర్యంలోని కళాజాత బృందం తమ ఆట పాటలు, సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా ఇంకుడు గుంతల ప్రాముఖ్యతను ప్రజలకు కళ్లకు కట్టినట్లు వివరించింది. ఈ కార్యక్రమంలో బోడంగిపర్తి సర్పంచ్ బొమ్మల సుగుణమ్మ, తాస్కానిగూడెం సర్పంచ్ కొండా రజిత రవి, పుల్లెంల సర్పంచ్ ముక్కముల వెంకన్న, ఇడికూడా సర్పంచ్ పాల్వాయి రమాదేవి, శిర్దేపల్లి సర్పంచ్ దామెర రాములు, మండల ఉపాధి హామీ ఏపీఓ శ్రీనివాస్, డీఆర్‌డీఏ డీపీఎం సోమయ్య, ఏపీఎం యాదయ్య, ఎంపీఓ కోటయ్య, ఉప సర్పంచులు, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# శ్రీ నీలాద్రి స్వామి ఆలయ అభివృద్ధికి రూ. 3.02 కోట్ల టిటిడి నిధులు మంజూరు

**– మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ కృషితో నీలాద్రి క్షేత్రానికి మహర్దశ**

**. టిటిడి ఛైర్మన్ బి.ఆర్. నాయుడు కి ఆలయ కమిటీ కృతజ్ఞతలు**




సత్తుపల్లి మే 16 ( వుదయం ప్రతినిధి) పెనుబల్లి మండలం లోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం శ్రీ నీలాద్రి స్వామి వారి దేవస్థాన అభివృద్ధిలో ఒక కీలక అడుగు పడింది. గత పదేళ్లుగా సరైన నిధులు లేక, ఆదరణ కరువై అభివృద్ధిలో వెనుకబడిన ఈ ఆలయానికి, సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ విజ్ఞప్తి మేరకు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో తిరుమల తిరుపతి దేవస్థానం నుండి రూ. 3,02,50,000/- నిధులు మంజూరయ్యాయి. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలంలోని ప్రసిద్ధ పురాతన ఆలయమైన శ్రీ నీలాద్రి స్వామి వారి దేవస్థానం అభివృద్ధి పనుల కోసం ?3,02,50,000/- (మూడు కోట్ల రెండు లక్షల యాభై వేల రూపాయలు) ఆర్థిక సహాయం మంజూరు

చేయాలని ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ విజ్ఞప్తి మేరకు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ బి.ఆర్. నాయుడు ని కోరారు. తుమ్మల అభ్యర్ధనను గౌరవించి టిటిడి ఛైర్మన్ బి.ఆర్. నాయుడు నిధులు మంజూరుకు కృషి చేశారు. డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సత్తుపల్లి ఎమ్మెల్యే గా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి, మంత్రి తుమ్మల సహకారంతో నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగానే నీలాద్రి స్వామి ఆలయానికి నిధుల సాధనలో విజయం సాధించారు. మంజూరైన ఈ నిధులతో ఆలయ తూర్పు, ఉత్తర ప్రాకారాల నిర్మాణాన్ని అత్యంత వైభవంగా చేపట్టనున్నారు. దీనివల్ల ఆలయ ఆధ్యాత్మిక వారసత్వం పరిరక్షించబడటమే కాకుండా భక్తులకు మెరుగైన సౌకర్యాలు లభించనున్నాయి. నిధులు మంజూరు చేసిన టిటిడి ఛైర్మన్ బి.ఆర్. నాయుడు కి, నిధుల విడుదల కోసం ప్రత్యేకంగా కృషి చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కి ,ప్రత్యేక చొరవ తీసుకున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ కి ఆలయ చైర్మన్ చీకటి చిన్న నరసింహ రావు,ఆలయ కమిటీ సభ్యులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ?మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ల సమన్వయంతో నీలాద్రి క్షేత్రం త్వరలోనే సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దబడుతుందని భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# గ్రామీణ విద్యార్థులకు ప్రపంచ స్థాయి పరిజ్ఞానం

**: ప్రిన్సిపాల్ డాక్టర్ ఘన్‌శ్యామ్**

చండూరు, మే 16 (వుదయం):

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాలలో భాగంగా శనివారం చండూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సరికొత్త సాంకేతికతపై అడుగుపడింది. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఘన్‌శ్యామ్ ఆధ్వర్యంలో కృత్రిమ మేధస్సు (ఏఐ) రంగంలో వేగంగా జరుగుతున్న విప్లవాత్మక మార్పులను విద్యార్థులకు పరిచయం చేయడానికి “ఏఐ అవేర్నెస్ అండ్ ఇన్నోవేషన్” పేరుతో ప్రత్యేక సెమినార్లను విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ వేణు ముఖ్య వక్తగా హాజరై, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఏఐ యొక్క ప్రాథమిక సూత్రాలు, మెషీన్ లెర్నింగ్, డేటా సైన్స్, రోబోటిక్స్, ఆటోమేషన్ ప్రాధాన్యతలతో పాటు భవిష్యత్‌లో ఈ రంగంలో ఉండే అపారమైన ఉపాధి అవకాశాలపై కూలంకషంగా వివరించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, పరిశోధనా దృక్పథం, సాంకేతిక నైపుణ్యాల పెంపుదలే లక్ష్యంగా సాగిన ఈ సెమినార్లలో ప్రాజెక్ట్ ప్రదర్శనలు, ప్రత్యక్ష డెమోలు, ఇంటరాక్టివ్ సెషన్లతో పాటు ఆసక్తికరమైన ప్రశ్నోత్తరాల కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు కూడా ఇటువంటి కార్యక్రమాల ద్వారా ప్రపంచ స్థాయి సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తుందని, దీనిని ఉపయోగించుకుని భవిష్యత్‌లో స్టార్టప్ అవకాశాలకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, అధ్యాపకులు బాల సైదులు, జ్యోతి, పద్మజ, ప్రమీల, సునీత, వెంకన్న,పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## పేదలకు ఉచిత నిత్యవసర సరుకులు పంపిణి

### స్మైల్ ఆల్వేస్ పౌండేషన్ సభ్యులు



దమ్మపేట మే 16 (వుదయం ప్రతినిధి ):స్మైల్ ఆల్వేస్ పౌండేషన్ వారి ఆధ్వర్యంలో మారుమూల గిరిజన గ్రామమైన పూసుకుంట ప్రాంతంలోని సుమారు 10 గ్రామాలలోని 400 కుటుంబాలకు ఉచితముగా 15 రోజులకు సరిపడ నిత్యవసర సరుకులు అయిన బియ్యం, పప్పులు, ఉప్పు, కారం పొడి, పసుపు, నూనె సామాగ్రిని పంపిణి చేయడమైనది. ఈ కార్య క్రమంలో సంస్థ ప్రెసిడెంట్ శ్రీ కోడి సుదామనుడు మాట్లాడుతూ గత కోవిడ్ సమయం నుండి ఈ ప్రాంత పేద గిరిజనులకు ప్రతి సంవత్సరం వేసవి కాలంలో మరియు వర్ష కాలంలో సహాయం చేస్తూ వస్తున్నాము. ఈ సహాయం వారికి ఆకలిని తీర్చడం కోసం, ఆరోగ్యాన్ని కాపాడటం కోసం ఎంతో ఉపయోగకరము గా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రోగ్రాం – డైరెక్టర్ శ్రీ డా టి సైలస్ పాల్ మాట్లాడుతూ ఎంతో దూరం అయిన హైదరాబాద్ నుండి ప్రతి సంవత్సరం రెండు ,మూడు సార్లు ఈ ప్రాంత గిరిజను ప్రజలకు ఈ విధంగా సహాయం చేయడం మాకు ఎంతో సంతోషాన్నిస్తుంది అని తెలిపారు. స్థానిక ప్రతినిధి శ్రీ వెంకటేశ్వర్లు (ఎలీషా) మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఈ విధంగా గొప్పగా జరగడం ఒక పండుగలాగా అనిపిస్తుంది అని, సహాయం అందుకున్న వారి తరపున సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. అంతేకాకుండా ఇంకా మంచినీటి బోర్లు, నివాసాలు ఏర్పాటు చేసి ప్రజల కష్టాలు తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రెసిడెంట్ శ్రీ కాడి సుధామనుడు, సైలస్ పాల్, వెంకటేశ్వర్లు ఎలీషా, కెవిన్. తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన భగవత్గీత సప్తాహం వేడుకలు



చర్ల .మే 16(వుదయం):చర్ల శ్రీ వాణి విద్యానికేతన్ ప్రాంగణంలో ఘనంగా ప్రారంభమైన భగవత్గీత సప్తాహం వేడుకలు. రెండవ రోజు కార్యక్రమం లో కూడా ఉత్సాహంగా పాల్గొన్న హిందూ బంధువులు, విద్యార్థులు. ఈ కార్యక్రమంలో భాగంగా గురువులు కృష్ణ దాస్ మాట్లాడుతూ భగవద్గీతలో చెప్పబడినఆత్మ, పంచభూతము ల అర్థాన్ని వివరిస్తూ ఆత్మకు మరణం లేదని, ఏ ఆయుధం ఆత్మను చేదించలేదని, మనిషి పాత బట్టలను విడిచి కొత్త బట్టలను ఎలా కట్టుకుంటాడో ఆత్మ కూడా ఒక శరీరాన్ని ఒదలి కొత్త శరీరంలోనికి ఆశ్రయిస్తుందని తెలిపారు. నేటి ఆధునిక కాలంలో మనిషి కేవలం శరీర సుఖాల కోసమే ప్రాకులడుతూ పంచభూతాలైన ప్రకృతిని నాశనం చేస్తున్నాడని. భగవత్గీత మానవాళికి ఇచ్చే సందేశం ఈ శరీరం తాత్కాలికం, మనం సంపాదన, ఆస్తులు హోదాలు అన్నీ చివరికి పంచభూతాల్లో కలిసిపోతాయని భగవత్గీత చెపుతుందని తెలిపారు. హిందువుల ఐక్యతే సమాజానికి, దేశానికి, ప్రపంచానికి శ్రీరామరక్ష అని గట్టిగా చాటి చెప్పుదాం అని తెలిపారు. సాయంత్రం 5.30 మొదలైన ఈ కార్యక్రమం ముగిసే వరకు వచ్చిన భక్తులు విధ్యార్థులు చాలా భక్తి, శ్రద్ధలతో విన్నారు సమయం కూడా మర్చిపోయి భక్తిలో లీనమైపోయారు. మధ్య మధ్యలో గురువు అడిగిన ప్రశ్నలకు ఉత్సాహంగా సమాధానం చెపుతూ శ్లోకాలను చదువుతూ భక్తి పారవశ్యము లో మునిగి పోయారు. ఈ లాంటి కార్యక్రమాల వలన మనిషి లో చైతన్యం పెరిగి ధర్మ బద్ధమైన జీవితాన్ని గడుపడానికి ఇలాంటి వేదిక ఉపయోగపడుతుందిని. తద్వారా ధాన గుణం పెరగడం, కష్టాలకు క్రుంగిపోకుండా, సుఖాల విర్రవీగు కుండా ప్రశాంత జీవనాన్ని గడుపుకోవడానికి భగవత్గీత మానవాళికి దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మ జాగరణ పరిరక్షణ కమిటీ, సేవాభారతి, వనవాసి కళ్యాణ పరిషత్, విశ్వ హిందూ పరిషత్ సభ్యులు, సనాతన హిందూ ధర్మ పరిరక్షణ కమిటి సభ్యులు,పాత్రికేయులు పాల్గొన్నారు

## దేశవ్యాప్తంగా గిగ్ వర్కర్ల సమ్మె



దేశవ్యాప్తంగా గిగ్‌వర్కర్లు మరోసారి సమ్మెకు దిగుతున్నారు. ఇంధన ధరలు పెరగడం, తక్కువ వేతనాలను నిరసిస్తూ 5 గంటల పాటు ఈ సమ్మె చేపట్టనున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వారు తమ విధులను బహిష్కరించనున్నారు. ఈ సమ్మెకు గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ సర్వీస్ వర్కర్స్ యూనియన్ ఆధారిత ప్లాట్‌ఫామ్స్‌తో పనిచేస్తోన్న క్యాబ్ డ్రైవర్లు, డెలివరీ పార్టనర్లు తాత్కాలికంగా విధులు బహిష్కరించాలని కోరింది. పెట్రోల్, డీజిల్ రిటెయిల్ ధరలను లీటర్‌కు రూ.3 చొప్పున పెంచడంతో డెలివరీ వర్కర్లు, డ్రైవర్లపై ఆర్థికభారం పడుతోంది. ఈ ధరల పెంపుతో నేరుగా 1.2 కోట్ల మంది గిగ్ వర్కర్లు ప్రభావితం కానున్నారని జీఐపీఎస్‌డబ్ల్యూయూ ఆందోళన వ్యక్తం చేసింది.




# భారీగా పసిడి, వెండి దిగుమతులు



మనదేశంలోకి పసిడి, వెండి దిగుమతులు ఏప్రిల్‌లో భారీగా పెరిగాయి. ఈ లోహాలపై కస్టమ్స్ సుంకాన్ని పెంచినందున, రాబోయే నెలల్లో ఈ దిగుమతులు తగ్గొచ్చని వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ అంచనా వేస్తున్నారు. శుక్రవారం వాణిజ్య శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. పసిడి దిగుమతులు 81.69% పెరిగి 5.62 బి. డాలర్ల (సుమారు రూ.52,000 కోట్ల)కు చేరుకున్నాయి. వెండి దిగుమతులు 157.16% వృద్ధితో 411 మి. డాలర్ల(దాదాపు రూ.3,800 కోట్ల)కు చేరాయి. 2025-26 మొత్తంమీద 71.98 బిలియన్ డాలర్ల (సుమారు రూ.6.69 లక్షల కోట్ల) పసిడి దిగుమతి అయ్యింది. 2024-25 కంటే విలువ పరంగా ఇది 24% అధికం. పరిమాణం పరంగా 4.76% తగ్గి 721.03 టన్నులకు పరిమితమైంది, యూఏఈకి ఇచ్చిన టారిఫ్ కోటా మినహాయింపు(టీఆర్‌క్యూ) వాటా ఇందులో 8.58 టన్నులే ఉందని అగర్వాల్ తెలిపారు. 2025-26లో వెండి దిగుమతులు 150% వృద్ధితో 12 బి. డాలర్లకు చేరుకున్నాయి. పరిమాణ పరంగా 42% పెరిగి 7334.96 టన్నులుగా నమోదైంది. ఏప్రిల్‌లో మొత్తం భారత ఎగుమతులు 13.78% పెరిగి 43.56 బి. డాలర్ల (సుమారు రూ.4 లక్షల కోట్ల)కు చేరుకున్నాయి. వృద్ధి పరంగా ఇవి 5 నెలల గరిష్ఠం కాగా, పరిమాణం పరంగా నాలుగేళ్లలోనే అత్యధిక నెలవారీ ఎగుమతులు ఇవే. అయితే దిగుమతులు కూడా 10% పెరిగి 71.94 బి. డాలర్ల (సుమారు రూ.6.76 లక్షల కోట్ల)కు చేరుకోవడంతో వాణిజ్య లోటు ఏప్రిల్‌లో మూడు నెలల గరిష్ఠమైన 28.38 బి. డాలర్ల (దాదాపు రూ.2.66 లక్షల కోట్ల)కు చేరుకుంది. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నడుమా, దేశ ఎగుమతులు ఆరోగ్యకర వృద్ధిని నమోదు చేశాయని వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్స్ వస్తువులు(40.31%), మాంసం, డెయిరీ(48%), పెట్రోలియం ఉత్పత్తులు(34.66%), ఇంజినీరింగ్ వస్తువులు(8.76%), ఫార్మా(7.12%) వంటివి రాణించడంతో ఎగుమతుల్లో మంచి వృద్ధి సాధ్యమైంది.

## రూ.100 కోట్ల బిజినెస్‌ను మూసేస్తున్నా: వ్యాపారవేత్త అంకుర్ వారికూ



కంటెంట్ క్రియేటర్, వ్యాపారవేత్త అంకుర్ వారికూ సంచలన ప్రకటన చేశారు. విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి కోర్సులను అందించే తన రూ.100 కోట్ల ఆన్‌లైన్ వ్యాపారాన్ని మూసివేయనున్నట్లు ప్రకటించారు. 2020లో ప్రారంభించిన వెబ్‌వేద (WebVeda) అనే ఆన్‌లైన్ కోర్సు బిజినెస్ తాను ఊహించిన దానికంటే.. ఎంతో వృద్ధి చెందిందన్నారు. అయినప్పటికీ దీనిని ఇంకా కొనసాగించడంలో అర్థం లేదంటూ.. ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ప్రస్తుతం ఇది నెట్టింట తీవ్ర చర్చకు దారి తీసింది. 'నేను నా రూ.100 కోట్ల ఆన్‌లైన్ కోర్సుల బిజినెస్‌ను మూసివేస్తున్నా. 2020లో వెబ్‌వేద ప్రారంభమైనప్పటి నుంచి నేను ఊహించిన దానికంటే ఇది ఎంతో అభివృద్ధి చెందింది. ఇప్పటివరకు 5 లక్షల మంది విద్యార్థులు కోర్సులు నేర్చుకున్నారు. రూ.100 కోట్ల అమ్మకాలు సాగాయి. రూ.25 కోట్లు లాభాలు వచ్చాయి. అయినా.. దీనిని ఇంకా ఇలాగే కొనసాగించడంలో అర్థం లేదు' అని ఆయన తన పోస్టులో రాసుకొచ్చారు. తన నిర్ణయం గురించిన పూర్తి వివరాలను శనివారం మరో వీడియోలో వెల్లడిస్తానని తెలిపారు. ఈ పోస్టు నెట్టింట వైరల్ అవుతుండగా.. అంకుర్ ప్రకటనపై నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. అంకుర్ నిర్ణయం వెనుక కృత్రిమ మేధ (AI) కారణమా అని ఓ నెటిజన్ ప్రశ్నించగా, అయ్యుండొచ్చని వ్యాపారవేత్త సమాధానమిచ్చారు. కాగా.. అంకుర్ మరో కొత్త వ్యాపారాన్ని ఏమైనా ప్రారంభించనున్నాడా అనే సందేహాలను కూడా నెటిజన్లు వ్యక్తం చేశారు.

# మహారాష్ట్రలో నిలిచిపోనున్న క్యాబ్, రైడ్ సేవలు..!




మహారాష్ట్రలో క్యాబ్, రైడ్ సేవలు నిలిచిపోనున్నాయి. తమ యాప్ స్టోర్స్ నుంచి ఓలా, ఉబర్, ర్యాపిడో యాప్స్‌ను తొలగించాలంటూ యాపిల్, గూగుల్‌కు మహారాష్ట్ర స్టేట్ సైబర్ డిపార్ట్‌మెంట్ నోటీసులు జారీ చేసింది. అక్రమంగా బైక్ ట్యాక్సీ సేవలను నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది.
బైక్ ట్యాక్సీ అగ్రిగేటర్లపై చర్యలు తీసుకోవాలంటూ మహారాష్ట్ర రవాణా శాఖ మంత్రి ప్రతాప్ సర్నాయక్ సైబర్ విభాగానికి లేఖ రాశారు. ఈ నేపథ్యంలోనే గూగుల్, యాపిల్ సంస్థలకు సైబర్ విభాగం నోటీసులు జారీ చేసింది. ఈ యాప్స్ వేదికగా చట్టవిరుద్ధంగా బైక్ సర్వీసులు అందుతున్నాయని వాటిల్లో అధికారులు పేర్కొన్నారు. రవాణాశాఖ, మోటార్ వాహనాల నిబంధనలు పాటించకుండా ఈ రైడ్‌లను నడుపుతున్నాయని వెల్లడించారు. కర్ణాటక కూడా గతంలో ఈ తరహా ఆదేశాలు ఇచ్చింది. మోటార్ వెహికల్ చట్టంలో బైక్ ట్యాక్సీల (Bike taxi services) ప్రస్తావన లేకపోవడంతో హైకోర్టు ఆదేశాల మేరకు ఆ రాష్ట్రంలో బైక్ ట్యాక్సీ సేవలు నిలిచిపోయాయి. తర్వాత ఓలా, ఉబర్ వంటి సంస్థలు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేశాయి. విచారణ అనంతరం న్యాయస్థానం ఆ తీర్పును పక్కనపెట్టింది. మోటార్ వాహనం చట్టం ప్రకారం బైక్ ట్యాక్సీలను రవాణా వాహనాలుగా పరిగణిస్తూ, చట్టబద్ధమైన అనుమతులతో నడుపుకోవచ్చని అనుమతి ఇచ్చింది.

# రాబోయే 2-3 వారాల్లో పెట్రోల్ ధరపై రూ.10 పెంపు..?



దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు (Petrol-Diesel prices) పెరిగాయి. లీటరు పెట్రోల్, డీజిల్‌పై సగటున రూ.3 పెంచుతూ శుక్రవారం ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. అయితే భవిష్యత్తులో ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు ఇంకా చల్లారలేదని, దీంతో రాబోయే రోజుల్లో ఇంధన ధరల పెంపు మరింత ఎక్కువగా ఉండొచ్చని అంచనా వేశారు. చమురు కంపెనీలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఆర్థిక నష్టాల నుంచి బయటపడడానికి రూ.3 పెంపు చాలదని.. లీటర్ పెట్రోల్, డీజిల్ ధర రూ.10 వరకు పెరుగుతుందని ఎంకే గ్లోబల్ విశ్లేషకులు పేర్కొన్నారు. ఈ పెంపు ఒకేసారి గానీ లేదా 2-3 వారాల్లో దశలవారీగా గానీ ఉండొచ్చన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న భౌగోళిక రాజకీయ, ఉద్రిక్తతలు.. నిరంతర సంక్షోభాల వల్ల అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు సరఫరాపై తీవ్ర ఒత్తిడి నెలకొంది. దీంతో ధరల పెరుగుదలను నియంత్రించడానికి కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం వసూలును తాత్కాలికంగా నిలిపివేసింది. అలాగే ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు కూడా తమ లాభాలను వదులుకుని అధిక వ్యయాన్ని సొంతంగా భరించాయి. ఈ విపత్కర పరిస్థితుల కారణంగా ఇంధన ధరలను రూ.3కి పెంచక తప్పలేదు. అయినప్పటికీ ఈ స్వల్ప పెరుగుదల కంపెనీల రోజువారీ నష్టాలను కొంతమేర తగ్గించిందే తప్ప, పూర్తిగా తొలగించలేకపోయింది. మరోవైపు దేశంలోని అతిపెద్ద పాల ఉత్పత్తుల రిటైలర్లు అయిన అమూల్, మదర్ డెయిరీ లీటరుకు రూ.2 చొప్పున పాల ధరలు పెంచడంతో వినియోగదారుల గృహ బడ్జెట్‌పై భారం పడింది. దీనివల్ల ప్రాంతీయ డెయిరీ సంస్థలు కూడా ధరలను విపరీతంగా పెంచే అవకాశం ఉంది. ఇంధనం, వంటగ్యాస్, పాల ధరల పెరుగుదల వల్ల రాబోయే నెలల్లో రిటైల్ ద్రవ్యోల్బణం సైతం 0.42శాతం మేర పెరిగే అవకాశం ఉందని ఆర్థికవేత్తలు హెచ్చరించారు.




## థాయ్‌లాండ్ ఓపెన్ ఫైనల్‌కు సాత్విక్ - చిరాగ్ జోడీ



థాయ్‌లాండ్ ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్-500 టోర్నీలో సాత్విక్ సాయిరాజ్ - చిరాగ్‌శెట్టి జోడీ అదరగొట్టేస్తోంది. సెమీస్‌లో మలేషియా జోడీపై 19-21, 22-20, 21-16 తేడాతో సాత్విక్-చిరాగ్ విజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లారు. ఈ సీజన్‌లో ఇదే తొలి ఫైనల్ కావడం గమనార్హం. తొలి సెట్‌ను మలేషియా ఆటగాళ్లు గో జెఫీ – నూర్ ఇజ్జుద్దీన్ 21-19 తేడాతో సొంతం చేసుకున్నారు. ఆ తర్వాత అద్భుతంగా పుంజుకున్న భారత జోడీ రెండో సెట్‌ను 22-20తో కైవసం చేసుకుంది. మ్యాచ్‌ను తేల్చే మూడో సెట్‌లో విజయం కోసం ఇరు జట్లూ తీవ్రంగా శ్రమించాయి. అయితే, భారత జోడీ దూకుడు ప్రదర్శించి 21-16తో సెట్‌ను.. అలాగే మ్యాచ్‌ను గెలుచుకుంది. ఇటీవలే సాత్విక్ – చిరాగ్ జోడీ థామస్ కప్‌లో పతకం సాధించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో తమను ఎవరూ పట్టించుకోలేదని ఇటీవల సాత్విక్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఇప్పుడు మరోసారి థాయ్‌లాండ్ ఓపెన్‌లో అద్భుత ఆటతీరుతో ఆకట్టుకున్నాడు.

# నేనేంటో రుజువు చేయాల్సిన పని లేదు.. విరాట్ కోహ్లి



తనకు క్రికెట్ అన్నా, బ్యాటింగ్ అన్నా ఎంతో ఇష్టం కాబట్టి ఆటలో కొనసాగుతున్నా తప్ప.. ఎవరికీ తనేంటో రుజువు చేయడానికి కాదని భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి స్పష్టం చేశాడు. 2027 ప్రపంచ కప్‌లో ఆడాలనే అనుకుంటున్నట్లు చెప్పిన విరాట్.. అందుకోసమే కష్టపడుతున్నట్లు చెప్పాడు. అయితే తాను విలువ చేకూరుస్తానని భావిస్తేనే జట్టులో ఉంటానని.. విలువ రెండు వైపుల నుంచీ ఉండాలని అతను వ్యాఖ్యానించాడు. ఐపీఎల్‌లో తాను ప్రాతినిధ్యం వహించే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు కోసం చేసిన ఒక పాడ్‌కాస్ట్‌లో కెరీర్‌కు సంబంధించి కొన్ని విషయాలపై విరాట్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఆ విశేషాలు తన మాటల్లోనే... ఆట కోసం ఏం చేయాలో నాకు తెలుసు. ఏదైనా సిరీస్‌కు రెండు మూడు వారాల ముందు సిద్ధమయ్యే వ్యక్తిని కాదు నేను. ఏడాదిలో ఏ రోజైనా సిద్ధంగా ఉంటా. నువ్వు రాబోయే సిరీస్‌లో ఆడాలంటే అందుకు సిద్ధమని చెబుతా. ఎందుకంటే నా జీవనమే అందుకు తగ్గట్లుగా ఉంటుంది. రోజూ వ్యాయామం చేస్తాను. ఇంట్లో మంచి తిండి తింటాను. క్రికెట్ ఆడడం కోసం ఇదంతా చేయను. నా దినచర్యే అలా ఉంటుంది. 2027 ప్రపంచకప్ గురించి ఎప్పట్నుంచో ఏదేదో అడుగుతూ ఉన్నారు. ఆ టోర్నీలో ఆడతావా అని ప్రశ్నిస్తారు. దానికి జవాబేంటో నాకు తెలుసు. నేనెందుకు ఇంటిని వదిలేసి ఇక్కడ ఇలా ఎందుకు కష్టపడతాను.. పరుగులు చేస్తాను? నేను క్రికెట్ ఆడాలనుకుంటున్నా. ఇలాగే కొనసాగాలనుకుంటున్నా. భారత్ తరఫున ప్రపంచకప్ ఆడడం బాగుంటుంది. అది నేను ఒక్కడిని తీసుకునే నిర్ణయం కాదు. కానీ పరస్పరం గౌరవం ఇచ్చుకోవడం కీలకం. నా ఆలోచన విధానం స్పష్టం. జట్టుకు నేను విలువ చేకూర్చగలుగుతాను అంటే.. లేదా నేనుంటే విలువ చేకూరుతుందని జట్టు భావిస్తే నేను అక్కడ ఉంటాను. కానీ నీ విలువేంటో చూపించు అంటే మాత్రం నేను అక్కడ ఉండలేను. 50 ఓవర్లలో ప్రతి బంతీ ఇదే నాకు చివరిది అన్నట్లే ఆడతా. కెరీర్లో కూడా ఇదే నాకు చివరి బంతి అనుకుంటుంటా. నా బ్యాటింగ్ అలాగే ఉంటుంది. జట్టు కోసం నా వల్ల అయిందంతా చేయడానికి సిద్ధంగా ఉంటా. నేను నా సన్నాహాల విషయంలో ఎప్పుడూ నిజాయితీగా ఉంటాను. ఆట పట్ల నా దృక్పథం కూడా అలాగే ఉంటుంది. ఆడడానికి వచ్చానంటే ఇంకెవరూ నాలా కష్టపడలేరు అన్న స్థాయిలో శ్రమిస్తా. 50 ఓవర్ల పాటు ఫీల్డింగ్ చేయడానికి సిద్ధపడే వస్తా. 40 ఓవర్ల పాటు బౌండరీకి అటు ఇటు పరుగు తీస్తూ ఫీల్డింగ్ చేయమన్నా చేస్తా. నేను ఎవరికీ ఏదీ రుజువు చేయాల్సిన అవసరం లేదనే స్పష్టతతో ఉంటా. ఆటను ప్రేమిస్తా కాబట్టే నేను ఎక్కడైనా ఆడగలను. విజయ్ హజారేలో ఆడటం మంచి అనుభవం. ముందు ఇంత సుదీర్ఘ కాలం ఆడాక ఇక్కడ ఆడేందుకు తగ్గ ప్రేరణ వస్తుందా అని సందేహించా. కానీ నా ఆలోచన మారింది. 'నేను ఆటను ప్రేమిస్తా. బ్యాటింగ్‌ను ఇష్టపడతా. మైదానంలో ఎంతమంది ఉన్నారు, ఎవరున్నారు అన్నది విషయం కాదు. ఇది నాకు-ఆటకు సంబంధించిన విషయం' అనుకుని బరిలోకి దిగా. నేను ఆటను ఆస్వాదిస్తా. కానీ ఎవరైనా అదీ ఇదీ అని చెప్పి పరిస్థితులను సంక్లిష్టం చేస్తే నాకు నచ్చదు. మీరేం చెప్పాలనుకున్నారో నిజాయితీగా, స్పష్టంగా చెప్పండి.
లేదంటే నా ఆట నన్ను ఆడనివ్వండి. ఒకసారి 'నీ సామర్థ్యంపై నమ్మకముంది' అని చెప్పాక, వారం గడిచాక నేను ఆడే తీరును ప్రశ్నిస్తే ఎందుకిలా చేస్తున్నారు అనిపిస్తుంది. ముందే నీ ఆటతీరు బాగా లేదని అయినా చెప్పాలి. లేదా నా ఆటపై నమ్మకున్నట్లయితే మౌనంగా అయినా ఉండాలి. ఫలితాలు మన చేతిలో ఉండవు. వాటి ఆధారంగా ఆలోచన మారిపోతే మీకు ఎప్పటికీ ఒక నిలకడైన విధానం ఉండదు.

## పాకిస్థాన్ మహిళా క్రికెటర్ ఫాస్టెస్ట్ ఫిఫ్టీ రికార్డు

పాకిస్తాన్ మహిళా జట్టు కెప్టెన్ ఫాతిమా సనా టీ20ల్లో ప్రపంచ రికార్డు సృష్టించింది. జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌లో కేవలం 15 బంతుల్లోనే అర్ధ శతకం బాదింది. ఈ క్రమంలో రిచా ఘోష్, సోఫీ డివైన్, ఫోబ్ లిచ్‌ఫీల్డ్ (18 బంతుల్లో) రికార్డును ఫాతిమా అధిగమించింది. 2022లో వార్విక్‌షైర్ తరఫున మేరీ కెల్లీ,



2025 సూపర్ స్మాష్‌లో ఒటాగో తరఫున లారా హారిస్ కూడా 15 బంతుల్లోనే సాధించడం గమనార్హం. అయితే, అంతర్జాతీయంగా మాత్రం ఫాతిమాదే ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ. పాక్ తరఫున ఇప్పటివరకు ఈ రికార్డు నిదాదార్ పేరిట ఉండేది. 2019లో దక్షిణాఫ్రికాపై ఆమె 20 బంతుల్లో ఈ రికార్డును సాధించింది.
జింబాబ్వే మూడో టీ20లో పాక్ మొదట బ్యాటింగ్ చేసింది. 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 223 పరుగులు చేసింది. ఇన్నింగ్స్ 17వ ఓవర్‌లో సనా క్రీజ్‌లోకి వచ్చింది. కుడ్జాయ్ చిగోరా (18వ ఓవర్) బౌలింగ్‌లో నాలుగు బౌండరీలు.. నోమ్వేలో సిబాండా వేసిన 19వ ఓవర్‌లో (4, 4, 6, 6, 4) బౌండరీలతో విరుచుకుపడింది. అనంతరం లక్ష్య ఛేదనలో జింబాబ్వే 90 పరుగులకే కుప్పకూలింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఫాతిమా సనా (62 నాటౌట్: 19 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్స్‌లు) నిలిచింది. మూడు టీ20ల సిరీస్‌ను పాక్ 3-0తో కైవసం చేసుకుంది.

# అందుకే బ్యాటింగ్‌కు రాలేదు: పంత్

హ్యాట్రిక్ ఓటముల తర్వాత లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ విజయం సాధించింది. చెన్నై సూపర్ కింగ్స్‌పై 188 పరుగుల టార్గెట్‌ను కేవలం 16.4 ఓవర్లలోనే ఛేదించింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' మిచెల్ మార్ష్ (90) అద్భుతంగా ఆడాడు. అతడితోపాటు నికోలస్ పూరన్ (32★: 17 బంతుల్లో ఒక ఫోర్, 4 సిక్స్‌లు) దంచేశాడు. అనూహ్యంగా కెప్టెన్ రిషభ్ పంత్ బ్యాటింగ్‌కు దిగలేదు. ఫీల్డింగ్ సమయంలో క్యాచ్ కోసం డైవ్ చేస్తూ ఇబ్బంది పడ్డాడు. గాయం కారణంగా ఏమైనా బ్యాటింగ్‌కు రాలేదా? అనే అనుమానాలు వచ్చాయి. కానీ, డగౌట్‌లో ప్యాడ్లతో పంత్ రెడీగానే ఉన్నాడు. మ్యాచ్ అనంతరం పంత్ స్పందిస్తూ.. ఎక్కువగా అవకాశాలు రానివారిని పంపించినట్లు తెలిపాడు. మేనేజ్‌మెంట్‌తో కలిసి ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించాడు. 'చూడండి.. నేను డగౌట్‌లో ప్యాడ్లతో రెడీగానే ఉన్నా. డ్రెస్సింగ్ రూమ్‌లో మేమంతా చర్చించుకున్నాం. ఎక్కువ అవకాశాలు రానివారిని ఎందుకు పంపించకూడదని మాట్లాడుకున్నాం. అదే మా ఐడియా. దాని గురించి చాలా తీవ్రంగా ఆలోచించా. క్రీజ్‌లో నేను లేకపోతే ఎలా అని అనుకున్నా. కానీ, కుర్రాళ్లకు ఛాన్స్ ఇవ్వడం కూడా చాలా ముఖ్యం. మేనేజ్‌మెంట్ ఆలోచనలకూ గౌరవం ఇవ్వాలి. టాప్ ఆర్డర్‌లో విదేశీ క్రికెటర్లను వినియోగించుకోవాలనేది మా ఆలోచన. అందుకు తగినట్టుగానే ఆటగాళ్ల ఎంపిక కూడా ఉంది. నికోలస్ పూరన్, మార్‌క్రమ్ ఈ సీజన్‌లో అంతగా ప్రభావం చూపించలేదు. అయితే, కొన్నిసార్లు ఎంత కష్టపడినా ఫలితం మనం అనుకొనేలా రాదు. కానీ, జట్టుగా



వారిపై మాకు ఎప్పుడూ నమ్మకం ఉంది'' అని పంత్ వెల్లడించాడు. ''ఐపీఎల్ ఆసాంతం ఆకాశ్ చాలా కష్టపడ్డాడు. కొన్నిసార్లు తీవ్రంగా శ్రమించినా అవకాశాలు తక్కువగా వస్తాయి. ఎప్పుడు వచ్చినా సరే సిద్ధంగా ఉండాలి. ఆకాశ్ కూడా అలాంటి వ్యక్తే. అతడి శ్రమకు తగ్గ ఫలితం దక్కింది. ఈ సీజన్‌లో మేం మరో రెండు మ్యాచులు మాత్రమే ఆడతాం. ఇప్పుడీ విజయం కచ్చితంగా మాకు సంతోషంగా అనిపిస్తోంది. కొన్నిసార్లు అవకాశాలు వచ్చినా అందుకోలేక ఓటమి పాలయ్యాం. మిగతా మ్యాచుల్లోనూ గెలిచి లీగ్‌ను ముగిస్తాం'' అని పంత్ తెలిపాడు.

## అహ్మదాబాద్‌లో ఐసీసీ మీటింగ్.. మోసిన్ నఖ్వీ వస్తాడా?

రాబోయే ఐసీసీ త్రైమాసిక సమావేశాలు భారత్‌లో జరగనున్నాయి. మే 21న చీఫ్ ఎగ్జిక్యూటివ్స్ కమిటీ వర్చువల్ సమావేశం నిర్వహించనున్నారు. ఐపీఎల్ 2026 ఫైనల్‌కు అహ్మదాబాద్ ఆతిథ్యమివ్వనుంది. ఈ సందర్భంగా అహ్మదాబాద్‌లో



మే 30-31 తేదీల్లో ఐసీసీ బోర్డు ప్రత్యక్ష సమావేశం జరగనుంది. వాస్తవానికి ఈ త్రైమాసిక సమావేశాలను మార్చి-ఏప్రిల్‌లో దోహాలో నిర్వహించాల్సింది. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా వేదికను మార్చారు. భారత్, పాకిస్థాన్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు దెబ్బతినడంతో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (PCB) ఛైర్మన్ మోసిన్ నఖ్వీ హాజరు అవుతారా లేదా అన్నది చర్చనీయాంశంగా మారింది. మరోవైపు, ఐపీఎల్ ఫైనల్‌కు హాజరు కావాల్సిందిగా నఖ్వీకి అధికారిక ఆహ్వానం అందిందని పాకిస్థాన్ మీడియాలో వార్తలొస్తున్నాయి. ఆయన పీసీబీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి బీసీసీఐతో మంచి సంబంధాలు లేవు. ఆసియా కప్ విజేతగా నిలిచిన టీమ్ఇండియా ఆసియా క్రికెట్ కౌన్సిల్ చీఫ్‌గానూ ఉన్న నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీ అందుకోవడానికి నిరాకరించడంతో మరింత దూరం పెరిగింది. ఈ పరిణామాల నేపథ్యంలో అహ్మదాబాద్‌లో జరిగే ఐసీసీ మీటింగ్‌కు హాజరు కావడానికి నఖ్వీ.. పాక్ ప్రభుత్వం అనుమతి కోరతాడా? లేదా ప్రత్యామ్నాయంగా వర్చువల్‌గా సమావేశంలో పాల్గొంటాడా? అనేది దానిపై ఇంకా స్పష్టత లేదు.

# వుదయం సినిమా

MOVIE TIME!

## 'పురుష:'లో అన్ని రకాల ఎలిమెంట్స్ ఉంటాయి



**వుదయం సినిమా :**
'పురుష:'లో అన్ని రకాల ఎలిమెంట్స్ ఉంటాయి.. కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం దర్శకుడు వీరు వులవలబత్తుల సరస్వతి సమర్పణలో కళ్యాణ్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద బత్తుల కోటేశ్వరరావు 'పురుష:' సినిమాను నిర్మించారు. ఈ చిత్రంతో పవన్ కళ్యాణ్ బత్తుల హీరోగా పరిచయం కాబోతోన్నారు. ఈ మూవీకి వీరు వులవల దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్, సప్తగిరి, కసిరెడ్డి రాజ్ కుమార్, రాయంచ కొక్కుర, విషిక, హాసిని సుధీర్ ముఖ్య పాత్రలను పోషించారు. ఈ సినిమాను మే 22న రిలీజ్ చేయబోతున్నారు. ఈ క్రమంలో ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్లు, పాటలు, గ్లింప్స్, టీజర్ ఇలా అన్నీ కూడా ఆడియెన్స్‌లో ఇంట్రెస్ట్‌ను క్రియేట్ చేశాయి. మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా చిత్ర దర్శకుడు వీరు వులవల మీడియాతో పంచుకున్న విశేషాలివే..

## వృషకర్మ
### త్వరలో థియేట్రికల్ రిలీజ్



**వుదయం సినిమా :**
యువ సామ్రాట్ నాగ చైతన్య, కార్తీక్ దండు, ఎస్‌విసిసి & సుకుమార్ రైటింగ్స్ మిథికల్ థ్రిల్లర్ 'వృషకర్మ' పూర్తి కావస్తున్న షూటింగ్ బిటిఎస్ స్టిల్స్ రిలీజ్ త్వరలో థియేట్రికల్ రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ తండేల్ బ్లాక్ బస్టర్ విజయంతో అద్భుతంగా సాగుతున్న యువ సామ్రాట్ నాగ చైతన్య, తన తొలి బ్లాక్‌బస్టర్ 'విరూపాక్ష'తో ఆకట్టుకున్న ఫిల్మ్ మేకర్ కార్తీక్ దండుతో కలిసి ప్రతిష్ఠాత్మక మిథికల్ థ్రిల్లర్ 'వృషకర్మ' చేస్తున్నారు. మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తుండగా, స్పర్శ్ శ్రీవాస్తవ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఎస్‌వీసీసీ, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని బాపినీడు సమర్పిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ అద్భుతమైన రెస్పాన్స్‌తో 20 మిలియన్ వ్యూస్ దాటి దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొల్పింది. ప్రస్తుతం 'వృషకర్మ' షూటింగ్ చివరి దశకు చేరుకుంది.
తాజాగా రాజస్థాన్‌లో జరిగిన భారీ షెడ్యూల్‌కు సంబంధించిన బీహైండ్ ది సీన్స్ స్టిల్స్‌ను మేకర్స్ విడుదల చేశారు. రాజభవనాలు, పురాతన శిల్పకళతో అలరారుతున్న లొకేషన్స్‌లో చిత్రీకరించిన కీలక సన్నివేశాలు సినిమాకి ఉన్న భారీ విజువల్ స్కేల్‌ను చూపిస్తున్నాయి. ప్రధాన నటీనటులంతా పాల్గొన్న ఈ షెడ్యూల్ కథలో కీలకంగా ఉండబోతుంది. ఈ స్టిల్స్ ద్వారా సినిమాకి ఉన్న మిస్టిక్ టోన్, గ్రాండియర్ మరింత స్పష్టమవుతోంది.షూటింగ్ ముగింపు దశకు చేరుకోవడంతో పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. భారీ స్థాయిలో CGI, అత్యాధునిక విజువల్ ఎఫెక్ట్స్ ఉపయోగిస్తూ భారతీయ ప్రేక్షకులకు ఎప్పుడూ చూడని సినీ అనుభూతిని అందించేందుకు టీమ్ పని చేస్తోంది. మిస్టికల్ ఎలిమెంట్స్‌ను రిచ్ డీటైలింగ్‌తో, ఇమర్సివ్ వరల్డ్ బిల్డింగ్‌తో అద్భుతంగా తెరపై ఆవిష్కరించబోతున్నారు.
'వృషకర్మ' చిత్రానికి టాప్ టెక్నికల్ టీమ్ పని చేస్తోంది. సినిమాటోగ్రాఫర్ రాగుల్ డి హెరియన్ అద్భుతమైన విజువల్ స్టైల్‌ను అందిస్తుండగా, అజనీష్ బి లోక్‌నాథ్ సంగీతం సమకూరుస్తున్నారు. ప్రొడక్షన్ డిజైనర్ శ్రీ నాగేంద్ర తంగాల ఈ చిత్రంలోని మిస్టిక్ ప్రపంచాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు. నవీన్ నూలి ఎడిటర్.

## దర్శకుడిగా కొత్త ప్రయాణం



రామ్

**వుదయం సినిమా :**
యువ కథానాయకుడు రామ్ పోతినేని మెగాఫోన్ పట్టుకోనున్నారు. తన 23వ చిత్రానికి తానే దర్శకత్వం వహిస్తున్నట్టుగా శుక్రవారం ఓ కొత్త పోస్టర్‌తో అధికారికంగా ప్రకటించారు. ఆయన సోదరుడు కృష్ణ పోతినేని రాపో సినిమాటిక్స్ పతాకంపై నిర్మించనుండడం విశేషం. శుక్రవారం రామ్ పుట్టినరోజు. ఈ సందర్భంగానే తన కొత్త ప్రయాణానికి సంబంధించిన సంగతుల్ని వెల్లడించారు. సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కనున్న ఈ సినిమాలో రామ్ పోతినేని వీరా పాత్రలో సందడి చేయనున్నారు. ఒంటరి తోడేలు కథ... అంటూ పోస్టర్‌లో సూచించారు. రామ్ స్వయంగా సిద్ధం చేసిన కథతో రూపొందనున్న ఈ సినిమా రెగ్యులర్ చిత్రీకరణని జూన్‌లో ప్రారంభించి, డిసెంబరులో ప్రేక్షకుల ముందుకు తీసుకు రానున్నారు. రామ్ కథానాయకుడిగానే కాకుండా, గాయకుడిగా, గేయ రచయితగా ప్రతిభని చాటారు. అందరి ప్రేమ, ఆశీస్సులతో ఈ కొత్త ప్రయాణం ప్రారంభిస్తుండడం ఆనందంగా ఉందన్నారు రామ్. ఆయన ఇందులో స్టైలిష్ అవతారంలో సందడి చేయనున్నట్టు పోస్టర్ చాటుతోంది.

## 'పెద్ది' ఫైట్ మాస్టర్ నబాకాంత్



**వుదయం సినిమా :**
పెద్ది'లో రామ్ చరణ్ గారి పెర్ఫార్మెన్స్, యాక్షన్ సీక్వెన్స్‌లు నెక్స్ట్ లెవల్‌లో ఉంటాయి. ప్రతి యాక్షన్ ఎపిసోడ్ ఇప్పటివరకు ఎప్పుడూ చూడని విధంగా ఉంటుంది. 'పెద్ది' జర్నీ ఎమోషనల్‌గా అందరికీ కనెక్ట్ అవుతుంది:
మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ రూరల్ యాక్షన్ డ్రామా 'పెద్ది'. బుచ్చి బాబు సానా దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఇప్పటికే చార్ట్ బస్టర్ పాటలు, అద్భుతమైన గ్లింప్స్ తో సినిమాపై అంచనాలు భారీ స్థాయికి చేరుకున్నాయి. ఈ చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఫైట్ మాస్టర్ నబాకాంత్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**మీ నేపథ్యం గురించి చెప్పండి?**
మాది మణిపూర్. అయితే నా చిన్నప్పుడే హైదరాబాద్ వచ్చేశాం. ఇక్కడే పెరిగాను. నాన్నగారి ఇన్‌స్పిరేషన్‌తో నేను ఇదే ఫీల్డ్‌లో 14 ఏళ్ల వయసు నుంచి ఉన్నాను. స్టంట్స్‌లో 18 ఏళ్ల అనుభవం ఉంది.
అసిస్టెంట్ మాస్టర్‌గా విజయ్ మాస్టర్ దగ్గర, రామ్‌లక్ష్మణ్ మాస్టర్ల దగ్గర పని చేశాను. 'పుష్ప' మూవీతో యాక్షన్ కొరియోగ్రాఫర్ అయ్యాను. ఆ తర్వాత 'పుష్ప 2',మనశంకర వరప్రసాద్, 'డకాయిట్'... ఇప్పుడు 'పెద్ది' సినిమాలు చేస్తున్నాను.

**'పెద్ది' అవకాశం ఎలా వచ్చింది?**
'పుష్ప 2' జరుగుతున్నప్పుడే బుచ్చిబాబు గారు నాతో మాట్లాడారు. 'పెద్ది'లో ఇంట్రడక్షన్ సీక్వెన్స్ గురించి చెప్పారు. అది యాక్షన్ సీక్వెన్స్ కాదు కానీ యాక్షన్‌లా ఉండాలని అన్నారు. నాకు చాలా సర్ప్రైజ్‌గా అనిపించింది. అలా ఆ సీక్వెన్స్ కోసం గ్లింప్స్‌లో చూపించిన బ్యాటింగ్ స్టైల్ షాట్ కంపోజ్ చేశాను. అది దేశవ్యాప్తంగా చాలా వైరల్ అయింది. దానికి సంబంధించిన క్రెడిట్ మొత్తం బుచ్చిబాబు గారు నాకే ఇచ్చారు. ఆయనది చాలా మంచి మనసు.
'పెద్ది'లో ఎమోషన్స్ అద్భుతంగా ఉంటాయి. చరణ్ గారు ప్రేక్షకులను 'పెద్ది' వరల్డ్‌లోకి తీసుకెళ్లిపోతారు. ఆయన పెర్ఫార్మెన్స్ పీక్స్‌లో ఉంటుంది. సినిమాలో యాక్షన్ మరో లెవెల్‌లో ఉంటుంది. ప్రతి ఎపిసోడ్ ఫ్రెష్‌గా ఉంటుంది.
బుచ్చిబాబు గారు ఇచ్చిన యాక్షన్ సీక్వెన్స్‌లు అన్నీ కూడా చాలెంజ్‌గా తీసుకుని చేసినవే. ఇంట్రో దగ్గర నుంచి క్లైమాక్స్ వరకు ప్రతి ఎపిసోడ్ చాలా ఫ్రెష్‌గా ఉంటుంది. కంటెంట్ చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుంది.

**బ్యాటింగ్ షాట్ ఎలా కంపోజ్ చేశారు?**
నేను హఫీజ్‌పేట్‌లో పెరిగాను. అది ఫుల్ మాస్ ఏరియా. చిన్నప్పుడు క్రికెట్ ఆడేటప్పుడు ఎలాగైనా సిక్స్ కొట్టాలనే తాపత్రయం వుంటుంది. ఆ తాపత్రయంతో బ్యాట్‌ని కింద నుంచి గట్టిగా కొట్టేవాళ్లం. అలాంటి మాస్ స్టైల్ నుంచే ఆ షాట్ పుట్టింది.

## 'హనుమాన్' 3Dలో జూన్ 25న రిలీజ్

**వుదయం సినిమా :**
తేజ సజ్జ, ప్రశాంత్ వర్మ, కె. నిరంజన్ రెడ్డి, ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్ 'హనుమాన్' తెలుగు, హిందీలో 3Dలో జూన్ 25న రిలీజ్ సూపర్ హీరో తేజ సజ్జా, క్రియేటివ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ కాంబినేషన్‌లో వచ్చిన సంచలన బ్లాక్‌బస్టర్ 'హనుమాన్' మరోసారి భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. పురాణ గాథలు, భావోద్వేగాలు, ఆధునిక కథనాన్ని అద్భుతంగా మిళితం చేసి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ నేషనల్ అవార్డ్ విన్నింగ్ చిత్రం ఇప్పుడు గ్రాండ్ 3D మేకోవర్‌తో 2026 జూన్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది.ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కె. నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఫస్ట్ రిలీజ్ సమయంలో తన అద్భుతమైన వరల్డ్ బిల్డింగ్, గొప్ప కథనం, అద్భుతమైన సాంకేతిక నైపుణ్యాలతో చరిత్ర సృష్టించింది. ఇప్పుడు 3D ఫార్మాట్‌లో 'అంజనాద్రి' ప్రపంచాన్ని మరింత గ్రాండియర్‌గా, ప్రేక్షకులను పూర్తిగా మైమరపించేలా అనుభూతి కలిగించేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారు.ఈ చిత్రంలో అమృత అయ్యర్ కథానాయికగా నటించగా, సినిమాటోగ్రాఫర్ దాశరథి శివేంద్ర అద్భుతమైన విజువల్స్‌తో ప్రత్యేక ప్రపంచాన్ని సృష్టించారు. గౌర హరి, అనుదీప్ దేవ్ అందించిన సంగీతం సినిమాకి ఎమోషన్‌ని తీసుకొచ్చి, ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించింది.





## 'సింగ్ గీతం' మంచి ఫన్ సినిమా

**వుదయం సినిమా :**
సింగీతం గారి స్టయిల్ లో కొత్త ఎక్స్‌పెరిమెంట్. నేను నిర్మించిన 'జాతిరత్నాలు' చిత్రాన్ని ఎలా ఎంజాయ్ చేశారో ఈ సినిమాను కూడా అలాగే ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నాను: హలో బాసు సాంగ్ లాంచ్ ఈవెంట్ లో విజనరీ డైరెక్టర్ నాగ్ అశ్విన్సింగీతం శ్రీనివాసరావు, నాగ్ అశ్విన్, వైజయంతి మూవీస్, స్వప్న సినిమాస్ మ్యూజిక్ ఫాంటసీ మూవీ 'సింగ్ గీతం' నుంచి హలో బాసు సాంగ్ లాంచ్లెజెండరీ డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్ట్ 'సింగ్ గీతం'తో ముందుకు వస్తున్నారు. దశాబ్దాల పాటు సాగిన తన కెరీర్‌లో, పలు భాషల్లో దాదాపు అరవై చిత్రాలతో ఇండియన్ సినిమాని రీడిఫైన్ చేసిన సంగీతం, 94 ఏళ్ల వయసులో డైరెక్టర్ చైర్‌లోకి తిరిగి వస్తూ, సృజనాత్మకతకు హద్దులు లేవని మరోసారి నిరూపిస్తున్నారు.
ఈ చిత్రం సంగీతం, మ్యాజికల్ రియలిజంను మేళవించి ఓ యూనిక్ అనుభూతిని అందిస్తుంది. వైజయంతి మూవీస్, స్వప్న సినిమా వంటి ప్రతిష్ఠాత్మక బ్యానర్ల పై నాగ్ అశ్విన్ నిర్మించిన ఈ ప్రాజెక్ట్, ఒక దిగ్గజ దార్శనికుడిని, లెజండరీ నిర్మాణ సంస్థను ఒకచోట చేర్చింది. ఇప్పటికే విడుదలైన 'సింగ్ గీతం' టీజర్ అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.ఈ రోజు మేకర్స్ ఈ సినిమా నుంచి హలో బాసు సాంగ్ లాంచ్ చేశారు. 'హలో బాసు' సాంగ్ పూర్తి స్థాయి ఫన్‌ఫుల్ ఎనర్జీతో ఆకట్టుకుంటోంది. మాటలే పాటగా మారిపోయే కాన్సెప్ట్ ఈ సాంగ్‌కి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## 12 కోట్ల ఆఫర్‌ను తిరస్కరించింది అందుకేనా!



**వుదయం సినిమా :**
వరుస సినిమాలతో సందడి చేస్తున్నారు నటి త్రిష. ఇప్పుడు ఆమెకు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అగ్ర కథానాయకులు కమల్ హాసన్ రజనీకాంత్ కలిసి నటిస్తోన్న చిత్రంలో ఆమెను ఎంపిక చేసినట్లు గతంలో వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో రానున్న ఈ చిత్రం కోసం ఆమె భారీగా పారితోషికం తీసుకోనున్నట్లు కూడా ఎన్నో వార్తలు చక్కర్లు కొట్టాయి. అయితే, తమిళనాడు ఎన్నికల ఫలితాల అనంతరం త్రిష సినిమాల ఎంపికల్లోనూ ఎన్నో విషయాలు ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. అందులోభాగంగానే ఈ సినిమా కోసం ఏకంగా రూ.12 కోట్లు ఆఫర్ చేసినప్పటికీ ఇందులో నటించేందుకు ఆమె (Trisha) సుముఖత చూపించడం లేదని ఆంగ్ల మీడియాలో కథనాలు వస్తున్నాయి.
కమల్ హాసన్ రజనీకాంత్ (Rajinikanth) 46 ఏళ్ల తర్వాత కలిసి నటిస్తుండడంతో ఈ ప్రాజెక్ట్‌పై అందరిలో ఆసక్తి నెలకొంది. వీరి స్థాయికి తగినట్లే అగ్రకథానాయికను ఎంపిక చేయాలని టీమ్ త్రిషను తీసుకోనుందని గతంలో వార్తలు వచ్చాయి. భారీ పారితోషికం ఆఫర్ చేసినప్పటికీ ఆమె దీన్ని రిజెక్ట్ చేయడం వెనక బలమైన కారణం ఉందని టాక్. ఈ సినిమాను ఉదయనిధి స్టాలిన్‌కు చెందిన రెడ్‌జెయింట్ నిర్మాణసంస్థ తెరకెక్కించడంతో ఆమె తిరస్కరించినట్లు ఆంగ్ల మీడియా పేర్కొంది. అసలు త్రిష ఈ ప్రాజెక్ట్‌లో నటిస్తున్నారా లేదా అనే దానిపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.

## 'మరీచిక' ట్రైలర్ విడుదల



**వుదయం సినిమా :**
చిలకా ప్రొడక్షన్స్ థ్రిల్లర్ 'మరీచిక' ట్రైలర్ విడుదల.. ప్రేమ, ద్రోహం, ప్రతీకారంతో నిండిన కథ.. మే 29న వరల్డ్ వైడ్‌గా మూవీ గ్రాండ్ రిలీజ్‌నేషనల్ అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ సతీష్ కాసెట్టి తన కొత్త థ్రిల్లర్ మూవీ 'మరీచిక'తో మరోసారి తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి సిద్ధమయ్యారు. వైవిధ్యమైన , ఆలోచింపజేసే కథలను చూపడంలో ప్రత్యేక గుర్తింపు పొందిన డైరెక్టర్ మరోసారి తనదైన శైలిలో ఈసారి కూడా ఆసక్తికరమైన సినీ అనుభూతిని అందించినట్టు ట్రైలర్ చూస్తుంటే అనిపిస్తోంది.'మరీచిక' ట్రైలర్‌ను గమనిస్తే ఎమోషన్స్‌తో పాటు మిస్టరీ అంశాలతో ప్రారంభమైంది. ఇందులో వెంకట లక్ష్మి అనే పల్లెటూరి అమ్మాయి పాత్రలో అనుపమ పరమేశ్వరన్ కనిపించారు. సంజు పాత్రలో విరాజ్ అశ్విన్ కనిపించగా.. మరీచిక పాత్రలో రెజీనా కసాండ్రా కనిపించారు. సంజుని మరీచిక చంపేసిందంటూ అనుపమ పరమేశ్వరన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయటం.. ఆ తర్వాత కొన్ని ఇంట్రెస్టింగ్ సీన్స్.. తర్వాత సంజు పాత్రను పరిచయం చేయటం.. తర్వాత మరీచిక పాత్రను పరిచయం చేయటం.. ఏ పాత్రకు ఆ పాత్ర మరో పాత్రతో సంబంధం ఉన్నట్లు, లేనట్లు చూపించి సినిమాపై ఆసక్తిని క్రియేట్ చేశారు. ఎన్నారై అమ్మాయి మరీచిక పాత్రలో రెజీనా కనిపించింది. ఈ మూడు పాత్రల మధ్య జరిగిన ఎమోషనల్, థ్రిల్లింగ్ ట్విస్టులు, టర్నులతో సినిమా ఉండనుందని ట్రైలర్‌తో తెలుస్తోంది.



## గీతం 'రీంగారా..రీంగారా' విడుదల

**వుదయం సినిమా :**
విజయ్ ఆంటోని హీరోగా శశి దర్శకత్వంలో వచ్చిన 'బిచ్చగాడు' ఎవర్ గ్రీన్ బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ఇక ఇన్నేళ్ల తరువాత మళ్లీ 'బిచ్చగాడు' మ్యాజిక్ రిపీట్ చేసేందుకు 'వంద దేవుళ్ళు' అనే సినిమాతో విజయ్ ఆంటోనీ, శశి ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నారు. ఈ సినిమాలో విజయ్ ఆంటోని, స్వాసిక, అజయ్, కావ్య, శక్తి, పదిని, కర్నాస్, బాలాజీ శక్తివేల్, దివాకర్, అరుళ్ దాస్, బక్స్, వినోదిని, మునిష్ కాంత్, కొడంగి వడివేలు తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు.మరీ ముఖ్యంగా మదర్ సెంటిమెంట్‌తో సాగే 'అమ్మ అమ్మేగా' అనే పాట అందరినీ కదిలించింది. ఇక ఇప్పుడు ఒక రొమాంటిక్, మెలోడీ గీతాన్ని రిలీజ్ చేశారు. ఈ పాటలో లిజమోల్ జోస్, అజయ్ ధీషాన్ జంట ఆకట్టుకుంటోంది. 'రీంగారా' అంటూ సాగే ఈ పాటను భాష్య శ్రీ ఎంతో అద్భుతంగా రాశారు. ఆయన సాహిత్యం ఎంతో వినసొంపుగా ఉంది. బాలాజీ శ్రీరామ్ బాణీ ఎంతో శ్రావ్యంగా ఉంది. సంతోష్ హరిహరణ్, మానసి జి కణ్ణన్ ఆలపించిన ఈ పాట అందరినీ ఆకట్టుకునేలా ఉంది.

## క్రాస్ స్టేట్ రియాల్టీ షో జంగిల్ బుగీ కర్టెన్ రైజర్ ఈవెంట్



**వుదయం సినిమా :**
క్రాస్ స్టేట్ రియాల్టీ షో జంగిల్ బుగి కర్టెన్ రైజర్ ఈవెంట్ శుక్రవారం హైదరాబాద్ లో ఘనంగా జరిగింది. ఈ రియాల్టీ షోలో తెలుగు లయన్స్, హిందీ హాక్స్, తమిళ్ టైగర్స్, మావెరిక్స్, కన్నడ పాంతర్స్...ఇలా ఐదు టీమ్స్ పాల్గొననున్నాయి. ఈ నెల 17,18వ తేదీల్లో హైదరాబాద్ లో ప్రసాద్ ల్యాబ్స్ వేదికగా జరిగే ఆడిషన్స్ నుంచి వివిధ దశల వడబోత తర్వాత పోటీదారులను ఎంపికచేయనున్నారు. శనివారం జరిగిన జంగిల్ బుగి కర్టెన్ రైజర్ ఈవెంట్ లో
ఈ నెల 17, 18 తేదీల్లో ఆడిషన్స్ నిర్వహిస్తున్నారు. 90 రోజులు అడివిలో ఉండి సాహసాలు చేసే ఈ రియాల్టీ షో పార్టిసిపెంట్స్ తో పాటు షో నిర్వాహకులకు కూడా ఒక ఛాలెంజ్ అనుకోవచ్చు. ఎగ్జైటింగ్ కాన్సెప్ట్ తో వస్తున్న జంగిల్ బుగి రియాల్టీ షో అన్ని భాషల్లో మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా. అన్నారు.
డైరెక్టర్ యశోధర విక్రమ్ మాట్లాడుతూ నేను దర్శకుడిగా, రైటర్ గా కన్నడ చిత్ర పరిశ్రమలో పలు చిత్రాలు చేశాను. ఈ కాన్సెప్ట్ నా మిత్రుడు వినోద్ ఇచ్చారు. ఆయన గతంలో కొన్ని రియాల్టీ షోస్ చేశారు. నేను ఒక మూవీ కోసం ఆయన దగ్గరకు వెళ్లినప్పుడు ముందు ఈ రియాల్టీ షో చేద్దాం ఆ తర్వాత సినిమా చేద్దాం అన్నారు. ప్రముఖ ఛానెల్స్ ను అప్రోచ్ అయ్యాం. పైలట్ ఎపిసోడ్ అడిగారు. త్వరలోనే వారి నుంచి అప్రూవల్ వస్తుంది. జంగిల్ బుగికి దర్శకత్వం వహించడం ఛాలెంజింగ్ గా తీసుకున్నాను. మీ అందరి సపోర్ట్ మాకు ఉంటుందని ఆశిస్తున్నాం. అన్నారు.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Sri Rama Avadutha Offset, 9-2-57, Mayuri Centre, Khammam - 507001 and Published from H. No. 10-6-77, Mamillagudem, Khammam - 507001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. APTEL/2013/53008. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.